
Website : www.saisadguruvani.org

"గురుపూర్ణిమ" ప్రత్యేక సంచిక

శ్రీ భరద్వాజ

# సద్గురువాణి





సంపుటి-21

జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2021

సంచిక-3



శ్రీ దత్తసాయి మాస్టర్ సంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక

# ఆధ్యాత్మిక-సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - పవర్‌సిటీ

## (2021 ఏప్రిల్, మే, జూన్ లో నిర్వహించిన కార్యక్రమాలు)




ఈ పేజీ సమర్పించిన వారు :

పూర్తి వివరములకు 23వ పేజీ చూడగలరు

గురుపూర్ణిమ మరియు వినాయక చవితి శుభాకాంక్షలతో... శ్రీమతి & శ్రీ ఆర్. స్రవంతి శ్రీనివాస్

శ్రీమతి & శ్రీ ఆర్. రామలక్ష్మి శ్రీనివాసరావు,
చి॥ సాయి సరోజ నిహిత - శ్రీకాకుళం

శ్రీమతి & శ్రీ స్వర్ణలత, నరసింహ పట్నాయక్
విజయనగరం

శ్రీ భరద్వాజ
# సద్గురువాణి


సంపుటి - 21 జూలై, ఆగష్టు, సెప్టెంబర్ - 2021 సంచిక - 3

**శ్రీ దత్తసాయి మాస్టర్ సాంప్రదాయ ప్రచార విజ్ఞాన త్రైమాస పత్రిక**

ప్రధాన సంపాదకులు :
**శ్రీ వి.వి. పూర్ణచంద్రరావు**

'గురుపూర్ణిమ' ప్రత్యేక సంచిక

నిర్వహణ :
**శ్రీ సాయి మాస్టర్ భక్త బృందము**



"పని చెయ్యి, దేవుని నామం ఉచ్చరించు, సద్గ్రంధాలు చదువు, పోటీలు, వంతులు, కీచులాటలు మానితే దేవుడు కాపాడతాడు"

- శ్రీ శిరిడీ సాయిబాబా

## చందా వివరములు

| | | | |
|---|---|---|---|
| విడి ప్రతి | - | రూ॥ | 10/- |
| సంవత్సర చందా (పోస్టేజితో) | - | రూ॥ | 50/- |
| 3 సం॥ల చందా | - | రూ॥ | 150/- |
| 5 సం॥ల చందా | - | రూ॥ | 250/- |
| పోషకులు (ఉదారులు) | - | రూ॥ | 1000/- |

మనియార్డర్లు పంపవలసిన చిరునామా :

**శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**

**C/o. శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు,**

ప్లాట్ నెం. 13, పవర్ సిటీ, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
పరవాడ (మం), విశాఖపట్నం - 531 021.
సెల్ : 9849645224


E-mail : poorna.sai09@gmail.com
Website : www.saisadguruvani.org
Facebook : Sri Shiridi Sai Seva Trust
Co-Ordinator at USA : Sri K. KARUNAREDDY

## విషయ సూచిక


ఆధ్యాత్మిక-సామాజిక సేవలో చిత్రమాలిక... లోపలి కవర్ పేజీ
1. విషయసూచిక ........ 1
2. మా మాట ........ 2
3. గురుపూర్ణిమ ........ 4
4. ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటేచాలు ........ 5
5. ఆచార్య దేవోభవ ........ 7
6. శ్రీగురు చరితామృతము ........ 9
7. పండుగలు - పర్వదినాలు ........ 11
8. శ్రీ గురుభ్యోనమ: ........ 12
9. ఒక్క క్షణం ........ 13
10. జిజ్ఞాస ........ 15
11. జిల్లెళ్ళమూడి అమ్మ ........ 16
12. శ్రీ నారాయణ మహరాజ్ ........ 17
13. పూర్ణ అంతరంగాలు ........ 19
14. ఆధ్యాత్మిక - సామాజిక సేవలో ........ 23
15. మేము సహితం ........ 25
16. జన్మదిన శుభాకాంక్షలు ........ 26
17. శ్రీ తాజుద్దీన్ బాబా ........ 30
18. శ్రీ గురు సిద్ధారూఢ స్వామి ........ 31
19. భగవంతుడిని మనం ఏమి కోరాలి? ........ 32
20. లోకమాన్యుడు - శ్రీ గజానన్ ........ 33
21. దారం తెగిపోకుండా చూసుకో ........ 35
22. స్వామి కేశవయ్యజీ ........ 36
23. అనంత పద్మనాభస్వామి అష్టోత్తరం ........ 37
24. మన సంప్రదాయాలు-పోలాల అమావాస్య ........ 38
25. స్ఫూర్తి ప్రధాత (గిడుగు వెంకట రామమూర్తి) ........ 39
26. శ్రీ గణేశాయనమ: ........ 40
27. ఆదర్శమూర్తి డాక్టర్ సర్వేపల్లి ........ 41
28. గురుపూర్ణిమ మహోత్సవం ........ 42
29. బాలవికాశం ........ 43
30. పుస్తక పరిచయం ........ 44
31. తెలుసుకుందాము ........ 45
32. గురు దక్షిణ ........ 46
33. ఈ యుగావతారం శ్రీ సాయి ........ 47
34. ఏరిన ముత్యాలు ........ 48







## పాఠకులకూ ప్రకటన కర్తలందరికీ గురుపూర్ణిమ మరియు శ్రావణపౌర్ణిమ శుభాకాంక్షలు

"జీవితం ఒక ప్రయాణం లాంటిది, గమ్యం చేరే లోపల ఎందరెందరితోనో పరిచయాలు, పలకరింపులు, అనుభూతులు, అనుభవాలు, ఒక్కొక్కటి ఒక్కొక్కరకమైన అనుభూతి, అనుభవం. వాటిలో ఇష్టమైనవి, అయిష్టమైనవి, సహించేవి, సహించరానివి, ఇట్లా ఎన్నెన్నో. మొదటనే కలసేవారు కొందరు, కొంతదూరం కలసి పయనం చేసేవారు మరి కొందరయితే, మధ్యలో వచ్చి మధ్యలో వెళ్ళిపోయేవారు మరి కొందరు. ఏది ఏమయినా, జీవిత ప్రయాణంతోపాటుగా, మన మెదిలే భావాలను సరిచేసుకుంటూ గమ్యం చేరటం మన కర్తవ్యం. గమ్యం చేరేలోపల కలిగే అనుభవాలు కొన్ని ఎట్లా ఉండాలో నేర్పితే, మరికొన్ని ఎట్లా ఉండకూడదో తెలియచేస్తయ్యి. అందులో మన పాత్ర ఎంత? మనం ఆశించినట్లుగా, కోరుకున్నట్లుగా ఇతరులు ఉండాలని భావిస్తున్నామా! లేక, ఇతరులకు ప్రీతి కలిగించాలని ఉంటున్నామా! లేక సద్గురువు సంప్రీతి అయ్యేలా జీవిస్తున్నామా! అని పరిశీలించుకుంటూ సాగితే, మన జీవన ప్రయాణం ఏ దిశగా సాగుతున్నదో తెలుస్తుంది. అప్పుడు కన్నుల ఎదుట కనిపించే ప్రతీదీ గురుస్వరూపముగా గోచరిస్తుంది. అదే సరియైన దృష్టి కలగటము. అప్పుడు అంతా ఆనందమే. రాగద్వేషాలు, ఈర్ష అసూయలు, ఇష్టా అయిష్టాలకు తావు లేకుండా పోతుంది". రైలుతోపాటు పరుగెదుతున్న నా ఆలోచనా సవ్రంతికి, రైలు విజయవాడ స్టేషనులో ఆగి, అక్కడి వ్యాపారుల అరుపులు, ప్రయాణీకుల హడావుడి కేకలతో స్వస్తి పలికేను. ఈ లోపల నా ఎదురుగా ఉన్న సీట్లలోకి ఇద్దరు వచ్చి కూర్చున్నారు. కొంత సమయం తరువాత రైలు తన గమ్యం వైపు పరుగెత్తటం ప్రారంభించింది. మరల నా ఆలోచనలవెంట పరిగెత్తాలనుకున్నాను గాని, పెద్దగా మాట్లాడుకుంటున్న నాఎదుటి వారి మాటలు అందుకు సహకరించక పోవటంతో మౌనంగా ఉండిపోయినాను. వారు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ నాపేరు అడిగేరు, చెప్పేను. వారిలో ఒకరిపేరు ప్రభావతి, ఇంకొకరి పేరు సుధాలక్ష్మి. పరస్పర పరిచయాలు అయిన తరువాత, టి.వి. సీరియల్స్, నగలు, బట్టలు, చుట్టాలు ఇంకా ఎన్నెన్నో విషయాలు మాట్లాడుకుంటూ, మధ్యలో అమ్మవచ్చిన తినుబండారాలు తీసుకొని ఆరగిస్తు, తరిగిపోతున్న శారీరక శక్తిని పెంచుకుంటూ, నోటిలోని పళ్ళకు, నాలుకకు క్షణం తీరిక లేకుండా గడపసాగేరు. చివరకు వారి ప్రస్తావన శిరిడీ సాయిబాబా దగ్గరకు వచ్చి ఆగింది. "నాకు సాయిబాబా అంటే చాలా ఇష్టం, ప్రతి ఆరునెలలకు ఒక్కసారి, ఎటువంటి పరిస్థితులలోనైనా మా వారితో కలసి శిరిడీ వెళ్ళి వస్తాము, అట్లా వెళితేగాని తృప్తి ఉండదు, మొదట్లో చాలా చిన్న చిన్న వ్యాపారాలు చేసి దెబ్బ తిన్నాము. చివరకు బాబాను నమ్ముకోవటంతో మావ్యాపారం అభివృద్ధి చెందింది. మా సంస్థకు కూడ సాయి పేరే పెట్టాము, అప్పటినుంచి ఇంకా బాగా అభివృద్ధిలోకి వచ్చాము. నేనే గాదు మాయింట్లో అందరూ బాబా భక్తులే, బాబా అంటే చాలా పిచ్చి మా వారికి, పిల్లలకు. నేను గురువారం ఏ ఊరు అయినా వెళితే అక్కడకూడ తలస్నానం చేసి, దగ్గరలోని బాబా గుడికి వెళ్ళి, కొబ్బరికాయ కొట్టి, పాలకోవా నైవేద్యం పెట్టి రావల్సిందే. ఇక నేనే కాదు, మాయింట్లో అందరూ గురువారం ఒంటిపూట భోజనమే, రాత్రి పూట ఫలహారం చేస్తాము. మొదట్లో బాబాను పూజించినందుకు ఎద్దేవచేసిన మా బంధువులందరూ మా స్థితి బాగుండటంతో మావద్దకు రావటం మొదలుపెట్టేరు. చెప్పకూడదు గాని, మా బంధువులందరూ మా అంతటి బాబా భక్తులు లేరని అంటుంటారు. మా ఇంట్లో ఏ కష్టమొచ్చినా, నష్టమొచ్చినా, బాబా తీర్చాల్సిందే, మా ఆదాయంలో కొంత భాగం ఆయన హుండీలో వేస్తాము. నష్టమొస్తే ఏమిచేయలేమనుకోండి. దాదాపు అట్లాంటి పరిస్థితి బాబా రానీయడు లెండి! ఇంక రానివ్వడని నా ఉద్దేశ్యం. ఎందుకంటే పొద్దున్నే స్నానం చేసి బాబా దగ్గర అగరబత్తి వెలిగిస్తే గాని, ఏపని మొదలుపెట్టను కదా" అంటూ మొదటి ఆవిడ బాబాపై తన భక్తి భావాన్ని వెళ్ళడిచేశారు. "నేను మీ అంత భక్తురాలిని కాదుగాని, ఏదో బాబా సేవచేసుకుంటుంటాను. మొదట్లో మేము చాలా ఆర్థిక ఇబ్బందులు పడ్డాము. ఏమి చేయాలో తోచలేదు, చివరకు మా బంధువులు ఒకరు బాబా ఫోటో ఇచ్చి పూజించమంటే, దానిని మాఇంట్లో పెట్టి పూజించాము. మా ఆర్థిక పరిస్థితి బాగుపడకపోయినా, ఇబ్బందులు తగ్గుతున్నయ్యి. ఇట్లా కాదు, పదిమందికి బాబా గురించి చెబితే, వారితో పాటు మా ఇబ్బందులు ఇంకా తొలగుతాయి అని అనిపించి, మా ఊరిలోని రామాలయంలో బాబా ఫోటో పెట్టి, బాబా గురించి అందరికీ తెలియజేస్తూ, గురువారాలు భజనలు ప్రారంభించాను. మొదట్లో ఒకరిద్దరు వచ్చినా క్రమేపీ జనం బాగానే రావటం మొదలుపెట్టేరు. భక్తులు ఇచ్చేవాటితో ఆ వారం గడిచిపోతుంది, ఒకరకంగా బాగానే ఉందనుకున్నాను. భక్తులు పెరుగుతున్న కొద్దీ మా ఆర్థిక పరిస్థితి మెరుగవుతున్నది. చివరకు అందరినీ ఉత్తేజపరచి, వారిద్వారా ఒక బాబా దేవాలయం నిర్మించి నేనే నిర్వహిస్తున్నాను. ఏదో ఒక సమస్యతో వచ్చే వారికి "బాబా వాక్కు" అని, ఇది చెయ్యండి, అది ఇవ్వండి అని చెబుతుంటా. తీరనివారి సంఖ్య పక్కన పెడితే, సమస్య తీరినవారు మరికొందరిని తీసుకువస్తున్నారు. ప్రస్తుతం మా ఊరిలో నా పరిస్థితి బాగుంది. గత జన్మలో నేను బాబా శిష్యురాలినై ఉంటానని అందరూ అంటుంటారు. నా వద్దకు చాలామంది సాయిభక్తులు వస్తుంటారు. అందరూ నన్ను "సాయిమాత" అని పిలుస్తుంటారు" అని తన విషయాన్ని తెలియజేసింది రెండవ ఆమె. అంతరాయం లేకుండా

మాట్లాడటం వల్లనేమో ఒకరికొకరు అలసిపోయి, కొంతసేపు మౌనం వహించారు. నెమ్మదిగా వారిద్దరి చూపు నావైపు సాగింది. "ఏమిటి మీరేం మాట్లాడటం లేదేమి? మౌనంగా కూర్చున్నారు. మీ చేతివేలుకున్న బాబా ఉంగరం చూస్తుంటే, మీరు కూడ బాబా భక్తురాలనిపిస్తుంది, మీ విషయం కూడ చెబితే కొంత సమయం గడుస్తుంది" అని మొదటి ఆమె అంటే. "ఏమిటండీ! మీరు మరీను! ఆమె అంతలా అడుగుతుంటే పెదవి విప్పరేం. కొంపతీసి మీరు మౌనవ్రతంలో లేరుకదా!" మేము సాయిభక్తులం, శిష్యులమే కదా మాతో మాట్లాడవచ్చు అన్నారు రెండోఆమె. ఇంకనోరు విప్పకపోతే ఇంకా ఎంతో దూరం మాట్లాడటం ప్రారంభిస్తారు అని భావించి, నోరు విప్పేను. "మీరనుకున్నట్లు నేను బాబా భక్తురాలిని కాదు, శిష్యురాలిని అంతకంటే కాదు" అన్నాను. ఒక్కసారిగా వారిద్దరు ప్రశ్నార్ధకమైన మొహం పెట్టి కొంచెం వెటకారంగా "బాబా భక్తులు, శిష్యులు కాకుండా దేనికోసం బాబా ఉంగరం పెట్టుకున్నారు, 'అలంకరణకోసమా," అన్నారు. "మీరనుకున్నది ఏదీకాదు. నాకు అండకోసం, బాబా నాతో ఉన్నాడు అని ఎరుకగలిగి జీవించటం కోసం. లౌకికమైన సుఖశాంతులను ఆశించి, అవసరాలకోసం వ్యక్తులపై చూపించే అభిమానాన్ని ప్రేమ అని అంటారు. అవతలవారి నుండి ఏమి ఆశించక, వారికి సంతోషాన్ని కలిగించేది అవ్యాజమైన ప్రేమ. అది భగవంతుడిపై కలిగితే దానిని భక్తి అంటారు. అటువంటి భక్తుడిపై తన అవాజ్యమైన ప్రేమను కురిపిస్తూ, వారికి లోబడి, వారితో ఉంటాడు భగవంతుడు. అటువంటి భక్తకోటిలోనివారే హనుమంతుడు, ప్రహ్లాదుడు, నామదేవు, మీరాబాయి, సక్కుబాయి, పుండలీకుడు, త్యాగరాజు, పోతన, రామదాసు, అన్నమయ్య మొదలైనవారు భక్తులు అని అంటే! అట్లా జీవించే స్థితిలో నేను లేను కనుక, నేను భక్తురాలిని కాదు. తీవ్రమైన అన్వేషణతో గురువుని గుర్తించి, విశ్వసించి, బావిలో వేలాడతీసినా సంతోషించి, గుహలో ధ్యానస్తులై కూర్చుంటే, పన్నెండు సంవత్సరాలు వారి గురువును సాయి సేవించినట్లు శ్రీసాయిని నేను సేవించలేను, కనుక శిష్యురాలిని కాదు, బాబానే స్వయంగా "నా గురువును నేను సేవించినట్లు నన్ను సేవించేవాడు ఒక్కడూ కనిపించలేదు, నాకు శిష్యుడు అనతగ్గవారు ఒక్కరూ కనిపించలేదు" అని అన్నారు. గురువు యొక్క స్థితిని ప్రతిబింబించ గలిగే రీతిలో కనీసం ఒక్కరోజయినా జీవించలేని వారలము శ్రీసాయికి శిష్యులము కాలేమని నా భావన. 1910 సంవత్సర ప్రాంతములోనే లక్షలాది రూపాయలు ఆర్జించే వృత్తి ఉద్యోగాలను, ఆస్తులను, బంధువర్గాన్ని ప్రక్కన పెట్టి, సాయి పాదాలచెంత చేరి ఎంతో మంది సాయిని సేవిస్తే, వారెవరూ కూడ సాయిని, తమ సేవతో సంతృప్తి పరచలేకపోయినారట. వారే శిష్యులు కానప్పుడు, నా స్వసుఖ, సంతోషాల కోసం జీవించే నేను, శ్రీసాయికి శిష్యురాలిని ఎట్లా అవుతాను. కనుక మీరిద్దరు భావిస్తున్నట్లు నేను సాయి భక్తురాలినికాదు, శిష్యురాలిని అంతకంటే కాదు. పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజగారు చూపిన నిర్దుష్టమైన సాయి మార్గంలో పయనం చేయటానికి ప్రయత్నం చేస్తున్న లక్షలాది మందిలో ఒకరిని" అన్నాను.

జీవన పయనంలో ఒడిదుడుకులను, తప్పొప్పులను నిరంతరం గుర్తించి, ఎరుక కలిగి జీవించేలా నడిపించమని సాయిని వేడుకుంటూ, శ్రీసాయి నాతో ఉన్నారు అని ఎరుకతో, శ్రీసాయి సంప్రీతుడు అయ్యేవిధంగా జీవించటానికి ప్రయత్నం చేస్తున్న సామాన్యురాలిని. అది గుర్తుంచుకోవటానికి, గుర్తెరిగి జీవించటానికి, "నలుగురిని ఎత్తిచూపే ముందు, నిన్ను నీవు సరిచేసుకో" అని సాయి చెబుతున్నారని ఎరుక కలిగి ఉండటానికి, చేతివేలికి గుర్తుగా శ్రీసాయి ఉంగరం ధరించాను. ఇక నేను చెప్పింది మీకు నచ్చిందా! నచ్చలేదా! అన్న విషయం నాకు అనవసరం. నన్ను గుచ్చి గుచ్చి అడిగారు, కనుక నాలోని భావాన్ని మీకు వ్యక్తం చేశా! తద్వారా నన్ను నేను సరిచూసుకునే అవకాశం కలిగింది" అని చెప్పటం ముగించాను. నేను దిగవలసిన స్టేషను రావడంతో వారికి నమస్కారం చేసి కదిలేను.


"సాధన అంటే సంస్కారాల మార్పుకోసం చేసే తీవ్రమయిన ప్రయత్నం". "సాధన అంటే ఒకమూల కూర్చొని ఒక గంటసేపో, అరగంట సేపో చేసేది కాకుండా జీవితమంతా సాధనగా మారాలి" అంటారు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు. మెలకువలో ఉన్న ప్రతిక్షణం మనస్సు ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటుంది. ఏదో ఒకదాని మీద ఏదో ఒక అభిప్రాయం ఏర్పరచుకొని, దానికి అనుగుణంగా ప్రవర్తింపచేస్తుంది, కాని ఒక్కొక్కసారి ఒకదానికి ఒకటి పొంతన ఉండదు. ఎన్నో అనుకుంటాము, ఏదో చేద్దామనుకుంటాము, మరేదో చేస్తాము, అట్లా నిరంతరం ఆలోచనల, ఆశల గూడులు అల్లుకొని దానిలో చిక్కుకొని, మనస్సుకు ప్రశాంతత లేదని వాపోయి, ఎండమావులవంటి వాటిని ఒయాసిస్సులని భావించి పరుగెత్తి అలసిపోయి, విసిగి వేసారి, చివరకు మన ఖర్మ ఇంతే అనుకుంటూ, అంతకు ముందు ఆరాధించిన భగవంతుడిని, సద్గురువును కూడ దూషించి, తిరోగమనులవుతాము. దీని అంతటికి మూలము సరియైన ఆలోచనా దృక్పథము, సద్గురువుకు ప్రతి రూపమయిన సత్సంగమము లభించకపోవటం.

అందుకే లక్షలాది మందిని నిర్దుష్టమైన మార్గంలో నడిపిస్తున్న పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారు, "మీరు ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగం చేయండి అదే నాకు అక్షర లక్షలు ఇచ్చినట్లు" అన్నారు, వారి మార్గ నిర్దేశకత్వంలో నడుస్తున్న "శ్రీ భరద్వాజ సద్గురువాణి" అక్షర సత్సంగం చేస్తూ, వారందించిన శ్రీసాయిమార్గంలో పదుగురితో కలసి పయనించటానికి ప్రయత్నిస్తున్నది. శ్రీ భరద్వాజగారు చూపిన మార్గంలో పయనించటమే గురుపూర్ణిమ సందర్భముగా మనము వారికిచ్చే దక్షిణ కావాలి. దానికి ఆలంబనగా, అనేక రూపాలలో శ్రీసాయి చేస్తున్న బోధనలను ఈ సంచిక ద్వారా అందించటానికి ప్రయత్నించాము. విశ్వమనే ద్వారకామాయికి ఆధారభూతమై, మూలస్తంభమైన శ్రీసాయి సంప్రదాయాన్ని అందించే దిశగా ఆ సంచికను "గురుపూర్ణిమ" ప్రత్యేక సంచికగా రూపొందించాము. ఆ యా వ్యాసాలు మిమ్ములను అలరించి, ఆలోచింపచేసి, ఆచరణాత్మకంగా చేయాలని సద్గురు శ్రీదత్తసాయి భరద్వాజులను ప్రార్ధిస్తూ

**మీ పబ్లిషర్**

**శ్రీమతి వి.యస్. లక్ష్మీ పూర్ణచంద్రరావు**

**స్వాతంత్ర్యదినోత్సవ, శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలతో...**



# గురుపూర్ణిమ

సోమకుడనే రాక్షసుడు అపహరించిన వేదాలు విడదీయడానికి సాధ్యం కాని విధంగా కలిసిపోయాయి. అయితే వ్యాసుడు ఆ వేదాలను విభజించి, తిరిగి మనకు ప్రసాదించాడు. వ్యాసుడు గొప్ప విజ్ఞాన పారంగతుడు. మహాభారత ఇతిహాసాన్ని రచించిన వ్యాసుడు, ప్రాచీన పవిత్ర గాధలకు మూలమైన అష్టాదశ పురాణాలను సంకలనం చేశాడు. ఇవన్నీ చేయడం మానవమాత్రుడికి సాధ్యమా? అందుకే ఆయనను మహావిష్ణువు అవతారంగా భావిస్తారు. జగద్గురువుల్లో మొదటివాడు వ్యాసుడే. వ్యాస పూజ అంటే వేదపూజ, ఈశ్వరపూజ.



ఒకప్పుడు యతులు, సర్వసంగ పరిత్యాగులు పాటించిన ఈ పర్వదినం, ప్రస్తుతం జన సామాన్యంలోకి వచ్చింది. నేపాల్‌లో ఇది ముఖ్యమైన పండుగ. మన దేశంలోనూ అనేక విద్యాలయాలల్లో గురుపూజ, వ్యాసపూజ జరుగుతాయి. శంకర పీఠాల్లో గురుపూర్ణిమ భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తారు. ప్రస్తుతం మనం 28వ మహాయుగంలోని కలియుగంలో ఉన్నాం. ప్రతి మహాయుగంలోనూ మహావిష్ణువు వ్యాసుడుగా అవతరిస్తాడని భక్తులు విశ్వసిస్తారు. మొదటి వ్యాసుడు స్వాయంభువుడు. 27వ వ్యాసుడు జాతూకర్ణుడు. ఇప్పటి వ్యాసుడు కృష్ణద్వైపాయనుడు.

మానవజాతికి మహోపదేశం చేసేవి వేదాలు. సోమరితనం పాపమని, కృషి చేసేవాడికే దైవం తోడ్పడతాడని, శ్రమలోనే సంపద ఉందని, ఉత్సాహవంతుడికి విద్య లభిస్తుందని, మనసు ఎప్పుడూ శుభాన్ని కోరాలని, అన్ని ప్రాణుల్నీ స్నేహబుద్ధితో చూడాలని... వేదం వచిస్తోంది. ధార్మిక సేవకు వేదం మూలమని మనుస్మృతి పేర్కొంది. ఇలాంటి అద్భుత వైదిక వాంగ్మయం నేటికీ మనకు లభించడానికి కారకుడు వ్యాసుడు.

ఇలా భారతీయ సాంస్కృతిక మూలస్తంభాల నిర్మాతగా వ్యాసుడు అందరికీ పూజ్యనీయుడయ్యాడు. ఆయన జన్మించిన రోజు ఆషాఢ శుద్ధ పౌర్ణమి. ఆధ్యాత్మిక జ్ఞాన ప్రదాతలందరికీ ఆద్యుడైన వ్యాసుడి పుట్టిన రోజు పండుగను గురుపూజోత్సవంగా కొన్ని ప్రాంతాల్లో పూర్ణిమ వ్రతంగా ఆచరిస్తారు. ఆధ్యాత్మికవేత్తలకే పరిమితమైన వ్యాసపూర్ణిమ నేడు సర్వజనులచే గురుపౌర్ణిమగా పిలువబడుతూ, వారి వారి గురువులను ప్రత్యేకంగా ఆరాధించుకునే పర్వదినమయింది. ప్రత్యేకించి శ్రీ శిరిడీ సాయిబాబా తన భక్తులచేత చెప్పి చేయించిన పండుగ గురుపూర్ణిమ. అప్పటినుంచి "గురుపూర్ణిమ" అత్యంత ప్రాధాన్యత సంతరించుకొని, నేడు లక్షలాదిమంది శ్రీసాయి భక్తులు జరుపుకొనే పండుగలలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నది.

నేటి ఆధ్యాత్మిక గ్రంథాలు, ఉపనిషత్తులు, పురాణాలు అన్నీ వ్యాసుడు వ్రాసినవే. వేదాలను నాలుగు భాగాలుగా విభజించిన వ్యాసుడు, వేదాలను విభజించడం వల్ల వేదవ్యాసుడయ్యాడు.

గురువు త్రిమూర్తి స్వరూపుడు. బ్రహ్మలా జ్ఞానాన్ని మనలో పుట్టించి, విష్ణువులా రక్షించి, శివుడిలా అజ్ఞానాన్ని తుంచి, మంచి చెడులను విశదీకరించి, మానవతా విలువలు, సద్గుణ సంపన్నతలు ఎలా పొందాలో నేర్పుతాడు. మనసు నుంచి ఆలోచనలు ఆవిర్భవిస్తాయి. సర్వవ్యాపకమైన మనసు విష్ణు స్వరూపం. విష్ణుమూర్తి నాభి నుంచి ఉద్భవించిన బ్రహ్మ మాదిరిగానే వాక్కు కూడా మనసు నుంచి ఆవిర్భవిస్తుంది. బ్రహ్మయే వాక్కు...ఈశ్వరుడే హృదయం. ఇలా మన వాక్కు, మనసు, హృదయం త్రిమూర్త్యాత్మకమై ఉంటాయి. త్రిమూర్తులు మనలోని త్రిగుణాలకు ప్రతీకలు. గురువు మనలో మంచిని సృష్టించి, లోకంలో ఎలా జీవించాలో నేర్పుతాడు. అమాయకత్వాన్ని, మోహాన్నీ తుంచివేసే శక్తి సంపన్నుడు. 'గు' కారో అంధకారస్య, 'రు' కారో తన్నిరోధకః అంటే గు అంటే చీకటి, రు అంటే పారద్రోలేవాడు. గురువు అజ్ఞానం అనే చీకటిని పారద్రోలి జ్ఞాన జ్యోతిని వెలిగించేవాడు. అంతేకాదు గురువు గుణాతీతుడు, రూప రహితుడు, భగవత్సమానుడు.

ఆషాఢ శుద్ధ పూర్ణిమను గురుపూర్ణిమ లేదా వ్యాసపూర్ణిమి అంటారు. జ్ఞానాన్ని కోరేవారు తమ ఆధ్యాత్మిక గురువులను ఈ రోజు స్మరించి, ఆరాధించి కృతజ్ఞతలను తెలియజేస్తారు. భుక్తి విద్యలు కాక ముక్తి విద్యలను బోధించే గురు దర్శనానికి, స్మరణకు ఈ రోజు విశిష్ట ప్రాముఖ్యత ఉంది. చంద్రుడు మనసునూ, సూర్యుడు బుద్ధిని ప్రకాశింపజేస్తారు. మానవుల మనసులో అష్టమదాలు, అరిషడ్వర్గాలూ, అహంకారం, చిత్తం అనే పదహారు మలినాలు గురుపూర్ణిమనాడు గురునామ స్మరణతో తొలగిపోతాయి.

గురువును ఎందుకు స్మరించాలి? ఎందుకు దర్శించాలి? కృతజ్ఞలు ఎందుకు తెలపాలి? అనే సందేహాలు సహజంగా ఏర్పడతాయి. గురువు ఒక శిల్పి లాంటి వాడు. శిల్పి బండరాళ్ళను అందమైన శిల్పాలుగా చెక్కి వాటికి ప్రాముఖ్యతను కలిగించగలిగినట్లే, ప్రజ్ఞాశాలి అయిన గురువు శిష్యులను సంస్కారవంతులుగా తయారుచేసి, సమాజానికి ఉపయోగపడేలా చేస్తారు. అలా గురువు సమాజ సేవ చేస్తున్నాడు.

స్వర్ణకారుడు బంగారాన్ని సానబెట్టి తయారు చేసిన ఆభరణం, ధరించే వారికి అందాన్ని ఇస్తుంది. అలాగే గురువు కూడ శిష్యులను సానబెట్టి సద్గుణాలు నేర్పి పరిపూర్ణ మానవుడిగా మార్చి, సమాజానికి అలంకారంగా అందిస్తున్నాడు. తోటమాలి నేలను చక్కగా చదునుచేసి మొక్కలు నాటి ఎరువువేసి పెంచి పోషించి అందరికీ ఉపయుక్తమైన ఫలాలను, పుష్పాలనూ ఎలా అందిస్తాడో, గురువు కూడా శిష్యులను సమాజానికి అలంకారాలుగా అందిస్తాడు. గురువు మార్గదర్శకుడు, తన శిష్యులు ఏది ఎలా చెయ్యాలో, ఎంత వరకు చెయ్యాలో, ఏది మంచి, ఏది చెడు అని నిర్ణయించగలడు.

(జూలై 24వ తేదీ గురుపూర్ణమ సందర్భముగా సమర్పణ)

సేకరణ : **కె. రమేష్‌బాబు**, విశాఖపట్నం

# ఆ ఒక్క సంఘటన గుర్తుంచుకుంటే చాలు

"సిద్ధ యోగీంద్రులు"

మొట్టమొదట అడవిలో బంజారా రూపంతో ఎదురైన గురువును ఆశ్రయించి వారిని అనుసరించగా, తనను ఆ గురువు బావిలో దాదాపు ఐదుగంటలపాటు తల్లక్రిందులుగా వేలాడదీసిన, ఆనందం అనుభవించారు శ్రీసాయిబాబా. తదనంతరం ఒక గుహలో ప్రవేశించి ఆయన ధ్యానస్థులవగా 12 సంవత్సరాలు నిరంతరం వారిని సేవిస్తూ, నోటికి అన్నపానీయాలు అందిస్తూ, విసర్జించిన మలినాలు తొలగించి శుభ్రంచేస్తూ, తన యావత్‌దృష్టి నిరంతరం వారిపై నిలిపి కేవలం వేపాకులు తిని జీవిస్తూ తన గురువును శ్రీ సాయి సేవించగా, 12 సంవత్సరాల తరువాత బాహ్యానికి వచ్చిన ఆ గురువు, సాయి తలను బోడిచేయించి శ్రద్ధ, సబూరి అనే రెండు పైసలు దక్షిణగా అడుగగా, మౌనంగా తలవంచి సమర్పించగా బాబా తలపై ఆ గురువు చేయి ఉంచి ఆశీర్వదించారు. "ఆనాటి వారి అనుగ్రహమే ఈనాటి ఈ స్థితి" అంటారు శ్రీ శిరిడీసాయినాధుడు. తన గురువుకు తాను సమర్పించిన "సద్గురువు పట్ల అచంచలమైన విశ్వాసము, సర్వకాల సర్వావస్థల యందు అది చెదిరిపోని దృఢమైన నమ్మకం అనే రెండు పైసల దక్షిణే" శ్రీసాయి కూడ మన నుంచి కోరేది. అవి సమర్పించిన నాడు నీకు, నాకు బేధమనే అడ్డుగోడ తొలగిపోతుంది అంటారు శ్రీసాయిబాబా. గురువారాలు గుడికివెళ్ళి కొబ్బరికాయ కొట్టి హుండీలో రెండు రూపాయల దక్షిణ సమర్పించి, ఉపవాసం పేరిట ఫలహారాలు ఆరగించి, ఏడాదికి ఒకటి రెండుసార్లు శిరిడీవెళ్ళి వారిని దర్శించుకొని, అనుకున్నది నెరవేరినప్పుడు వస్త్రాలు, హారాలు, కిరీటాలు సాయికి సమర్పించి మనం సంతృప్తి పడటం కాదు, శ్రీసాయి అడిగిన దక్షిణ సమర్పించటమంటే, ఒక్క అడుగు నావైపు వేస్తే, పది అడుగులు వెంటనుండి నడిపించి గమ్యం చేరుస్తానన్నారు శ్రీసాయిబాబా. ''నేను ఇవ్వదలచింది పొందగలిగినవాడు ఒక్కరూ కనిపించలేదు" అన్నారు శ్రీసాయి. అయితే శ్రీసాయి ఇవ్వదలచింది పొందగలగాలి అంటే ఎలా జీవించాలి, సద్గురువుకు దక్షిణ సమర్పించటమంటే ఏమిటి అనేదానికి అద్భుతమైన ఉదాహరణ, శ్రీ రఘువీర పురందరే జీవితం. శ్రీసాయి అడిగిన దక్షిణ సమర్పించటానికి తన జీవితాన్ని ఫణంగా పెట్టిన ధన్యజీవి శ్రీ పురందరే, అంతేకాదు, మనందరి జీవితాలు ధన్యమయ్యేలా, నేడు శిరిడీలో ప్రతి గురువారము జరిగే అద్భుతము, అనిర్వచనీయము, ధ్యానయోగయుక్తమైన పల్లకీసేవ (చావడి ఉత్సవానికి) కి నాంది పలికిన శ్రీపురందరే జీవితంలోని సంఘటనల ద్వారా, శ్రీసాయికి దక్షిణ ఎలా సమర్పించాలో కొంతయినా తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాము. అంతేకాదు "పిచ్చుక కాలికి దారంకట్టి లాగినట్లు నా భక్తుడిని నావద్దకు నేనే లాగుతాను" అన్నారు శ్రీసాయిబాబా. మనల్ని కూడ బాబా ఏదో ఒక మిషమీద, తన దగ్గరకు లాగేరు. అయితే ఆయన అనుకున్న మిషమీద శ్రీసాయి చెంత చేరుతున్నామా లేక మనపని నెరవేర్చుకోవటానికి చేరుతున్నామా అనేది పరిశీలించుకోవటానికి పరుపురాయి శ్రీ పురందరే జీవితంలోని సంఘటనలు...



విష్ణుభక్తుడైన శ్రీ రఘువీర పురందరే బొంబాయిలోని ఆంగ్లేయులకు సంబంధించిన ఒక భవననిర్మాణ కంపెనీలోని మేస్త్రి వద్ద నెలకు కేవలం 35 రూపాయల జీతానికి గుమస్తాగా పనిచేసేవాడు. తన కొద్దిపాటి జీతంతోనే తన తల్లి, సోదరుడు, తన భార్య, చిన్న పిల్లవాడిని అతి కష్టంమీద పోషించేవాడు. దుర్భర దారిద్ర్యం అనుభవిస్తున్న శ్రీ పురందరే ఒకసారి ఉత్సవాలలో దాసగణు చెప్పిన శ్రీసాయి చరిత్ర హరికథా ఆలకించి, శ్రీ దాసగణు ద్వారా మహారాష్ట్రలో ప్రముఖులైన శ్రీ నామదేవ్, తుకారాం, సమర్థరామదాసుస్వామి వంటి మహనీయులవలే, నేడు ప్రత్యక్షంగా భక్తులను అనుగ్రహించే సమర్థసద్గురువు శ్రీ సాయినాధుడని, తెలుసుకొని, వీలయినంత త్వరలో శ్రీసాయి పాదాలచెంత చేరి, తన దారిద్ర్యాన్ని నిర్మూలించుకోవాలని తహ తహలాడుతూ, నిరంతరం తనకు తెలియకుండానే శ్రీసాయి ధ్యాసలో గడిపేవాడు పురందరే. రోజులు గడుస్తుండగా, ఒకరోజు శ్రీపురందరేకు శ్రీసాయి కలలో కన్పించి శిరిడీ రమ్మని చెప్పేరు. ఇంకేముంది తన కోరికకు సాయి పిలుపు తోడవ్వటంతో, అందుకు కావలసిన పైకము, అతికష్టంమీద సమకూర్చుకొని, తన తల్లి, భార్య చిన్నవాడైన తన కొడుకుతో కలసి శిరిడీకి బయలుదేరటానికి సమాయుక్త మయ్యాడు పురందరే. తీరా బయలుదేరే సమయానికి అతని చంటిబిడ్డకు తీవ్రమయిన జ్వరం వచ్చింది. ఆ పసిపిల్లవాడితో, అంతటి జ్వరంతో అంతదూరం ప్రయాణం శ్రేయస్కరం కాదని, తగ్గిన తరువాత శిరిడీ వెళ్ళవచ్చని అతని తల్లి వారించింది. శిరిడీ రమ్మని శ్రీసాయి స్వయంగా స్వప్నంలో ఆదేశించినా, వెంటనే స్పందించి వెళ్ళలేకపోయినందుకు శ్రీసాయి పెట్టిన పరీక్ష ఇది, ఆయన కృపతో ఇన్నాళ్టికి అన్నీ సమకూడినయ్యి కనుక వెంటనే బయలుదేరవలసిందే అని తన

నిర్ణయం తెలియజేసి అంత జ్వరంలోను తన పసిబిడ్డను తీసుకొని, భార్యా, తల్లితో కలసి శిరిడీకి బయలుదేరేడు పురందరే.


శిరిడీ ప్రవేశించిన వెంటనే శ్రీసాయి దర్శనార్ధమై ఉవ్విళ్ళూరుతున్న పురందరే ద్వారకామాయిలోనికి ప్రవేశించి, ఆశీనుడై ఉన్న సాయి పాదాల చెంత తన బిడ్డను ఉంచి, సాయి పాదాలకు నమస్కరించి, ఆనంద భాష్పాలు కారుస్తూ ఉండిపోయాడు. అతని తల్లి, భార్య కూడ శ్రీసాయికి నమస్కరించి ఒక ప్రక్కగా నిలుచున్నారు. పురందరేలో ఏదో తెలియని ఉద్వేగం, ఎన్నాళ్ళో, ఎంతగానో ఎదురుచూసిన మధురక్షణం, సాకారమవ్వటంతో, తన ఆర్థికసమస్యలు, మానసిక బాధలు అన్నీ మనస్సులో నుండి మటుమాయమయ్యి, హృదయమంతా ఆనందంతో నిండిపోగా, శ్రీసాయిని చూస్తూ ఉండిపోయాడు పురందరే. కొద్ది క్షణాలు మశీదులో మౌనం రాజ్యం ఏలింది. అక్కడే ఉన్న కాకాసాహెబ్ దీక్షిత్, ఆ సన్నివేశం చూస్తూ ఉండిపోయాడు. కొంత సేపుతరువాత "చాలా దూరం ప్రయాణం చేసి అలసిపోయి వచ్చారు ముందుగా శాలకు వెళ్ళి సేదతీరు" అన్నారు బాబా పురందరేతో. అర్ధంకాక, ప్రశ్నార్ధకంగా నిలబడ్డ పురందరేతో దీక్షిత్, "శాల అంటే రాధాకృష్ణమాయి ఇల్లు, ఇక్కడకు దగ్గరలోనే ఉంది అక్కడికి వెళ్ళి, ఆహారం తీసుకుని, అలసట తీర్చుకొని రమ్మని శ్రీసాయి మాటలోని ఆంతర్యం" అంటూ "శాలకు" దారి చూపెట్టేరు దీక్షిత్. రాధాకృష్ణమాయి ఇంటికి వెళ్ళి, మూసిన తలుపును తట్టిన పురందరేను, ఎవరు, ఎక్కడినుంచి వచ్చారు అన్న తదితర వివరాలు, తలుపు తీయకుండానే అడిగి, తలుపుమాత్రం తీయలేదు రాధాకృష్ణమాయి. కొద్దిసేపు వాకిటనే వేచి ఉండిన పురందరే తిరిగి కుటుంబముతో సహ మశీదుకు చేరేడు.కారణం అడిగిన సాయితో పురందరే విషయం చెప్పగా, ఆలకించిన శ్రీసాయి ఒక్కనిముషం మౌనం వహించి, "ఇప్పుడు వెళ్ళు శాలకు" అన్నారు శ్రీసాయి. బాబా మాటకు శిరసావహించి మరల రాధాకృష్ణమాయి ఇంటికి వెళ్ళేడు పురందరే. ఈసారి గుమ్మం దగ్గర పురందరే అడుగిడే సమయానికి వెంటనే తలుపులు తెరిచిన రాధాకృష్ణమాయి, పురందరే కాళ్ళమీద పడి బోరున ఏడ్చింది. ఒక్కక్షణం స్థబువైపోయాడు పురందరే. ఆమెచర్య అర్ధంగాక, ఉండిపోయాడు. వెంటనే వారిని లోపలికి తీసుకువెళ్ళి, మర్యాదలు చేసి, దగ్గర ఉండి కొసరి కొసరి ఆ కుటుంబానికి భోజనం వడ్డించింది రాధాకృష్ణమాయి. తన భార్య, తల్లి, పిల్లవాడిని వాకిట్లోనే నిల్చోబెట్టి ప్రశ్నించి పంపివేసిన ఆమె ప్రవర్తనలో, కొన్ని నిముషాలలోనే వచ్చిన ఇంత మార్పుకు కారణమేమిటా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు పురందరే.

చిన్నతనంలోనే భర్తను కోల్పోయిన సుందరీబాయి క్షీరసాగర్ జగద్గురువైన కృష్ణుడిని ఆరాధిస్తూ తాను రాధగా భావిస్తూ నిరంతరం భగవంతుని సేవలో మునిగిఉండేది. తన సమీప బంధువైన శ్రీ నానాసాహెబ్ చందోర్కర్‌తో మొట్టమొదటి సారి శిరిడీ వచ్చిన సుందరీబాయి తన ఆరాధ్యదైవమైన శ్రీకృష్ణుడిని శ్రీసాయిలో గాంచి, తన జీవితం శ్రీసాయి సేవకే అంకితం చేయాలని శిరిడీలోనే ఉండిపోయింది. అయితే ఏనాడు శ్రీసాయికి ఎదురుపడి ప్రత్యక్ష సేవ చేయలేదు, పరోక్షముగా సాయికి సేవకు అవసరమైనవన్నీ అమరుస్తూ, బాబా దర్శనానికై వచ్చేవారికి శ్రీసాయి ఔన్నత్యాన్ని తెలియజేస్తూ, వారిచేత బాబాకు కావలసినవన్నీ అమరేలా చేయటమే కాకుండా కుగ్రామమైన శిరిడీకి వచ్చే భక్తుల సౌకర్యార్ధము భోజన వసతి ఏర్పాట్లు చేయమని చెప్పేది. శ్రీసాయి తన దగ్గరకు వచ్చినవారిలోని దక్షిణ రూపంలో డబ్బు కొపీనాన్ని తొలగిస్తూ, మానసిక జాడ్యాన్ని తొలగించటానికి ఒంటరి అయిన సుందరీబాయి ఇంటికి వెళ్ళి భోజనం చేయమని చెప్పేవారు. సాధనలో ఉన్నత స్థితిలో ఉన్న సుందరీబాయి సన్నిధిలో వాళ్ళు సంస్కరించబడి, తల్లిలా ఆమెచూపే ప్రేమను చూసి ఆమెను "రాధాకృష్ణమాయి" అని పిలుస్తూ బిడ్డల్లాగా ఆమె చెప్పినట్లు చేసేవారు. బాబాకు ఎప్పుడు ఏది అవసరమైన, తక్షణమే తన ఇంటినుంచి రాధాకృష్ణమాయి పంపేది. ఏ సమయములోనైనా బాబా దగ్గరకు వచ్చి, సాయి ఆదేశము మేరకు తన దగ్గరకు వచ్చిన వారికి వెంటనే వేడివేడి భోజనం ఏర్పాటుచేసేది. మేము వస్తున్నట్లు మీకు ఎట్లా తెలుసు అంటే, సర్వాంతర్యామి అయిన శ్రీసాయి తగు రీతిన ప్రేరేపించేరు అందుకే సిద్ధం చేశాను అనేది కాని, మశీదులో జరిగేది తనకు తెలుసు అని ఏనాడు అనలేదు. అంతేకాక, అనేక మంది విద్యాధికులకు సైతం సాయిచర్య, బోధలోని అంతరార్ధము తెలియజేయటమే కాకుండా, వాటికి సమయానుకూలంగా పురాణ ఇతిహాసాలలోని విషయాలుగా ఉటంకించేది. అనేక మంది సాధకులు ఆమెను గురుభావంతో చూసేవారు. అయినప్పటికి ఆమె తాను ఒక సామాన్యరాలిలాగా, తన వద్దకు వచ్చిన వారిని తల్లిలా ఆదరించేది రాధాకృష్ణమాయి.

స్వప్నంలో శ్రీసాయి పిలుపుతో పిల్లవాడి అనారోగ్యాన్ని కూడ లెక్కచేయక, తల్లి మాటను కూడ కాదని ద్వారకామాయి వాసుడైన శ్రీసాయి చెంతకు వచ్చిన పురందరే, సాయి ఆదేశం మేరకు మొదట శాలకు వెళ్ళి, తిరిగివచ్చి, తదుపరి రాధాకృష్ణమాయి ఆత్మీయత పొందటానికి కారణం ఏమిటి? కుల, మతాలు పట్టించుకోకుండా, శ్రీసాయి దర్శనార్ధమై వచ్చి బాబా ఆదేశం మేరకు ఏ వేళలోనైనా శాలకు వచ్చే వారికి తగురీతిన వసతి, భోజనాధులు సమకూరుస్తూ తల్లిలా ఆదరిస్తూ తగురీతిన ప్రవర్తించే రాధాకృష్ణమాయి, శ్రీసాయి పిలుపుతో శిరిడీ వచ్చి, వారి ఆదేశము మేరకు తన వద్దకు వస్తే ప్రశ్నలతో సరిపుచ్చి మొదట తిప్పి పంపటములోని ఆంతర్యము ఏమిటి? ఈ సంఘటన ద్వారా బాబా బోధించదలచినది ఏమిటో వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

# ఆచార్యదేవోభవ

అవధూత శ్రీ చివటం అమ్మ మండలారాధన ఆషాఢ పౌర్ణమిరోజు, (గురుపూర్ణిమ) రావటం జరిగింది. నేను వెళ్ళాను. శ్రీ భరద్వాజ మాస్టరుగారే కాకుండ, అమ్మతో పరిచయం ఉన్న సాధుసత్పురుషులు ఎంతో మంది వచ్చారు. రేలంగి నుంచి పండుముదుసలియైన అవధూత బుచ్చమ్మగారు కూడా వచ్చారు. మాస్టరుగారు అమ్మతత్వం మీద ప్రవచనం చెప్పారు "అమ్మ సశరీరంగా ఉన్నప్పుడు మన ప్రమేయం లేకుండానే అమ్మతానే స్వయంగా ప్రసాదం తినిపించేవారు. ఇప్పుడు సమాధి చెందాక కూడా అమ్మ సన్నిధిలో అమ్మ ప్రసాదం లభిస్తుంది కాని ఇప్పుడు మనం శ్రద్ధ విశ్వాసాలతో కొంత ప్రయత్నం చేసి మనమే తీసుకొని తినాలి'' అని చెప్పారు. సజీవ మహనీయులకి, సమాధి చెందిన మహనీయులకి అంటే ఆ రెండు స్థితులలో వారి అనుగ్రహం లభించే విధానమును అద్భుతంగా మాస్టరుగారు వివరించిన విధానం నా హృదయంలో నిలిచిపోయింది. ఆ రోజంతా భజనలు, సత్సంగమము, సద్గోష్టులు జరిగాయి. 1999వ సంవత్సరములో కలియుగాంతము, కలికి అవతరణం జరుగుతుందని నేను ఒకచోట చదివిన దాని గురించి మాస్టరుగారిని అడిగేను. అందుకు మాస్టరుగారు, ఇలాగే గతంలో కూడా కొందరు "అవతార పురుషుడు" వచ్చేస్తాడని, వచ్చేశాడు" అనే చెప్పారు. అయినా అలా జరుగలేదు. అది దైవ రహస్యం ఎవరూ చెప్పలేరు. అయినా అలాంటి ప్రోఫెసీల వలన కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని చెప్పేరు. అయినా కూడా నేను మరలా "అది కాదు మాస్టారూ, భగవదవతారం మళ్ళీ వచ్చే సమయం దగ్గరలోనే ఉందని తెలిస్తే ఎక్కువమంది సన్మార్గంలోకి, భక్తిమార్గంలోకి వస్తారు కదా" అని అన్నాను. అప్పుడు మాస్టరుగారు అద్భుతమైన ఈ ఉపమానం చెప్పి నన్ను నేను సమాధానపర్చుకొనేటట్లు చేశారు. "కాలేజీలో విద్యార్థులు చేరేరు. వారు మొదటి నుండి విద్యయందు శ్రద్ధాసక్తులతో చదవాలని కోరుకుంటావా లేక సంవత్సరమంతా పోచికోలు కబుర్లతో వృధాకాలక్షేపంచేసి, పరీక్షలు దగ్గరకొస్తున్నాయని హడావిడిగా క్రిందామీదా పడుతూ అప్పుడు చదవడం మొదలు పెట్టడాన్ని కోరుకుంటావా ఆలోచించు" అని అన్నారు. అప్పుడు నా బుద్ధికి కొంత వికాసం కలిగి వారిని "ఆచార్య" అని గౌరవించడం ఎంత అర్థవంతమైనదో తెలిసివచ్చింది. అమ్మ మండలారాధన రోజంతా మాస్టరుగారు మరియు ఇతర మహనీయుల సత్సాంగత్యంలో ఉత్సాహంగా, ఉల్లాసంగా స్ఫూర్తిదాయకంగా గడిచింది. సాయంత్రం చీకటి పడగానే ఒకరిద్దరు భక్తులతో కలిసి చివటం నుండి తణుకు కాలినడకన బయలుదేరాము. ఆకాశంలో పూర్ణ చంద్రుడు, మనస్సులో సాయి గురుచంద్రులు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నారు. మాస్టరుగారు సత్సంగాలు చేస్తూ, సత్సంగాలు చేసుకోమంటారని తెలిసింది. నేను కూడా ఎక్కడో అక్కడ సత్సంగాలు మొదలుపెట్టాలి. ఎలా ఎక్కడ మొదలెట్టాలి అనే ఆలోచనే మనసంతా నిండిపోయింది. మొదట వచ్చిన సాయిలీలామృతం ఎడిషన్స్‌లో సత్సంగం ఎలా చేసుకోవాలి అనేది మాస్టరుగారు ఇవ్వలేదు. తర్వాత కొంతకాలానికి వచ్చిన ఎడిషన్స్‌లో సత్సంగం అనే అధ్యాయం జేర్చారు. సత్సంగము, భజన అనే చిన్న బుక్‌లెట్ తర్వాత వచ్చింది. తాడేపల్లిగూడెం వచ్చి అర్ధరాత్రి వరకు సత్సంగం గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. కొవ్వూరులో మా పెద్దనాన్నగారి కోడలు నాకు ఒదినగారైన లక్ష్మిగారింట్లో సత్సంగం మొదలు పెట్టించాలి, ఎందుకనంటే మా ఒదినగారిచేత, ఆవిడ స్నేహితురాళ్ళచేత అంతకుముందే శ్రీసాయి లీలామృతం చదివించినందుకు అక్కడ వాళ్ళు సత్సంగానికి ముందుకు వస్తారనిపించింది. ఇలా నిర్ణయం తీసుకొన్నాక నిద్ర పట్టింది. సత్సంగం చేసుకోవాలనే ప్రేరణకు కారణం ఆగురుపూర్ణిమనాడు, అమ్మ మండలారాధన రోజున గురు స్వరూపులైన మాస్టరుగారు, ఇతర సాధుసత్పురుషుల సన్నిధిలో గడపటమే.



ఆ తర్వాత కొద్ది నెలలకే అంటే 1981వ సంవత్సరములోనే కొవ్వూరులో మా పెద్దనాన్నగారింట్లో సత్సంగం మా వదినగారి అధ్వర్యంలో మొదలు పెట్టించాను. మేడమీద గదిలో ఒక అలమారులో సాయిబాబా ఫోటో పెట్టాము. ప్రతి గురువారం సత్సంగం చేసేవాళ్ళం. బాబా లీలలు జరగటం మొదలుపెట్టేయి, సాయంత్రం సత్సంగం అయ్యాక మా లక్ష్మి వదిన ప్రక్కింటి స్నేహితురాలింటికి వెళ్ళి ఒకఅరగంట కూర్చుని వచ్చింది. సత్సంగంలో సాయి అష్టోత్తరంతో పూజ చేసిన తెల్లనందివర్ధనం పూలు ఒక దోసెడుంటాయి. (సాయిబాబా పటం దగ్గర ఉన్నవి) అవి మాయం అయిపోయాయి. ఒక్కటి కూడా లేదు. అది గమనించేసరికి గదిలో సుగంధ పరిమళాలు వచ్చాయి. లక్ష్మిగారికి ఆలీలకి ఒళ్ళు జలదరించింది. ఇంకో ఆశ్చర్యం ఏమిటంటే సత్సంగమమునకు అక్కడి రెండు మూడు వీధుల్లో అందరిని పిలిచినా పెద్దవాళ్ళు రాకుండ పిల్లలను మాత్రం పంపించేవారు. ఒక పదిహేను మంది పిల్లలు అందరు 6 ఏళ్ళ నుండి 12 ఏళ్ళ మధ్య వయస్సు కలిగిన వారు ప్రతిగురువారం వచ్చేవారు. ఈ విషయం మాస్టరుగారికి తెలియపర్చగా, పెద్దవాళ్ళు రాకపోయినా

ఏమి ఫరవాలేదు. అసలు ఆ వయసు పిల్లలకే సాయి భక్తిలో శిక్షణ ఇవ్వాలి. అదే బాబాగారి సంకల్పం అని ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కొంత కాలం అయ్యేసరికి మా పెద్దనాన్నగారింటి ఆవరణలో నైఋతిమూల ఒక పాక ఉండేది. అందులో అద్దెకుండే వారు ఖాళీచెయ్యగానే, ఇంకెవరికి అద్దెకివ్వనని, సత్సంగములు అందులోకి మార్చేసుకోమని చెప్పారు. అది సాయి ప్రేరణతో సాయిలీలగా జరిగిందని అందరం ఆనందించాము. మా పిల్లలందరూ దానికి "సాయికుటీర్" అని పేరు పెట్టారు. నాకు చివటంలో మాస్టరుగారి సన్నిధిలో సత్సంగములు చేసుకోవాలనే ప్రేరణ కలిగింది కనుక, గురుపూర్ణిమను వార్షికోత్సవంగా పిల్లలతో జరుపుకొనేవారము. మాస్టరుగారు వెళ్ళిన ప్రతి చోట కొవ్వూరులో పిల్లలతోటే సత్సంగము జరుగుతోందని చెప్పేవారు. ఒకసారి మాస్టరుగారు తణుకు, చివటం వచ్చినప్పుడు మేము పిలవకుండానే కొవ్వూరు వస్తున్నాను అని కబురు చేశారు. తణుకు నుంచి హనుమంతరావు అనే భక్తుడు వారిని కొవ్వూరులో దింపి వెళ్ళిపోయాడు. మాస్టరుగారిని ఘనంగా రిసీవ్ చేసుకొని తీసుకొని వచ్చే స్తోమత మాకు లేదు. మాస్టరుగారు అలాంటివి ఆశించని నిగర్వి. సత్వగుణ సంపన్నులు. రైల్వేస్టేషను నుంచి రిక్షా మాట్లాడితే అందులోనే ఎక్కి వచ్చేశారు. సాయంత్రం వరకు మా సత్సంగ పిల్లలతో బాబాను గురించి చెప్తూ గడిపారు. వాళ్ళు ఎన్నో ప్రశ్నలువేస్తే ఎంతో సంతోషించి సమాధానం చెప్పారు. ఒక చిన్నపిల్ల "బాబా గారు షిరిడిలోనే ఎందుకున్నారు" అని అడిగితే, "బాబాగారు ఏదో ఊరులో ఎక్కడ వున్నా మిగిలిన వాళ్ళకి నువ్వేసేప్రశ్న వస్తుంది కదా, ఆయన ఎక్కడ ఉన్నా మనలను రక్షిస్తున్నారు కదా" అని మాస్టరుగారు చెప్పారు. మాస్టరుగారు, బాబా పిల్లి రూపంలో, కుక్క రూపంలో భక్తుల దగ్గరికి వెళ్ళేవారని చెప్పడం విని, ఒక అమ్మాయి "బాబాగారు మీకు ఏరూపంలో కనపడుతుంటారు"అని అడిగింది. మాస్టరుగారు ఆ పిల్లధైర్యానికి మెచ్చుకొని ఇలా సమాధానం చెప్పారు. "మనం చీకటిలో క్రొత్తదారిలో మరో ఊరికి వెళ్ళవలసివచ్చి భయం కలిగిందనుకో అప్పుడు మరికొంత మంది మేము అదే దారిలో వెళ్ళవలసినపని ఉంది. మీ వెనకే కొంత దూరంలో మేము కూడా వస్తుంటాము, మీరు ముందు వెడుతూ ఉండండి అని చెప్పారనుకో, అప్పుడు వాళ్ళు మనకంటికి కనపడకపోయినా (ఎందుకంటే మన వెనక వస్తున్నారు) వెనక వాళ్ళు అదే దారిలో వస్తున్నారనే భావంతో ఎంతో నిర్భయంగా వెడతాము కదా! ఆ విధంగా నాకు బాబా ఎప్పుడూ నా వెనుకే ఉండి నన్ను గమనిస్తూ నడిపిస్తున్నారనే భావం ఎప్పుడూ నాకు ఉంటుంది. అలా బాబా భౌతికంగా కనపడకుండానే నిరంతరం నన్ను నడిపిస్తున్నారనే అనుభవంతో ఉంటాను" అని చెప్పేరు. వారి ఈ అద్భుతమైన సమాధానం అర్థం చేసుకోవడం ఆ పిల్ల వయస్సుకి అందనిదైనా నా హృదయంలో మాత్రం ఎప్పటికి గుర్తుండిపోయింది. **మాస్టరు గారితో నేను "మీరు ఎన్నో ఊళ్ళల్లో సాయితత్వమునకు సంబంధించి ఎన్నో విషయాలు చెప్తుంటారు కదా అవి అందరూ తెలుసుకోవాలంటే ఒక పత్రిక ప్రారంభించి తీరాలి" అని అడుగుతూ ఉండేవాడిని. "దాని గురించే ఆలోచిస్తున్నాను. చాలా ఆధ్యాత్మిక పత్రికలు కొంత కాలం ప్రచురించబడి తర్వాత ఆగిపోతున్నాయి. మనం పత్రిక మొదలుపెడితే అది చిరకాలం నడిచేటట్లుగా బాగా ఆలోచించి మొదలుపెట్టాలి" అని మాస్టరుగారు అన్నారు.** మాస్టరు గారితో "నేను చేస్తున్న ఉద్యోగంలో అదనంగా (జీతం కాకుండా) వేలు, లక్షలు సంపాదించే అవకాశం ఉన్నది. అయినా చాలాకాలం నిరుద్యోగిగా బాధపడిన తరువాత లభించిన ఈ ఉద్యోగాన్ని దైవప్రసాదంగా భావించి ఒక్క రూపాయికూడా అదనంగా తీసుకోకుండా, కరెన్సీ కాగితాలకి ఆకర్షింపబడకుండా కేవలం జీతంతో సరిపెట్టుకొని పనిచేస్తున్నాను" అని చెప్పేను. అప్పుడు మాస్టరుగారు ఎంతో సంతోషించి "ఆహా! అదే తపస్సంటే" అని అన్నారు. మీరు పత్రిక ప్రారంభిస్తే నావల్ల లాభం పొందుతున్న వారిచేత పత్రికకు చందాలు కట్టిస్తాను అన్నాను. పత్రిక ప్రారంభిస్తే ఆవిధంగా నేను చేయగలిగిన సేవ చేస్తాను అని చెప్పాను.

1983వ సంవత్సరం శ్రీరామనవమికి సాయిబాబా పత్రికను ప్రారంభించారు. పత్రిక చిరకాలం ముద్రించబడేందుకు ఎంత కృషి ఎలా చేయవలసి ఉంటుందో తెలిజేస్తూ మాస్టరుగారు నాకు వ్రాసిన ఉత్తరాలు ఉన్నాయి. నా శాయశక్తులా, సాయిసేవగా భావించి, బంధువులను మిత్రులను ఎంతో మందిని చందాదారులుగా జేర్పించాను. నా చందా నెంబరు ఆర్.పి. 10. కాకినాడ జిల్లా లైబ్రరికి చాలాసార్లు తిరిగి సాయిబాబా పత్రిక కవరు చేసే విషయాల గురించి, మాస్టరుగారి గొప్పతనం గురించి చెప్పి, వారి గ్రంథాలయశాఖలన్నిటికి పత్రికలు పంపే ఆర్డరు సంపాదించి మాస్టరుగారికి పంపించాను. అదే పద్ధతిలో మిగిలిన జిల్లాల్లో కూడా ప్రయత్నం చేయమని వేరే భక్తులకు పురమాయించానని చెప్పారు.

రచన : **శ్రీ పి.ఎస్.ఆర్. విజయభాస్కర్**, నిడదవోలు

(తరువాయి భాగం వచ్చే సంచికలో)

## పూజ

ఈ విశ్వంలో ప్రకృతి, పంచభూతాల ద్వారా మన ఆలన, పాలన చేస్తూ, ఆహారమందిస్తూ తిరిగి జీర్ణకోశం రూపంలో మన ఆహారాన్ని గ్రహిస్తూ, 24 గంటల కాలమైన ఒకరోజులో అంతలా మనల్ని కనిపెట్టుకుని వుంటున్న ఆ సర్వగతుడైన భగవంతునికి కృతజ్ఞతతో అగరువత్తి వెలిగించి హృదయపూర్వకంగా మనం చేసే ఒక నమస్కారమే "పూజ".

**– పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టర్‌గారు**



# శ్రీ గురు చరిత్రామృతము

వివరణ : వి.వి. పూర్ణచంద్రరావు

భగవంతుని అనుగ్రహం వలనే సద్గురువు చెంత చేరటం జరుగుతుంది. సద్గురు సాంగత్యం లభించిన తరువాతనే జన్మ సాఫల్యానికి మార్గం సుగమము అవుతుంది. "గురు సన్నిధే కాశీ, గయా మొదలైన పుణ్య తీర్థక్షేత్రముల సమము. గురువు ఆజ్ఞతో చేసిన జపాలు, తపాలు, వ్రతాలు, తీర్థయాత్రలు, యజ్ఞములు, దానములు మొదలైనవి సంపూర్ణ ఫలితాన్ని కలుగజేయటమే కాకుండా, జ్ఞానమార్గంలో పయనింపచేస్తాయి. గురురూపమే జ్ఞానానికి మూలం, గురుపాదాలే పూజాస్థానాలు, ఆయన మాటయే మంత్రం, గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరుడు. అఖండమైన మండలాకారముగా ఈ సకల చరాచరములతో నిండి ఉండటమే కాకుండా ఎవరయితే ఆ పరమ పదమును దర్శింపజేతురో అటువంటి గురువుకంటే అధికమైనదేది ఈ సృష్టిలో లేనేలేదు. ఇది శివుని శాసనం. ఇదియే శివుని శాసనం" అని మాత పార్వతీదేవికి శివుడు బోధించిన గురుగీతలోని వాక్యం. అటువంటి గురుసన్నిధికి చేరిన తరువాత శాస్త్రషట్కంతోగాని, సాధన సంపత్తితో గాని పనిలేదు, కేవలం తన హస్తమస్తక, దృష్టి సంయోగముల ద్వారా గురువు తనంతటి వాడిగా శిష్యుడిని తీర్చిదిద్దగలరు. అయితే అందుకు తగిన అర్హత శిష్యునికి కలదా లేదా అని గురువు అనేక రీతులలో అనేక విధాల పరీక్షించి, అనుగ్రహిస్తారు. జ్ఞానార్జనకై గురువుచెంత చేరాలిగాని, శాస్త్ర పరిజ్ఞానం కోసం మాత్రం కాదు. అందుకే అలనాటి గురుకులములలో చేరిన విద్యార్థులకు విద్య బోధించేముందు తగురీతిన గురువు పరీక్షించేవారు. దానికి కారణం అంతర్లీనముగా వారిలో దాగిన నేను అనే అహంకారాన్ని తొలగించి, మేముగా మార్చటానికే, అప్పుడే ఆవ్యక్తి ద్వారా లోకశ్రేయస్సు కలుగుతుంది, లేకుంటే నేను, నాది, నాకొరకే అనే అహంకార స్వార్థములతో పొందిన జ్ఞానము తన వారికి కూడ శ్రేయస్సు కలిగించకపోవచ్చు. అందుకే గురువు ముందు తనచెంతచేరిన వారిని తగురీతులు సంస్కరించటానికి ప్రయత్నించటము. అది గ్రహించిన వారు గురు కృపకు పాత్రులవుతారు. అహంకరించిన వారు వారికి దూరమై జీవితం వ్యర్థంచేసుకుంటారు. దానికి చక్కటి ఉదాహరణే శ్రీగురుచరిత్రలోని జ్ఞానకాండలో అంతర్భాగమైన "గురుశుశ్రూష మహాత్యవర్ణనా రూపమైన 16వ అధ్యాయములోని ధౌమ్యమహర్షి వారి శిష్యుల ఉదంతం".

జ్ఞానార్జనకై తన చెంతచేరిన ముగ్గురి శిష్యులలో అరుణి, బైదుడులను పలురీతుల పరీక్షించి, వారి విజ్ఞతకు, సేవకు సంప్రీతులయిన ధౌమ్యులవారు తగురీతిన వారిని అనుగ్రహించి పంపటము జరుగుతుంది. ఇక మూడవ వాడైన ఉపమన్యువు గురువు అనుగ్రహము కొరకై ఎదురుచూస్తూ, ఆశ్రమములో నిరంతరం గురువును అంటిపెట్టుకొని ఉంటూ వారికి శుశ్రూషచేస్తూ, అత్యంత భక్తి శ్రద్ధలతో అత్యంత ప్రీతికరముగా గురుసేవ చేస్తూ ఉండేవాడు. అయితే భోజనప్రియుడు అయిన ఉపమన్యు అంతే ప్రీతి ఆహారముపైన చూపుతూ గడిపేవాడు. తద్వారా ఒక్కొక్కసారి తనకు తెలియకుండానే అప్రయత్నముగా గురుసేవలో లోపం చేసేవాడు. కాలం గడుస్తుండగా ఒకనాడు, ధౌమ్యులవారు శిష్యుడిని చేరబిలచి, మన ఆశ్రమములోని గోవులకు ఆహారం సరిపోవటం లేదు కనుక, ఇక నుంచి నీవు వాటిని సమీప అడవిప్రాంతమునకు తీసుకువెళ్ళి, వాటిని కడుపునిండా మేపుకొని సాయంత్ర సమయానికి ఆశ్రమానికి తిరిగి రమ్మని ఆదేశించగా, గురువాజ్ఞను పాటించే అవకాశం లభించింది అని తలచిన ఉపమన్యు మరుసటినాటి ఉదయమే గోవులను తోలుకొని సమీప అడవిప్రాంతమునకు బయలుదేరివెళ్ళేడు. అయితే భోజనప్రియుడైన ఉపమన్యు మధ్యాహ్నపు మండుటెండతోపాటు తనలో ఆకలిమంట పెరగటంతో గోవులను తోలుకొని మధ్యాహ్ననానికే ఆశ్రమానికి తిరిగి వచ్చాడు. అది గమనించిన ధౌమ్యులవారు సాయంత్రం వరకు గోవులను మేపుకొని తిరిగి రమ్మన్న తన ఆజ్ఞను ఉల్లంఘించినందుకు కోపగ్రస్తులవటం గమనించిన ఉపమన్యు మరునాడు ఉదయానే గోవులను తోలుకొని అడవికి వెళ్ళేడు. మధ్యాహ్న క్షుద్బాధ తీర్చుకోవటానికై సమీపములోని బ్రాహ్మణుల గృహములకు వెళ్ళి యాయవార వృత్తితో వారిచ్చిన భోజనం తెచ్చుకొని భుజిస్తూ సాయంకాలం వరకు గోవులను మేపుకొని తిరిగిఆశ్రమానికి వచ్చేడు ఉపమన్యు. తాను ఆహారం ఇవ్వకున్నా ఉపమన్యు పుష్టిగా ఉండటం గమనించి, మధ్యాహ్నము భోజనం గురించి విచారించగా, "గురుదేవా! మీ సంశయము నిజమే! ఆకలికి తట్టుకోలేక నేను మధ్యాహ్నం సమీప నదిలోస్నానం చేసి అక్కడి బ్రాహ్మణ ఇండ్లలో భిక్ష స్వీకరించి క్షుద్బాధ తీర్చుకొనుచున్నాను"

అని బదులిచ్చిన ఉపమన్యుతో "గురువుకు అర్పించిన తరువాత మిగిలిన దానిని ప్రసాదంగా భావించి భుజించాలనే శాస్త్రవాఖ్యాన్ని మరిచి, చరించి భ్రష్టుడవుతున్నావా" అన్న గురువుగారి స్వరములోని ఆగ్రహము గ్రహించిన ఉపమన్యు మరుసటి నాటినుండి మొదటి భిక్షను గురువుకు సమర్పించి, తిరిగి గోమంద దగ్గరకు వెళ్ళి, తదుపరి మిగిలిన ఇండ్లలో భిక్షను యాచించి, దానిని స్వీకరించసాగేడు. శిష్యుడు ఇంకను పుష్టిగా ఉండటము గ్రహించి దానికి కారణమడగగా, మొదటిసారి భిక్షను మీకు సమర్పించి, రెండవసారి భిక్షను స్వీకరించి ఆకలి తీర్చుకుంటున్నాను అన్న ఉపమన్యుతో "ఓరి మూర్ఖుడా! బ్రహ్మచారి రెండుసార్లు మధూకరిని యాచించ కూడదు అన్న ఇంగితము కూడ లేని నీవు నాకు శిష్యుడెట్లయితివి! చేసిన పనికి ప్రాయశ్చిత్తముగా ఆ భిక్షనుకూడ ఆశ్రమములో సమర్పించు అనగా, గురువుగారి ఆదేశాన్ని అనుసరించి తగురీతిన రెండవ భిక్షను కూడ గురువుగారికి సమర్పించి తిరిగి గోవులను మేపటానికి అడవికి వెళ్ళేవాడు. ఆకలి బాధ తట్టుకోలేక గోవుల చెంత విశ్రమించిన అతనికి దూడలు తల్లులవద్ద పాలు త్రాగుచుండగా, పొదుగుల నుంచి వృధాగా నేలపాలవుతున్న పాలను చూసి, అవి వ్యర్ధము కాకూడదని తలచి దోసిలిపట్టి ఆ పాలుపట్టుకొని, వాటిని తాను త్రాగి వేసేవాడు. అట్లా నాలుగు ఐదు గోవుల దగ్గర పాలు దోసిలితో త్రాగగానే ఉపమన్యు ఆకలి మంట చల్లారి కడుపు నిండుగా ఉండేది. ప్రతిరోజూ మధ్యాహ్నము రెండుసార్లు తాను స్వీకరించే మధుకరి ఆశ్రమములో ఇచ్చి తిరిగి వెళుతున్న ఉపమన్యు మరింత పుష్టిగా ఉండటము చూసిన ధౌమ్యులవారు దానికి కారణము అడడగా, దూడలు త్రాగుతుండగా కారుతున్న పాలను వృధాకాకుండా దోసిలిపట్టి త్రాగి ఆకలి తీర్చుకుంటున్నాను" అన్న ఉపమన్యు జవాబుతో కోపోద్రిక్తుడైన ధౌమ్యులవారు "ఓరి! బుద్ధిహీనుడా, పశువుల ఉచ్ఛిష్టమైన పాలను త్రాగినచో నీవు పశువువలే తయారయ్యి, మతిహీనుడవయ్యెదవు'' అని మందలించగా గురువుగారి ఆజ్ఞను శిరసావహించిన ఉపమన్యు ఇక తన ఆకలి తీరుటెట్లు అని ఆలోచిస్తూ, అడవిలో తిరుగుచుండగా, ఒకచోట జిల్లేడు చెట్టు కొమ్మ విరిగి పాలుకారడం గమనించి, మొక్కనుండి వచ్చే పాలు ఉచ్ఛిష్టం కాదు కనుక అవి తాగి తన ఆకలి తీర్చుకోవచ్చని భావించి జిల్లేడు కొమ్మలు తుంచి దోసిలితో ఆ పాలు పడుతుండగా అవి చిమ్మి కళ్ళలో పడటముతో చూపుకోల్పోయాడు. "అయ్యో! గురువుగారి అనుమతి లేకుండా చేసిన పనివలన నా రెండు నేత్రముల చూపు పోగొట్టుకొంటిని, ఆకలిబాధ అట్లుండన్ని గురువుగారు గోవులను అడవిలో చక్కగా మేపి సురక్షితముగా చేర్చమని ఆదేశించారు కదా! ఇప్పుడు ఆ ఆదేశమును ఎట్లు పాలింతును, నాకేదారి కనబడటం లేదు కదా, గోవులను ఎట్లు గమ్యం చేర్చుదును" అని బాధపడుతూ, దారి తడుముకుంటూ గోవుల అరుపులను ఆలకిస్తూ, వాటిని అదిలిస్తూ ముందుకు నడుస్తూ, దారిలో ఒక పాడుపడ్డ బావిలో పడిపోయెను. క్షుధ్బాధకోసం తాను చేసిన తప్పులకు తగిన ఫలితం లభించింది అని భావిస్తూ, అన్నింటికి మించి గురువుగారి గోవులు ఎటువెళ్ళెనో మార్గము తప్పి ఆపదపాలైనచో అందుకు కారణం నేనే కదా, ఎంతటి పాపాన్ని మూటకట్టుకున్నాను, గురువుగారి చెంతకు ఇక ఏవిధముగా ఏ ముఖముతో వెళ్ళగలను అని ఉపమన్యు తనలో తానే వగచసాగెను. సూర్యుడు అస్తమించగా ప్రకృతి అంతా చీకటి దుప్పటి కప్పుకున్నది. గోవులు ఒక్కొక్కటే ఆశ్రమంలోని గోశాలలోనికి ప్రవేశించసాగేయి, చివరి గోవు కూడ వచ్చేసింది గాని, ఉపమన్యు జాడ కానరాలేదు. శిష్యుడు జాడ కానరాని ధౌమ్యులవారు మనస్సులో అతని గురించి చింతిస్తూ అడవి దారి పట్టి బిగ్గరగా శిష్యుడిని పిలువసాగెను. గురువుగారి పిలుపువిని దిగుడుబావిలో ఉన్న ఉపమన్యు బిగ్గరగా రక్షింపుమని అరవగా, దీపపుకాంతిలో శిష్యుడు బావిలో పడిఉండటము గమనించిన ధౌమ్యులవారు అతనిని పైకి లేవదీసి అతని ద్వారా వృత్తాంత మంతయూ విని దయార్ద్రహృదయులై, అతని అమాయకత్వానికి గురువు ఆజ్ఞపట్ల అతనికి గలవిశ్వాసానికి అచ్చెరునొంది, ఉపమన్యూ! దిగులు పడవద్దు. నీవు చేతులు జోడించి, దేవతలకు వైద్యులైన అశ్వనీదేవతలను స్తుతించు అని బోధించగా, ఎలుగెత్తి భక్తి భావముతో ఉపమన్యు చేసిన స్తోత్రమునకు సంప్రీతులయిన అశ్వనీదేవతలు ప్రత్యక్షమై ఉపమన్యుకు చూపు ప్రసాదించి, ధౌమ్యులవారికి నమస్కరించి తిరిగి వెళ్ళిపోయారు. ఆ సంఘటనతో గురువు పాదాలపైపడి ఉపమన్యు తన తప్పులను క్షమించి అనుగ్రహించమని పలు విధాలుగా గురుదేవులను స్తుతించగా, పవిత్ర మనస్కుడైన ఉపమన్యువును ధౌమ్యులవారు లేవనెత్తి "శిషోత్తమా! నీయెడల నాకు అపారమైన వాత్సల్యం కలుగుతున్నది అంటూ ఆలింగనము చేసుకొని, నేను పెట్టిన పరీక్షలలో నీవు సంపూర్ణమైన విజయం సాధించావు. ఈక్షణం నుండి నీవు సకల శాస్త్రపారంగతుడవు అవుతావు అంటూ ఉపమన్యు శిరస్సుపై తన దివ్య హస్తాన్ని ఉంచి ఆశీర్వదించారు ధౌమ్యులవారు. గురువు యొక్క హస్తమస్తక స్పర్శమాత్రం చేత తృటిలో జ్ఞానవంతుడయిన ఉపమన్యు గురువుగారితో కలసి అత్యంత వినయవిధేయలతో భక్తి శ్రద్ధలతో అమితోత్సాహంతో ఆశ్రమములోకి అడుగుపెట్టేడు. ఆశ్రమములో తనచెంత ఉపమన్యువును ఆశీనుడవమని తెలుపుతూ ధౌమ్యులవారు, ఉత్తముడయిన శిషోత్తముడిని చూసి, "అంచంచలమైన భక్తి విశ్వాసాలతో నేను చెప్పిన పనిని తు.చ. తప్పకుండా ఆచరించటమే కాకుండా ఉన్నత మనస్కుడై చరించిన నీవు దీర్ఘాయుష్మంతుడవై, ఉన్నతోత్తమైన గృహస్తాశ్రమ జీవితం గడుపుతూ, సాటిలేని కీర్తిని గడిస్తావు. ఎందరో నీకు శిష్యులయ్యెదరు. వారిలో ఉదంకుడు అనే పేరుగల శిష్యుడు నీకు ఎనలేని పేరుప్రఖ్యాతులు తీసుకురాగలడు. అతను చేసే సర్పయాగముతో తక్షకుడనే సర్పాన్ని, అభయమిచ్చిన ఇంద్రుడిని

కూడ యాగశాలకు రప్పించగల సామర్థ్యంగల నీశిష్యుడు నీకు ఆదిశేషుడిని జయించి కుండలములను కూడ తెచ్చి ఇచ్చును, అతనితోపాటు నీ కీర్తి కూడ మూడులోకాలలో వ్యాపించును, అంతటి మహాజ్ఞానసంపన్నుడవు కమ్మ"ని తమ అనుగ్రహముతో ఉపమన్యువు యొక్క భవిష్యత్తును కూడ తెలిపి, ఆశీర్వదించారు. ధౌమ్యమహర్షి అనుగ్రహపూర్వక మహదాశీర్వచనములు అందుకుని, మహాజ్ఞాన సంపన్నుడైన ఉపమన్యువు తన గ్రామానికి బయలుదేరేడు.

జ్ఞాన సముపార్జనకై తన వద్దకు వచ్చిన శిష్యులలో మొదటివాడు అయిన అరుణి, గురువాజ్ఞను నెరవేర్చడానికి పొలానికి నిండుగా నీరు పెట్టటానికి అవరోధమైన గండికి అడ్డుగా పడుకొని పొలాన్ని నీటితో తడిపి గురువాజ్ఞను శిరసావహించినందుకు అతనిని వేదశాస్త్రాది సకల విద్యాపారంగతుడవు అయ్యెదవని ఆశీర్వదించెను ధౌమ్యులవారు.

రెండవ శిష్యుడైన బైదుడు పొలములో ధాన్యము ఆశ్రమానికి తీసుకురావటానికి రెండుఎడ్లబండికి ఒక ఎద్దు తానై గురువు ఆదేశాన్ని నెరవేర్చే దిశగా, బండి లాగే ప్రయత్నంలో ఎద్దు, బండి బురదలో కూరుకుపోయినా, గురువు ఆజ్ఞను శిరసావహిస్తూ అశక్తుడై స్పృహతప్పిన తరుణంలో ధౌమ్యులవారు అతని సంకల్పదీక్షకు సంతసించి నీవు వేదశాస్త్ర సంపన్నుడవు అగుదువని ఆశీర్వదించి పంపెను. అయితే ఉపమన్యువుకు మాత్రం అశ్వనీదేవతల దర్శనం, స్పర్శన భాగ్యంచే చూపు రప్పించటమే కాకుండా, అనేక విధములుగా అతనిని, ఆశీర్వదిస్తూ అతని భవిష్యత్తు కూడ ఎరుకపరుస్తూ అపారమైన అనుగ్రహము చూపటములోని ధౌమ్యులవారి ఆంతర్యమేమిటో, అంతగా గురువు అనుగ్రహానికి ఉపమన్యు పాత్రులవటానికి కల కారణమేమిటో, సవిస్తరముగా కూలంకుషంగా వచ్చే సంచికలో ప్రస్తావించుకుందాము.

## పండుగలు - పర్వదినాలు

### జూలై - 2021

1. శ్రీ గులాబ్ బాబా జయంతి – కాటేల్
8. శ్రీ వాసుదేవానందసరస్వతిస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
12. పూరీజగన్నాథుని రథయాత్ర
16. దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం
17. అవధూత శ్రీ నాగమునీంద్రస్వామి ఆరాధనోత్సవము
20. తొలి ఏకాదశి
21. బక్రీదు

23&24 గురుపూర్ణిమ మహోత్సవాలు – పవర్‌సిటీ, విశాఖపట్నం

24. గురుపూర్ణిమ

### ఆగష్టు

7. విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి
11. కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యుల జయంతి

14&15 సద్గురువుల పాదుకామహోత్సవము – పవర్‌సిటీ

15. స్వాతంత్ర్యదినోత్సవము
17. హజరత్ శ్రీ తాజుద్దీన్‌బాబా ఆరాధనోత్సవము
21. శ్రీ గురు సిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవము – హుబ్లీ
22. శ్రావణ పౌర్ణమి, రాఖీ పండుగ
22. సద్గురువుల పాదుకామహోత్సవము
    శ్రీ పాకలపాటి గురువుగారి ఆశ్రమము – నర్సీపట్నం
24. అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవము
24. శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవము (తిథిప్రకారం)
29. తెలుగు భాషా దినోత్సవము
    గిడుగు వేంకటశ్రీరామమూర్తి జయంతి
30. శ్రీకృష్ణాష్టమి

### సెప్టెంబరు


3. అవధూత శ్రీ చీరాలస్వామి ఆరాధనోత్సవము
3. ఖేట్‌గామ్ శ్రీ నారాయణ మహరాజ్ జయంతి
5. ఉపాధ్యాయ దినోత్సవము
5. డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి
6. పోలాల అమావాస్య
10. వినాయక చవితి
10. శ్రీపాద శ్రీవల్లభుల జయంతి
11. శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము
17. విశ్వకర్మ జయంతి
19. అనంతపద్మనాభ చతుర్దశి
21. మహాలయ పక్షాలు ప్రారంభం

### అక్టోబరు

2. శ్రీ గాంధీజయంతి
2. శ్రీ లాల్ బహద్దూర్‌శాస్త్రి జయంతి
6. మహలయ అమావాస్య
7. శరన్నవరాత్రులు ప్రారంభం
12. సరస్వతి పూజ
13. దుర్గాష్టమి
14. మహర్నవమి
15. విజయదశమి
    శ్రీ శిరిడీసాయిబాబా 103వ మహాసమాధి మహోత్సవం (తేదీ మరియు తిథి ప్రకారం)
20. వాల్మీకి జయంతి
23. అట్లతద్ది

# శ్రీగురుభ్యోనమః

తల్లిని మించిన దైవమూ, తల్లి ప్రేమను మించిన ప్రేమ జగతిలో లేవని పెద్దలంటారు. అది నేను కాదనను కాని, ఒక సద్గురువు తన శిష్యునిపై చూపే అవాజ్యకరుణతో పోలిస్తే, అంతటి తల్లిప్రేమ కూడా సముద్రంలో ఒక నీటిబొట్టుతో సమానమే సుమా! నిజమే, "గురుకృపాకో కోయీ దుర్లభ్ నహీహై – నహీహై – నహీహై!". సమర్థులైన సద్గురు కరుణాకటాక్షాలు గాని, తపోదత్తమై వారిని వరించిన దివ్యశక్తులనుగాని, ఆ మహనీయుని ఔన్నత్యాన్నిగాని అంచనా వేయగల ఒక కొలమానము ఈ విశాలవిశ్వంలోనే లేదు. వారిని సృష్టిలోని ఏ ఉపమానంతో పోల్చినా, అది కొండను అద్దంలో చూపినట్లే అవుతుంది.



కేవలం ఉపమానము కొరకు గురువులను ఏదో ఒక దృష్టాంతరములో పోల్చి చూపాలనుకున్నారు మన పూర్వీకులు. అందుకే వారు, గురువుల సాధనాసంపత్తి, ప్రతిభాపాటవాలను ప్రాతిపదికగా తీసుకొని, వారిని స్థూలంగా మీన గురువులు, కచ్ఛప గురువులు, క్రౌంచ గురువులని మూడు వర్గాలుగా వర్గీకరించారు.

**మీన గురువులు :** మీనం అంటే చేప. తన పిల్లలైన చిరుచేపల ఆకలి తీర్చడానికై తల్లిచేప తన నోటిద్వారా ఆహారము అందిస్తూ, అవసరమనిపించినంత కాలము వాటి ఆలనా పాలనా తనే స్వయంగా చూసుకుంటుంది. పిల్లలు పెరిగి పెద్దవయ్యాక అవి తల్లిపై ఆధారపడకుండా, వాటి పోషణ అవే చూసుకుంటాయి. అలాగే, ఒక సామాన్య గురువు తన శిష్యులకు మౌఖికంగా బోధనలు చేస్తూ, స్వీయపర్యవేక్షణలో వారికి రక్షణనిస్తూ, వారి ఆధ్యాత్మికోన్నతికి శాయశక్తులా ప్రయత్నిస్తారు. తమ తమ సాధనాపటిమను బట్టి, తమ జీవిత పరమార్థాన్ని సాధించుకోవాలి.


**కచ్ఛప గురువులు :** వీరి స్థాయి మీన గురువుల స్థాయికంటే ఉన్నతమైనది. కచ్ఛపమంటే తాబేలు. తల్లియైన తాబేలు కేవలం తన కరుణాపూరితమైన చూపులను ఆకలిగొన్న తన పిల్లలపై ప్రసరింపచేయటం ద్వారా వాటి ఆకలిని తీర్చగలదు. అంటే, తల్లి తాబేలు తన ప్రేమపూర్వకమైన చల్లని చూపులతోనే తన పిల్లలను పోషించుకోగలదన్నమాట. కాని అవసరమనిపిస్తే, సమయాసందర్భాలను పట్టి అది మీనంవలె తన పిల్లలకు నోటిద్వారా కూడా ఆహారం అందించి పోషించగలదు. కాని మీనం మాత్రం తాబేలువలే, తన చూపుల ద్వారా పిల్లల ఆకలిని తీర్చలేదు.

**క్రౌంచ గురువులు :** ఈ మహనీయులు, మీన గురువులు, కచ్ఛప గురువులకంటే ఎంతో అత్యున్నత శ్రేణికి చెందినవారు. క్రౌంచపక్షి తన గూటిలో గుడ్లను పొదిగి, అవి పిల్లలు కాగానే వాటిని వదిలిపెట్టి, తమ జాతి పక్షులు మామూలుగా వలసవెళ్ళే సుదూర ప్రాంతాలకు తాను వలస పోతుంది. మీన కచ్ఛపాలవలె, అది కొంత కాలమైనా తన చిన్నారి పిల్లల దగ్గర వుండి, వాటి ఆలనాపాలనా చూసుకోదు. కాని గూటిలోని చిన్నపిల్లలు ఆకలైనవేళ అమ్మను స్మరిస్తాయి. తక్షణమే తల్లిపక్షికి, ఎన్నివేలమైళ్ల దూరంలో వున్నా, తన పిల్లలు ఆకలితో తనను తలచుకుంటున్నట్లు తెలిసిపోతుంది. మరుక్షణమే ఆ తల్లిపక్షి ఆకలితో అలమటించే తన పిల్లల కడుపునిండుగాక అని సంకల్పిస్తుంది. తల్లిపక్షి అక్కడ అలా సంకల్పించగానే, ఇక్కడ గూటిలోని పక్షి పిల్లలకు కడుపునిండి, ఆకలి బాధ మటుమాయమవుతుంది. ఎంత విచిత్రం! ఈ విశాలవిశ్వంలో, ఆ సృష్టికర్త ఏయే ప్రాణులకు ఏయే అద్భుత శక్తులను ప్రసాదించి సృష్టించారో వారికే ఎరుక. అయితే ప్రాణులమధ్య నిత్యమూ గోప్యంగా జరిగే ఇలాంటి అద్భుతశక్తుల విన్యాసాలగుట్టు సామాన్య మానవుని మేధస్సుకు, ఆధునిక శాస్త్ర విజ్ఞానానికి అంతుపడుతుందా అన్నదే సందేహం.



అలాగే కారణజన్ములైన క్రౌంచ గురువులు, తాము ఏ లక్ష్య సాధనకై భూమిపై అవతరించారో, దానిని నెరవేర్చడమే తమ జీవిత పరమావధిగా భావిస్తారు. ఆ లక్ష్యసాధనకై తాము పుట్టి పెరిగిన ప్రాంతాన్ని, అయిన వాళ్ళను, కడకు కన్న తల్లితండ్రులను విడిచి సుదూరప్రాంతాలకు పోవలసి వచ్చినా, క్రౌంచ పక్షివలె నిర్విచారంగా వెళతారు. అంతే తప్ప తాను భౌతికంగా దూరమైపోతే తనవారి గతి ఏమవుతుందోనని బెంగపెట్టుకోరు. తాను ఎంత దూరంలో ఉన్నప్పటికీ తననే నమ్ముకున్న శిష్యులలోను, భక్తులలోను సంకల్పమాత్రాన భక్తిబీజాలు నాటి, వారి బ్రతుకును భగవన్మయం చేసి, వారి భవిష్యత్తుకై బంగారుబాటలు వేయగలరు. ఆపత్కాల సమయంలో వారు తనను మనసారా స్మరిస్తేచాలు క్రౌంచపక్షివలె, తమ సంకల్పబలముచే వారిని ఆ కష్టాలనుండి గట్టెక్కించగలరు. అలాంటి తపోధనులు మనసారా సంకల్పించాలేగాని, ఈ సృష్టిలో వారికి అసాధ్యమైనదంటూ ఏదీ ఉండదు. అవసరమైతే వీరు మీన గురువుల వలె మౌఖికంగా కూడ బోధన చేయగలరు, కచ్ఛప గురువులవలె కటాక్షవీక్షణాల ద్వారా విశేషకృపను ప్రకటితం చేయగలరు. కావున సద్గురువులకు ఎవరైతే శరణాగతులై సమర్పణాభావంతో తమ సేవలను అందిస్తారో, వారికి సకల శుభాలు తప్పక లభిస్తాయి. ఇందులో ఏమాత్రం సందేహం లేదు.

గురుపూర్ణిమ శుభాకాంక్షలతో....

రచన : **శ్రీ సాయిదాసస్వామి**, హైదరాబాదు




# ఒక్క క్షణం !

ఎన్నో జన్మల పుణ్యం వలన ఆధ్యాత్మిక ప్రపంచానికి చక్రవర్తియైన శ్రీ శిరిడీసాయినాధుని సన్నిధి లభించింది మనకు. ఎన్నో జన్మలనుండి మనలను సంస్కరించుకుంటూ వచ్చి ఈ జన్మలో ఆయన లాగానే మనకు మానవ జన్మ ప్రసాదించి, పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు, అనేక మిషలమీద తనవద్దకు లాగేరు శ్రీసాయి. ఏ మిషమీద సాయిచెంతకు చేరేమో తెలుసుకొని జీవించటం ద్వారా జన్మకు సార్ధకత ఏర్పడుతుంది. "సద్గురువును తెలుసుకోవాలి లేకుంటే మానవ జన్మకు ఎందుకొచ్చినట్లు పిడకలు ఏరుకోవటానికా" అన్నారు సాయిబాబా. "సద్గురువు ధ్యాస లేకుండా గడిపిన ప్రతిక్షణమూ మృత్యువును పేనే తాళ్ళు" అన్నారు మాస్టర్ ఇ.బి. అయితే అసలు సద్గురువును తెలుసుకొని, ఆ ధ్యాసలో గడప గలుగుతున్నామా? అంతకుమించి ఏమిషమీద సాయి తనవద్దకు మనలను లాగేరో తెలుసుకొని జీవించ గలుగుతున్నామా. సాయి చెంతకు చేరుతున్నాము, ఆరాధిస్తున్నాము, భక్తులుగా చెలామణి అవుతున్నాము కాని, సాయి కోరిన విధంగా, మెచ్చేవిధంగా, బాబా లాగిన మిషమీద మాత్రంకాదు. చదువు, ఉద్యోగం, పెళ్ళి, పుత్రులు, సంపద మొదలైనవి పొందాలనే మిష, కష్టాలు, నష్టాలు, బాధలు, రోగాలు తగ్గించుకోవాలనే మన కారణాలమీద



బాబాచెంతకు చేరుతున్నాము. అనుకున్నవి జరిగితే సాయి అనుగ్రహించాడని, లేకుంటే సాయి మనపై కినుక బూని అనుగ్రహించటం లేదని, మన కర్మ ఇంతేనని వాపోతున్నాము. బాబా అనుగ్రహంతో పొందలేనిది ఏదీలేదని ఒక ప్రక్క చెబుతూనే, సాయి అనుగ్రహం కన్నా మన ఖర్మే బలీయమై, కష్టాలు తొలగి, కోరికలు నెరవేరటం లేదని భావిస్తాము. సాయి కృపకోసం ఆయన చరిత్ర పారాయణ చేస్తాము, కాని, "గురు అనుగ్రహబలం ముందు గ్రహబలము పనిచేయదు, నీ జాతకంలో బిడ్డలు ఎక్కడవి, నీపై కరుణతో నాశరీరాన్ని కోసి నీకు బిడ్డను ప్రసాదించాను" అన్న సాయి మాటలోని భావము గ్రహించము. పారాయణ పుస్తకం చదివితే కోరికలు తీరుతాయి అని ఆశతో చదువుతాము గాని, "సద్గురువు జీవితచరిత్ర" గ్రంథం వారి సస్వరూపముతో సమానము దానిలోని విషయాన్ని గ్రహించి, పరిణితిచెందేలా చదవటమే పారాయణ అని, తద్వారా మనకర్మ నశించి సద్గురువు కృపకు పాత్రులవుతామని, గ్రహించక, అక్షరాల వెంట కళ్ళను పరిగెత్తించి, గురుకృప పొందాలని ప్రయత్నించి, ఫలించక, కర్మ బలీయమైనదని భావించి, గురుకృపను, తద్వారా గురువును శంకించి వారికి మరింత దూరమై ఖర్మవలయంలో చిక్కి, మరింతగా బాధపడతాము. "మీ భారములు నాపై పడవేయుడు నేను మోసెదను","నా సహాయముగాని, సలహాగాని, కోరిన తక్షణమే ఒసంగ సంసిద్ధుడను" అన్న సాయి అభయాన్ని కూడ మరిచి జీవిస్తాము.

అందుకనే తప్పకుండా మన ఖర్మే బలీయమై, సాయి చెంతనున్నా, వారి కృపాదృష్టి మనపై ప్రసరిస్తున్నా, మట్టిపై పడిన సూర్యకాంతి ఎలా ప్రతిబింబించలేదో అదే చందాన మనము ఉండిపోతాము.

దానికంతటికీ కారణం, సద్గురువు గురించి తెలుసుకోక పోవటం, మీదుమిక్కిలి, ఏమిషమీద తనవద్దకు లాగేరో గ్రహించలేక, మన మిషలు నెరవేర్చుకోవటం కోసం వెంపర్లాడటం జరుగుతున్నది. సృష్టిలో గల ప్రతిప్రాణి, జీవి, చెట్టు, చేమ, చివరకి శిలకు కూడ, వాటిజన్మకు ఒక కారణం ఉంటుంది. అది తెలిసి ఆదిశగా పరిణితి చెందితే ఆయా జన్మలకు సార్ధకత. "నీవు చూసేదంతా కలసి నేను" అన్న సాయి సూక్తి గమనార్హం. కనుక "మానవజన్మ సార్ధకత చెందాలంటే సద్గురువును తెలుసుకోవాలి" సాయి తెలియబడలేదు అంటే అందుకు అవరోధముగా నిలచిన మనలోని భావాలు ఏమిటో తెలియాలి. అంటే సద్గురువును తెలుసుకోవటానికి ముందుగా మనగురించి మనము తెలుసుకోవాలి, అసలు సద్గురువు చెంతకు ఎందుకు చేరేమో, ఏమి పొందేమో? ఏమి పొందాలను కుంటున్నామో, అసలు ఏమి పొందాలో అని తెలియాలి. అలా తెలియాలి అంటే వాటికి అడ్డుగా నిలచిన మనలోని యిష్టా, అయిష్టాల గురించి తెలుసుకోవాలి. మనకు ఇష్టమైనది (సంతోషకరమైనది) ప్రసాదించమని సద్గురువు చెంతకు చేరేవారు, "బాబాకు ఇష్టమైనది" ప్రసాదించమని అడుగుతూ, గురువుకు ఇష్టమైన రీతిలో జీవించటానికి ప్రయత్నం ప్రారంభించాలి. అప్పుడు ఏమిషమీద మనలను తన వద్దకు లాగేరో తెలుస్తుంది. యవ్వన దశనుండి వార్ధక్యం వరకు, మనకు సంతోషము, సుఖము కలిగించేవి, మన యిష్టమైనవి, ప్రసాదించమని సాయిని వేడుతాముగాని, తాత్కాలిక ఆనందం కాకుండా శాశ్వతానందాన్ని కలిగించే, సద్గురువుకు ఇష్టమైనదే ప్రసాదించమని అడగము. మనము భావించే సంతోషకరమైనవన్నీ శ్రేయస్కరము కాకపోవచ్చు. కాని మన ఇష్టంతో సంబంధంలేకుండా సద్గురువు ప్రసాదించే ప్రతిదీ శ్రేయస్కరమైనది, మనకు శాశ్వతానందాన్ని ప్రసాదించేదే అవుతుంది. చిన్నపిల్లవాడు తండ్రి గడ్డం గీసుకునే బ్లేడును చూసి ఆడుకోవాలని కోరుకోవటం, కావాలని పేచీ పెట్టటం, దానిని పొందటం సంతోషకరం, అయితే అది ఉపయోగించటము తెలియక, శరీరం తెగిన మరుక్షణం సంతోషం మటుమాయమై, ఆస్థానంలో అనుభవించే దుఃఖమే ఎక్కువగా ఉంటుంది. మనం కోరుకునేవన్నీ ఆవిధంగా ఉంటాయి. మందురాసుకొని, తెగిన చేతికి కట్టుకట్టుకొని, ఇష్టంలేని మాత్ర మింగటం పిల్లవాడికి ఇష్టంఉండదు గాని, అతని ఇష్టాన్ని పక్కన పెట్టి తండ్రి బలవంతంగా చేసే పరిచర్యవల్ల, బాధ తగ్గి గాయం నయమవ్వటం ద్వారా

పిల్లవాడు పొందే ఆనందం శాశ్వతం. సద్గురువు చేసేపని అట్లా ఉంటుంది. కనుక సద్గురువు చెంతకు చేరినప్పుడు తాత్కాలికము, అశాశ్వతము అయిన సుఖము, సంతోషం ఆనందం ప్రసాదించమని కోరటంకన్నా, శాశ్వతానందాన్ని కలిగించే శ్రేయస్కరమైన దానిని ప్రసాదించమని కోరగలగాలి, అట్లా కోరగలగాలి అంటే మనము సద్గురువు చెంతకు ఎందుకు చేరేమో తెలుసుకోవాలి. అందుకు అవరోధమైన ఇష్టా అయిష్టాలను జయించగలగాలి. దానికి సంబంధించి సాయిసన్నిధిలో జరిగిన ఒక సంఘటన ఇక్కడ ప్రస్తావించుకుందాము.

ఒకసారి ఒక భక్తుడు బాబా వద్దకువచ్చి తమ కుమార్తెకి ఒక ఉత్తమమైన సంబంధం వచ్చిందని మీరు ఆశీర్వదిస్తే వారికి వివాహం జరిపిస్తానని కోరేడు. అందుకు బాబా "అతను ఉద్యోగస్తుడనా వివాహం చేయటం, అంతకంటే మనకు దగ్గరలోనే ఉన్న అప్పా అనే వంటవాడికి ఇచ్చి చేయండి. ఇద్దరు సుఖసంతోషాలతో జీవితం గడుపుతారు" అని అన్నారు. అయితే తమ బంధువులకు అందరికీ యిష్టమైన, తనకూ అనుకూలమైన, తాము కోరుకున్న సంబంధాన్ని బాబా స్థిరపరిస్తే, కష్టాలు, బాధలు తొలగి వారు సుఖపడతారు కనుక బాబా చెప్పిన సంబంధం గురించి కాక, తమకు యిష్టమైన ఉద్యోగస్తుడి సంబంధం గూర్చి మరల బాబాదగ్గర ప్రస్తావించి, "అది కాదు బాబా, అమ్మాయి చదువుకుంది, కొద్దో గొప్పో ఆస్థిపాస్తులు కూడా ఉన్నాయి. అవతల వ్యక్తి చదువుకున్నాడు, ఉద్యోగస్తుడు. ఆస్తిపాస్తులు కలవాడు అందువలన అమ్మాయి అన్నిరకాల సుఖపడుతుంది కనుక నీవు అనుమతిస్తే ఆ సంబంధం స్థిరపరచుకోదలచాము, కనుక మీ అనుమతివ్వమని తన ఇష్టాన్ని మరొకసారి బాబా ముందు వెల్లడిచేశారు. అందుకు బాబా చిరునవ్వు నవ్వుతూ, "మీరు అనుకున్నది కాక, అప్పా అనే నేను చెప్పిన వంటవాడికి ఇచ్చి చేయండి ఉభయులకు శ్రేయస్కరమవుతుంది'' అన్నారు. తమకు ఇష్టంలేని ఆ సంబంధంగురించే మరల బాబా ప్రస్తావించటం చూసి బాబా, భక్తుల మధ్య ఉండి మనల్ని పరీక్షించటానికి అట్లా అని ఉంటారు, మరొక్కసారి ఏకాంతంగా అడగాలి అని అనుకొని మరల ఇంకొకసారి బాబా ముందు తమ ఇష్టాన్ని వెల్లడిచేశారు వారు. అందుకు బాబా చిద్విలాసంతో "నేను ఫకీరును మీరు గృహస్తులు, అంతలోతుగా ఆలోచించి, అంతమంచిది అని మీరు అనుకుంటే మీరనుకున్నటే కానివ్వండి" అని అన్నారు. అమ్మయ్య ఇప్పటికి మనం చెప్పింది బాబాకు పూర్తిగా అర్థమయ్యింది, ఆశీర్వదించారు అనుకొని, తమ ఇష్టప్రకారము వివాహము జరిపించారు.

కొద్దినెలలలో అతను చనిపోగా ఇంటికి తిరిగివచ్చిన కుమార్తెను చూసి, "ఒకటికి రెండుసార్లు హెచ్చరిస్తాను వినకపోతే మీమానాన మిమ్మల్ని వదలివేస్తాను" అన్న సాయి మాట మరచి, బాబాను నిందించి, దూరమయ్యారు వారు. మనము కూడ అలానే చేస్తున్నామా! ఇంటి నిర్మాణము గురించో మరొక దానిగురించో లేక ఒక స్థలము కొనదలచి, అంతడబ్బు పెట్టి అది కొనటము వలన భవిష్యత్తులో మనకు మంచిది అవునా, కాదా అని తెలియక అనేక విధాలుగా అనేకచోట్ల విచారించి, సంశయములో పడి, దానిపట్ల మక్కువ వీడలేక చివరిగా, సాయి సందేశము ప్రకారము నడచుకోవాలని నిర్ణయించుకొని, దానికి, ఆలంబనగా చీట్లువేసి దానిలో "తీసుకో" అనివస్తే ఇక వేరే ఆలోచనలేక తీసుకోవడమే, "వద్దు" అని వస్తే రెండో ఆలోచనలేక విరమించుకోవటమే అని నిర్ణయించుకొని బాబా చిత్రపటం ముందు రెండు చీట్లువేసి చిన్నపిల్లవాడు దైవస్వరూపం కనుక వాడి చేత చీటీ తీయిస్తాము. ముందు ఒకటి తాకబోయి రెండో చీటి తీసిఇస్తాడు ఆ బాలుడు. అందులో "వద్దు" అని ఉంటుంది. నేను ఎంతో ఆలోచించికదా ముందుకు అడుగువేసింది. అటువంటిది బాబా వద్దనడే, పిల్లవాడు ముందుముట్టుకోబోయిందే బాబా నిర్ణయం, "వద్దు" అన్నచీటీ తీశాడు కనుక బాబా నిర్ణయం అదికాదు అని మనయిష్టాన్ని దానిపై రుద్ది, పిల్లవాడు కాదు, ఒక పెద్దమనిషిచేత తీయిద్దాము, అది సరియైనది అనుకొని రెండవసారి ఒక పెద్దమనిషి చేత తీయిస్తాము. అప్పుడు "తీసుకో" అని వస్తుంది. ఆశాభయాలకులోనై భగవంతుడి దగ్గరకు చేరిన మనకు, మరల సంశయము వస్తుంది. దైవస్వరూపుడయిన పిల్లవాడు తీసినప్పుడు వద్దు అని వచ్చింది. రెండవసారి తీసుకో అని వచ్చింది, ఇలా కాదు, ముచ్చటగా మూడవసారి నేనే తీస్తాను అని భావించి, తీయగా "వద్దు" అని వస్తుంది.

నేను ఎంతగానో ఆలోచించి నిర్ణయం చేస్తాను కదా పైగా బాబా భక్తుడిని అటువంటప్పుడు ఇప్పటివరకు బాబా నేను అనుకున్నది ఏదీ కాదనలేదు కనుక, చికాకుతో చేయటంవలన, ముహూర్తంబాగా లేకో అలా జరిగింది, కనుక ఈమూడు నిర్ణయాలు రద్దుచేసి, ఒకమంచిరోజు గ్రహబలం చూసుకొని నిర్ణయం తీసుకోవాలి అని భావించి కొన్నిరోజులు గడవనిచ్చి, మరల చీటివేసి తీయగా "తీసుకో" అనివస్తుంది. అమ్మయ్య అని ఇప్పుడు మన ఇష్టం ఏమిటో బాబా గ్రహించాడు అని భావించి, దానిని అమలుచేసి ఆ తరువాత అనేక విధాలుగా దానివలన సమస్యలు ఎదుర్కొని చావుతప్పి కన్నులొట్టబోయినట్లు అయ్యి అందుకు బాబాను బాధ్యుడనుచేసి, "చెఱువు మీద అలిగి అసుద్దం కడుక్కోకుండా వెళ్ళిన వారి చందాన" బాబాను నిందించి బాధలు పడ్డవారి లాంటి వారు మనలోనూ ఉంటారు. దీనికంతకు కారణం సద్గురువును తెలుసుకోలేకపోవడం, దానికి అవసరమైన నిజమైన, శ్రద్ధ (అచంచలమైన విశ్వాసం) సబూరి (సర్వకాల సర్వావస్థలయందు అది చెదిరిపోని దృఢమైన నమ్మకం) అనే దక్షిణలను సమర్పించకపోవటం, దానికి అవరోధమైన మనలోని భావాలను, దానికి కారణభూతమైన ఇష్టా అయిష్టాలను తెలుసుకొని వాటిని జయించలేకపోవటం. మనలను సంస్కరించే సద్గురు స్వరూపమైన సద్గ్రంథాన్ని నిజమైన 'పారాయణ' చేయలేకపోవటం. ఇట్లా మనలను సంస్కరించే అనేకమైన అద్భుతమైన సంఘటనలు సాయిచరిత్రలో అనేకం ఉన్నాయి. మనల్ని పరిణితి చెందిస్తూ సద్గురువు కృపకు పాత్రులను చేయటానికి దోహదం చేసే సాయి సన్నిధిని పారాయణ చేసి సాయి కృపను పొందుదిశగా మనలను నడిపించమని దానికి ఆలంబన అయిన రెండుకన్నుల వంటి శ్రీగురుచరిత్ర – శ్రీసాయిలీలామృతము గురుపూర్ణిమ సందర్భముగా పారాయణ చేసి సద్గురుకృపకు పాత్రులవుదాము.

శ్రీ గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

– వి.వి. పూర్ణచంద్రరావు

# జిజ్ఞాస



వివిధ సందర్భాలలో భక్తులమదిలో మెదిలే ప్రశ్నలకు కులపతి శ్రీమాన్ ఎక్కిరాల కృష్ణమాచార్యులగారు అందించిన జ్ఞాన గుళికలను ఆగష్టు 11వ తేదీ వారి జయంతి సందర్భముగా, శ్రీ యు.వి.ఏ. ఎన్ రాజుగారు అందించిన అనంత పుత్రుని అనంత వైభవము సౌజన్యముతో మీ కందిస్తున్నాము.

– సంపాదకుడు

**ప్రశ్న: మంచి పనులు–యోగసాధన మొదలైనవిచేస్తే ఏమివస్తుంది?**

**జవాబు :** "ఏమీ రాదు. కొన్ని కూడనివి పోతాయి. అంతే!" సత్కర్మను చేస్తే ఏమొస్తుందో అన్నది తరువాత, చేయకపోతే మాత్రం దుర్గతి పడుతుంది.

**ప్రశ్న : వర్తమానంలో జీవనం అంటే?**

**జవాబు :** రేడియోలో మనకు ఇష్టమైన గాయకుడు పాడిన ఒక పాట వస్తున్నది. అభిమాన గాయకుని గొప్పతనం వర్ణించటం ప్రారంభించాము. ఇంతలో పాట వినకుండానే ఐపోయింది. ఉపయోగము ఏమిటి?

పెళ్ళికని ఎంతో శ్రమపడి వెళతారు. తీరా పెళ్ళి జరిగే సమయానికి అలా రోడ్డుమీద కబుర్లు చెప్పుకుంటూనో, గదిలో పేకాట ఆడుకుంటూనో ఉండిపోతారు. బద్ధకం వేస్తే ప్రక్కనున్నవాళ్ళ చేతికిచ్చి, 'మా అక్షింతలు కూడా మీరే వేసి రండి" అని చెబుతారు. ఏదో ఆలోచన చేస్తూ మరొకడు భోజనం చేస్తాడు. ఒక పనైపోయింది అన్నట్లు లేస్తాడు. ఏమిటి ఇవాళ కూర అంటే తలగోక్కుంటాడు.

**వర్తమానంలో జీవించటం చేతకావాలి. సన్నివేశాన్ని సూటిగా అనుభూతి చెందుతూ నిర్వహించగలగాలి.** అది చేతగానినాడు ఈ భూమిపైన మానవుడు అనుభవించగలిగింది కూడా ఇక ఏమీ లేదు.

**ప్రశ్న : మంత్రజపం ఎంతకాలం చేయాలి ?**

**జవాబు :** ఎవరికైనా మంత్రముపదేశిస్తే 'ఎన్నిరోజులు చేయాలండీ' (అంటే ఎప్పుడు మనేయాలండీ) అని అడుగుతారు. ప్రేయరు చేసుకోరా నాయనా అంటే ఎన్నో సంవత్సరాల నుండి చేస్తున్నాను. ఇక నేను చేయకపోయినా ఫర్వాలేదంటారు. **సాధన అనేది నిరంతరం సాగవలసినదే, ఈ దేహమున్నంతవరకూ, ఈ జీవితం సాగుతున్నంతవరకూ సాధన కూడా సాగుతుండాలి.** చిన్న కారులో దూరపు ప్రయాణం చేస్తున్నవాడు ఇప్పటికి దాదాపు అరవై మైళ్ళుగా నా చేతులు ఈ స్టీరింగును పట్టుకునే ఉన్నాయి. ఇంతసేపటినుండి పట్టుకునే ఉన్నాను. కాబట్టి ఇప్పుడు ఒక్క అయిదు నిముషాల పాటు ఈ చేతులు తీసేస్తే మాత్రం ఏమవుతుంది? అనుకున్నాడనుకోండి, ఏమవుతుంది? చెప్పడానికి అతను మిగిలితే కదా! ఆధ్యాత్మిక సాధన విషయంలోనూ అంతే.

**ప్రశ్న : సద్గురువును మనం ఎంచుకోగలమా?**

**జవాబు :** నీవు ఒక సద్గురువును ఎంచుకుందామని చూస్తున్నావు. అది నీకు సాధ్యమయ్యే పనికాదు. గురువు మనల్ని స్వీకరిస్తాడు తప్ప మనము అతనిని ఎంచుకోలేము. మార్కెట్లో మంచి వంకాయలను ఎంచుకోగలుగుచున్నామంటే వంకాయల కన్నా మనం తెలివిగలవాళ్ళము కనుక, అలాగే గురువును నీవు నిర్ణయించగలిగావంటే అతడికన్నా నీవే ఎక్కువన్నమాట. గురువులకు మార్కులు వేస్తున్నాం. ఎంతటి సాహసం! మనకు తెలియకుండానే మనను స్వీకరించి మనకు కనబడకుండానే మనను నడిపిస్తూ అవసరమైన వేళ, మనకు శరీరంతో సాక్షాత్కరిస్తాడు గురువు. అంతవరకూ నీకు తెలిసిన సత్కర్మను త్రికరణ శుద్ధిగా ఆచరించు. నీ గురువే నీ దగ్గరకు నడిచి వస్తాడు.

**ప్రశ్న : సద్గురువును గుర్తించటం ఎట్లా?**

**జవాబు :** నీ నుండి ఏమైనా ఆశించేవాడు నీకు గురువు కాలేడు. నీపైన ఆధారపడేవాడు నీకు గురువు కాడు. తనను, తన నమ్మకాలను, విశ్వాసాలను నీపైన రుద్దేవాడు నీకు గురువు కాడు. గుర్తింపును కోరేవాడు నీకు గురువు కాడు. **నీనుండి ఏమీ కోరనివాడు, నీ శ్రేయస్సు తెలిసి, నిన్ను నిష్కామంగా నడిపించేవాడు, నిన్ను తనంతవానిగా తీర్చిదిద్దేవాడు నీ గురువు.** ఒక అయస్కాంతం తన సాన్నిధ్యం చేత మరో ఇనుపముక్కను అయస్కాంతంగా చేస్తోంది. అలాగే గురువు కూడా తన సాన్నిధ్యాన్ని ప్రసాదించడం ద్వారా నిన్ను దివ్యత్వంలోనికి మేల్కొల్పుతాడు.

**ప్రశ్న : సద్గురువు సాన్నిధ్యం ఎట్లాపొందగలము?**

**జవాబు :** సూర్యునికీ పద్మానికీ ఎంత దూరం. కాని సూర్యుడు ఉదయించగానే పద్మం వికసిస్తోంది. దీనినే సాన్నిధ్యం ప్రసాదించడం అంటారు. గురువుకు ఎంత దూరంలో ఉన్నా శిష్యుడు గురువును స్మరించడం ద్వారా ఆయన సాన్నిధ్యాన్ని పొంది విప్పారగలడు. ఇంకో గమ్మత్తు చూశారా. పద్మం వికసించే పద్ధతిలో ఒక రమ్యత ఉన్నది. అది అన్నివైపులా సమానంగా ఏకకాలంలో వికసిస్తోంది. అలాగే పరమగురువు సాన్నిధ్యం వలన శిష్యుడు సర్వతోముఖాభివృద్ధి పొందుతాడు.

**ప్రశ్న : ఆశ, మమకారాలు ఉండవచ్చా?**

**జవాబు :** కోడిపిల్ల తయారయ్యేవరకూ గ్రుడ్డుగా చుట్టూ ఉన్న తెల్లడొప్ప దానికి రక్షణ నిస్తుంది. పిల్ల తయారైన పిదప అదే అడ్డమై పిల్ల దానిని చిట్లగొట్టి బయటకు వస్తుంది. అలాగే సామాన్య స్థితిలో ఉన్న మానవుడు బ్రతికి బట్ట కట్టడానికి మమకారాలు, ఆశలు మొదలైనవి కారణాలు, దివ్యత్వాన్ని పొందిన తర్వాత అవే తొలిగిపోతాయి.

# ప్రేమావతారి మాతృశ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ

ప్రేమతత్వం యొక్క విశ్వరూపాన్ని దర్శింపచేయటానికి వచ్చిన ప్రేమావతారం జిల్లెళ్ళమూడి అమ్మ. మానవుడు మాధవుడిగా మారటానికి మానవాతీత శక్తులు అవసరంలేదని, పరిపూర్ణ మానవత్వంతోనే దైవత్వాన్ని పొందవచ్చని అమ్మ నిరూపించారు. అమ్మ మాటలకు కాలదోషంలేదు. సర్వకాల సర్వావస్థలలోను ఆచరించదగినవి, అనుసరణీయమైనవి. అమ్మ చెప్పే ప్రతి మాట పండితులకే కాదు పామరులకు అర్థం అయ్యే రీతిలో ఉంటాయి.

అమ్మ 1923వ సంవత్సరం మార్చి 28వ తేదీన రంగమ్మ, సీతాపతి దంపతులకు గుంటూరు జిల్లా పొన్నూరు తాలూకా, మన్నవ గ్రామంలో జన్మించింది. తల్లితండ్రులు ఆమెకు పెట్టిన పేరు అనసూయ. బాల్యంలోనే అమ్మ అలౌకిక స్థితిని, ఆధ్యాత్మిక పరిణితిని రుజువుచేస్తూ ఎన్నో దర్శనాలు, నిదర్శనాలు కనిపించాయి. అమ్మలో సర్వజ్ఞత్వాన్ని, సర్వవ్యాపకత్వాన్ని, సర్వశక్తిమత్వాన్ని గుర్తించి అనేకమంది ఆరాధించారు.



యుక్త వయస్సురాగానే తన మేనత్త కుమారుడైన బ్రహ్మాండం నాగేశ్వరరావు గారితో మే 5, 1936వ సం॥లో వివాహం జరిగింది. నాగేశ్వరరావు జిల్లెళ్ళమూడి గ్రామ కరణంగా పనిచేసేవారు. 1941వ సం॥లో అమ్మ జిల్లెళ్ళమూడి కాపురానికి వచ్చింది. జిల్లెళ్ళమూడి బాపట్లకు 14 కిలోమీటర్లదూరంలో ఉన్న 200 గడపలు కలిగిన చిన్న గ్రామము. అమ్మ జిల్లెళ్ళమూడిని స్థావరంగా ఎంపిక చేసుకోవటం వలన దానికంత గుర్తింపు లభించింది.

అమ్మ అందరిమధ్య సామాన్య స్త్రీగా జీవించారు. ఆ విధంగా జీవించినప్పుడే సామాన్య మానవుని సమస్యలకు పరిష్కారమార్గాలు వివరించటం సులభం. ఇది అవతారపురుషుల లక్షణం అనుకోవచ్చు. అమ్మ చిన్నతనంలో ఆసుపత్రులు, గుడిశెలు, సత్రములు వంటి అనేక చోట్ల సంచరించేది. బాల్యంలో ఒక ఆలయ ప్రాంగణంలో కొందరు బిచ్చగాళ్ళు భిక్షాన్నం పంచుకోవటం చూసి మనస్సు చలించింది. ఆలయం లేని ఊళ్ళో తాను ఆలయాన్ని నిర్మించాలని, సర్వులకు స్వతంత్రమైన సత్రాన్ని ఏర్పాటు చెయ్యాలని సంకల్పించింది. ఆ సంకల్పంతో తన నివాసానికి "అందరిల్లు" అని నామకరణం చేసింది. తన వద్దకు వచ్చినవారిని అక్కయ్య, అన్నయ్య అని పిలిపించి విశ్వకుటుంబ భావన వారిలో కలుగచేసింది. 1956 ఆగష్టు 15వ తేదీన అమ్మ ఆలోచనతో రూపుదిద్దుకున్న ఆలయమే "అన్నపూర్ణ ఆలయము". ఎందరు, ఏ వేళ అమ్మదగ్గరకు వచ్చినా ఆదరంగా అన్నం వడ్డించ బడుతుంది. అమ్మదృష్టిలో కుల, మత, విపక్ష, మంచి, చెడుల విచక్షణలేదు. ఇక్కడ వచ్చేవారి డ్రస్సు, అడ్రస్సును బట్టికాక, ఆకలే అర్హతగా అన్నం పెట్టబడుతుంది. జిల్లెళ్ళమూడికి ఎవరైనా ఆకలితో రావచ్చును కాని ఆకలితో వెళ్ళకూడదు. అమ్మ ఆకలికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నది. వర్గరహిత సమాజానికి అదొక చిహ్నం. "వర్గం లేనిదే స్వర్గం" అని అమ్మ అన్నది కదా!

జిల్లెళ్ళమూడికి ఇంకొకపేరు అర్కపురి. ఇక్కడ సంస్కృత పాఠశాల, కళాశాల ఉన్నాయి. విద్యార్థులందరికి ఉచిత భోజన వసతి సౌకర్యాలున్నవి. విలువలతో కూడిన విద్యాబోధన ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ చదివిన విద్యార్థులు అమ్మ భావాలను పుణికిపుచ్చుకొని ఉత్తమ విద్యార్థులుగా బయట ప్రపంచంలోనికి అడుగుపెడతారు. వారు దేశంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా, ఏ వృత్తి చేపట్టినా, అమ్మ ప్రభావంతో ఏర్పడిన విశిష్ట వ్యక్తిత్వంతో ప్రత్యేకంగా గుర్తించబడతారు. ఆధునిక సమాజపోకడలు వారిలో మచ్చుకైనా కనిపించవు.

1953లోనే అమ్మ తన నిర్యాణాంతరం ఎక్కడ ఉంచాలో తెలియజేశారు. అక్కడ అప్పుడే భక్తులు గుడి నిర్మాణం కొంతమేర చేపట్టారు. తరువాత 1985లో అమ్మ నిర్యాణాంతరం పూర్తిస్థాయి గుడిని నిర్మించారు. ఆ గుడి పేరు "అనసూయేశ్వరాలయం". అమ్మ భౌతికంగా ఉన్నప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే నెల 5వ తేదీన భక్తులు అమ్మ పెళ్ళిరోజును ఘనంగా ఆ గుడిలో జరుపుకుంటున్నారు. గర్భ గుడిలో అమ్మకు పూజలు జరుగుతున్నాయి. అమ్మ 1985, జూలై 12న అరవై మూడవ ఏట నిర్యాణం చెందారు. అమ్మ భౌతిక కాయాన్ని అమ్మ ఆదేశానుసారం ఆ గుడిలోనే ఖననం చేశారు. 1987లో ఖననం చేసిన ప్రదేశంలో అమ్మ నల్లరాతి విగ్రహం నెలకొల్పారు.

ఇక్కడ ఉచిత వైద్యాలయం ఉంది. ఆదరణాలయము ద్వారా వృద్ధులకు, వికలాంగులకు ఆశ్రయం కల్పించబడుతున్నది. ఆధ్యాత్మిక సాధకులకు తపోభూమిగా ఉన్న ఈ అర్కపురిలో అనసూయేశ్వరాలయము, హైమాలయము రూపుదిద్దుకున్నాయి. అందరి మూర్తులు పలువురిచే ఆరాధింపబడుతున్నాయి. అమ్మ ఉపన్యాసాలు చెయ్యకపోయినా, శాస్త్రాలు చదవకపోయినా సంభాషణలలోను, సంవాదనలలోను కొన్ని అపూర్వసత్యాలను ఆవిష్కరించింది. వాటిలో కొన్ని పూర్వ శాస్త్రాలలోను, ఉపనిషత్తులలోను, రాయబడిన వాటితో పోల్చవచ్చు. కొన్ని వాటికంటే అతీతంగా నేటి మేధావుల ఆలోచనలకు పదునుపెడుతున్నాయి. అమ్మ ఏమి ప్రవచించినా తన అనుభవమే ఆధారంగా తీసుకున్నది కాని ఏశాస్త్రాన్ని ఆలంబన చేసుకోలేదు.

(జూలై 12వ తేదీ మాతృశ్రీ జిల్లెల్లమూడి అమ్మ ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సౌజన్యం: **"మాతృశ్రీ"** సేకరణ: **శ్రీమతి వి.యస్. లక్ష్మి**, తెనాలి

# భేట్‌గామ్ శ్రీ నారాయణ మహరాజ్

అపార దత్తావతారులుగా ప్రసిద్ధికెక్కిన సద్గురు శ్రీ నారాయణ మహరాజ్ 1885వ సంవత్సరము మే 20వ తేదీన కర్ణాటకలోని 'చాగల్‌కోట'లో జన్మించారు. జన్మించిన చిన్ననాడే 1886లో పితృవియోగం, 1890లో మాతృవియోగము సంభవించగా, తన 5వ ఏట నుంచి అమ్మమ్మ సంరక్షణలో పెరిగిన శ్రీ నారాయణ నిరంతరం శ్రీదత్త స్మరణలో గడిపేవారు. తన ఎనిమిదవ ఏట తోటి పిల్లలతో ఆటలాడుతూ ఊరిచివర ఉన్న ఒక గుహలో ప్రవేశించిన శ్రీనారాయణకు ప్రకాశవంతమైన గుహ అంతర్భాగములో ఒక మహాయోగి దర్శనమైంది. ఆ యోగి మందహాసంతో తన దివ్యదృష్టి కటాక్షంతో, నారాయణలో అపారమైన శక్తి వంతమైన దివ్యానుభూతిని ప్రసాదించారు. తన్మయత్వంతోనే ఇంటికి చేరిన నారాయణకు ఉపనయన సంస్కరణ జరుగగా అప్పటినుంచి నిరంతరం గాయత్రీ, దత్తనామ స్మరణతోపాటు వేదపారాయణ చేస్తూ గడిపేవాడు. తన తదనంతరము తన ఆస్థిపాస్తులకు నారాయణని వారసుడుగా చేయాలని అమ్మమ్మ తలుస్తుండగా అది రుచించని పినతల్లుల మనోభావమెరిగిన నారాయణ ఇల్లు వదలి ప్రయాణం సాగించి, పరశురాముని తల్లి అయిన రేణుకాదేవి ఆలయ నిలయమైన ఎల్లమ్మకొండ చేరి నిద్రించగా, రేణుకామాత దర్శనమిచ్చి, ఆశీర్వదించి అదృశ్యముంది. తదుపరి శ్రీదత్తాత్రేయుని, స్వప్నాదేశముతో గాణ్గాపూర్ చేరి దాదాపు 10 నెలలపాటు కఠోరవమైన దీక్ష కొనసాగించగా, భౌతిక దేహంతో శ్రీ దత్తాత్రేయస్వామి వారి దర్శనం పొందిన శ్రీనారాయణ, దత్తప్రభువు ఆదేశముతో తీర్థయాత్రలు కొనసాగిస్తూ శ్రీరాముడి దప్పిక తీర్చిన పవిత్ర భూమియైన భేట్‌గామ్ గ్రామం చేరి శ్రీవారి ఆజ్ఞతో ఒక పర్ణశాల నిర్మించుకొని తీవ్రసాధన కొనసాగించేడు. ఒకనాడు శ్రీదత్తప్రభువు దర్శనమిచ్చి సమీపంలోని ఔదుంబర వృక్ష సమీపంలో తన నిర్గుణ పాదుకలు నీకోసం నిక్షిప్తం చేశానని చెప్పగా,ఆ శ్రీదత్త దివ్యవాణి విని, అక్కడ త్రవ్వి చూడగా ఆషాడ శుద్ధ దశమి (1905వ సంవత్సరము)రోజున పాదుకలుబయట పడినయ్యి.



శ్రీ దత్తాత్రేయుని అపార కరుణకు పరవశమొందిన శ్రీ నారాయణ వాటిని అభిషేకించి, ఆషాడ పౌర్ణమి రోజున ఆ ఔదుంబరము చెంత ప్రతిష్టించి, అత్యంత భక్తిశ్రద్ధలతో వాటిని ఆరాధించసాగేరు.

బేలాపూర్‌లోని శ్రీ విద్యానందస్వామి ఆషాడ పౌర్ణమిరోజు తన భౌతికదేహం వీడుతూ ఇకనుంచి నేను శ్రీ నారాయణ యోగి రూపంలో సర్వులను అనుగ్రహిస్తానని చెప్పటంతో ఆ శిష్యులందరు, శ్రీ నారాయణ చెంతకుచేరి యోగిని మహరాజ్‌గా పూజించసాగేరు.

అంజనీబాబు అనే ప్రఖ్యాత గాయనీమని స్వరం మూగబోయి ఎన్ని రకాల వైద్య చికిత్సలు చేసిన తగ్గకపోగా చివరికి భేట్‌గామ్ చేరి పాదుకలు దర్శించి శ్రీ నారాయణ మహరాజ్ అనుగ్రహించిన విభూతి ధారణ సేవనంతో ఆమెకు తన స్వరం తిరిగి రావటముతో శ్రీనారాయణులే ప్రత్యక్ష దత్తప్రభువని భావించి ఇక నుండి తను పాడేపాటలు అన్నీ శ్రీ నారాయణ మహరాజ్ గారి కొరకే అని చెప్పి ఆ రీతిగానే జీవించారు.

పూణేలోని దక్కన్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా పనిచేస్తున్న ఉడ్‌హౌస్ అనే దివ్యజ్ఞాన సమాజానికి సంబంధించిన ప్రముఖులు తన యాత్రలో భాగంగా భేట్‌గ్రామ్ దగ్గర కొండ దగ్గరకు వచ్చి దాహంతో నోరు ఎండిపోయి కూలబడిపోగా, అక్కడే ఉన్న శ్రీనారాయణ మహరాజ్ ఎండిపోయిన ఒక చెట్టు ప్రక్కన ఉన్న నీటిబుగ్గ నుండి నీరు వచ్చేలా చేయటముతో అది గ్రహించిన ఉడ్‌హౌస్‌గారు శ్రీ నారాయణ మహరాజ్‌గారి మహిమ గ్రహించి, తన స్నేహితులకు తెలియజేయగా మర్నాడు ఆంగ్ల దిన పత్రికలో ఆ వార్త ప్రముఖంగా ప్రకటించటము జరిగింది. ఆ దివ్య లీలతో శ్రీ నారాయణ మహరాజ్ వారి గురించి తెలిసిన భక్తజనులు తండోపతండాలుగా భేట్ గ్రామం రావటం ప్రారంభించారు. శ్రీదత్త స్వరూపులైన శ్రీ నారాయణ మహరాజ్‌గారి సన్నిధిలో అద్భుతమైన శాంతిని అనుభవించటమే కాకుండా, వారి వారి కోరికలు నెరవేరడంతో ప్రజలు శ్రీనారాయణ మహరాజ్‌ను శ్రీ దత్త స్వరూపులుగా భావించి ఆరాధించటం ప్రారంభించారు.

శ్రీ నారాయణుల వారు అతి సరళమైన భాషలో తక్కువ మాటలతో భారత, భాగవత, భగవద్గీత గ్రంథాలలోని విషయాలను వివరించి చెప్పటమే కాకుండా, ఆత్మ దర్శనమే పరమార్థమని దాని కోసం దయ, క్షమ, శాంతి, శుచిత్వము మొదలైన గుణాలను అలవరచుకోవాలని బోధించేవారు. నిరంతరం శ్రీదత్తనామ స్మరణతో, శ్రీ దత్తప్రభువును ప్రత్యక్షం చేసుకొన్న శ్రీ నారాయణ మహరాజ్‌గా ప్రజలచే కీర్తించబడుతున్నప్పటికీ అతి సామాన్యమైన వ్యక్తిగానే జీవిస్తూ, అందరూ ఆ దత్తప్రభువు కృపపొందాలని, ఆకాంక్షించే వారు. దానికి సగుణరూపమైన శ్రీ దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ట నిమిత్తము శ్రీసీతారామ లక్ష్మణుల పాద స్పర్శతో పునీతమైన భేట్ గ్రామంలోనే స్థల సేకరణ చేయాలని సంకల్పించుకోవటంతో

అది తెలిసిన దూరప్రదేశాలనుండి కూడ అనేక మంది భక్తుల సహకారముతో 9 ఎకరాల విస్తీర్ణమైన స్థలసేకరణచేసి శ్రీదత్త మందిర నిర్మాణానికి పూనుకున్నారు శ్రీ నారాయణ మహరాజ్‌గారు. మనియార్డరు మరియు పోస్టు ద్వారా విరాళాలు వెల్లువెత్తటంతో అది గమనించిన అప్పటి పోస్టుమాస్టరు జనరల్, శ్రీ మహరాజ్‌గారిని దర్శించుకొని వెనువెంటనే భేట్ గ్రామ్ లోనే ఒక పోస్టాఫీసును ఏర్పరచారు. అద్భుతమైన రీతిలో నిర్మించిన శ్రీదత్తమందిరములో 1913వ సంవత్సరము వైశాఖ శుద్ధ పంచమినాడు, అపార దత్తవతారులైన శ్రీ నారాయణ మహరాజ్‌గారి కరకమలముచే ఉత్తరాభిముఖంగా, ఈశ్వరాంశ సంభూతుడైన శ్రీదత్తప్రభువు విగ్రహప్రతిష్ఠ జరిగింది. శ్రీ దత్తనుగ్రహముతో అష్టసిద్ధులు వశం చేసుకున్న శ్రీ మహరాజ్ సర్వపాణికోసం దుఃఖాన్ని దూరం చేయటానికి తన సాధనాశక్తిని వినియోగించేవారు. ఒక కుగ్రామమైన – భేట్‌గ్రామ్, మహాపుణ్యస్థలిగా మారిపోయింది. భక్తుల సౌకర్యార్థము, భోజన వసతిగృహాలు ఏర్పాటుచేయటమైనది.

ప్రజలందరినీ ఏకం చేయాలని వారిలో ధార్మిక చింతన పెంపొందించాలని నిరంతరం వైదిక ధర్మాలతో కూడిన అనేక కార్యక్రమాలు భేట్‌గ్రామ్‌లో నిర్వహించే వారు. 1928వ సంవత్సరములో 1331 వేదశాస్త్ర పారంగతులచే అతి రుద్రమహానుష్టానం, 1933వ సంవత్సరములో మార్గశిరమాసములో జరిగిన సామూహిక సత్యన్నారాయణ వ్రతాలు, "నభూతో న భవిష్యతి" గా నిర్వహించటముతో వేలాదిమంది పండితుల రాకతో పునీతమైన ఆశ్రమమును చూడటానికి, అసంఖ్యాకమైన భక్తజనులు విచ్చేశారు. ప్రతి ఒక్కరికీ తగురీతిని శ్రీనారాయణ మహరాజ్‌గారు ఏర్పాటు చేసిన వసతి సదుపాయాలు, భోజనాదులకు చూసి శ్రీ దత్తప్రభువు మహిమకు, దానికి కారకులైన శ్రీనారాయణ మహరాజ్ గారిని, వేనోళ్ళ కీర్తించారు. అయినా శ్రీ నారాయణ మహరాజ్ "అది అంతా శ్రీదత్తప్రభువు అనుగ్రహమని, తాను ఒక సామాన్యుడనని ప్రతి ఒక్కరూ దత్తప్రభువు అనుగ్రహము పొందాలనేదే తన సంకల్పమని" అనేవారు.

అవతార మెహర్‌బాబావారు ఈ విశ్వంలో ఐదుగురు గురుస్థానానికి తగిన వారని వారిలో శ్రీ నారాయణ మహరాజ్ ఒకరని తెల్పటమే కాక తాము, శ్రీ మహరాజ్‌గారిని దర్శించుకునేవారు.

శ్రీ నారాయణ మహరాజ్ గారిని ఎందరో మహాత్ములు గౌరవించటం, తమకంటే అధికులని కీర్తించటం తన శిష్యులను శ్రీమహరాజ్ దర్శనార్థం పంపించటం వారి చరిత్రలో చూడవచ్చు. నేపాల్ మహరాజ్, మైసూరు మహరాజ్, ఇండోర్‌రాజు హోల్కర్, గ్వాలియర్ రాజు సింధియా మొదలైనవారు శ్రీ నారాయణ మహరాజ్‌ను దర్శించి సేవించుకునేవారు.

సామాజిక జీవనానికి, ఆధ్యాత్మిక జీవనానికి అంతరం లేదని, ధర్మం అన్నది సామాజిక జీవనంలో ఒక భాగమని విశ్వసించేవారు శ్రీ మహరాజ్ అన్నదాన ప్రక్రియ ద్వారా సగటు మనిషి జీవితాన్ని శాంతిమయం చేసుకోవాలని బోధించేవారు. అనేక ధార్మిక, శిక్షణ సంస్థలకు భారీ విరాళాలు తాము ఇస్తూ ఇతరులను ప్రోత్సహించేవారు. వసుధైక కుటుంబముగా సర్వులు కలసి మెలసి జీవించాలని, అతి సామాన్యులు సైతం శ్రీ దత్తప్రభువు కృపను పొందాలని, ఆచార శుద్ధత, తత్వ విచారము వలననే మానవుడు జ్ఞాన సంపన్నుడు కావాలన్నదే శ్రీ మహరాజ్‌గారి ధ్యేయం.

శ్రీ నారాయణ మహరాజ్, రామేశ్వరం, మథుర, శ్రీరంగం, తిరుమల, కాశీ, గయ లతోపాటు దేశంలోని సర్వ తీర్థ, పుణ్య క్షేత్రాలను దర్శించమని భక్తులకు చెప్పేవారు. శ్రీ నారాయణ మహరాజ్‌గారి యోగసాధన దినదినప్రవర్ధమాన మవుతున్నది. వారి శారీరక ధారుఢ్యం క్రమేపీ క్షీణించసాగింది.

1945 సంవత్సరం శ్రావణ శుద్ధ ద్వాదశి సోమవారం (03-09-1945) నాడు మైసూరులోని శ్రీ మల్లిఖార్జునస్వామి వారికి 108 స్వర్ణ కమలాలు, 11 స్వర్ణ బిల్వపత్రాలు సమర్పించి, అందరిచేత "ఓం నవో నమః శివాయ నమః" అన్న మహామంత్రాన్ని ఉచ్చరింపచేసి పద్మాసనం వేసుకొని సాయంత్రం 5-30 ని॥ లకు శ్రీ దత్తభగవానుడిలో లీనమయ్యారు శ్రీ నారాయణ మహరాజ్.

మైసూరు మహరాజ్‌వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో శ్రీనారాయణ మహరాజ్ భౌతిక దేహాన్ని బెంగుళూరు తీసుకు వచ్చి భక్తుల కోరికపై కెంపంబూడి సరస్సు సమీపంలో 2 ఎకరాల స్థలప్రాంగణంలో శాస్త్రోక్తంగా అగ్ని సంస్కారాలు నిర్వహించి, వారి అస్థికలను వెండి కలశంలో భేట్‌గామ్ తీసుకువచ్చి నిరంతరం మహరాజ్‌గారు కూర్చొన్న ప్రదేశములో వాటిని నిక్షిప్తం చేసి, సమాధి మండపంపై పాదుకల ప్రతిష్టచేయటమైనది.

కొలిచినవారి పాలిట కొంగుబంగారమై నిలచి శ్రీదత్తస్వరూపులుగా కీర్తించబడిన భేట్‌గ్రామ్‌లోని శ్రీ నారాయణమహరాజ్‌గారి సమాధి ఒక పుణ్యస్థలిగా మారింది.

**మార్గం :** పూణే షోలాపూర్ రహదారిలో బేవురా నుండి 2 కి.మీ. దూరంలో కలదు.

(సెప్టెంబరు 3వ తేదీ (తిథిప్రకారం శ్రావణ శుద్ధ ద్వాదశి ఆగష్టు 19 గురువారం) శ్రీ నారాయణ మహరాజ్‌గారి ఆరాధనోత్సవం సందర్భముగా సమర్పణ.)

సౌజన్యం : **శ్రీ నారాయణ మహరాజ్ జీవిత చరిత్ర**

సేకరణ : **శ్రీమతి ఆర్. సాయి సృజన**, బెంగళూరు, కర్నాటక



!! వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ !!

# పూర్ణ అంతరంగాలు

జీవితం ఒక రైలు ప్రయాణం వంటిది. ఆది నుంచి తుది వరకు కలిసి ప్రయాణించే వారు ఎందరు? మధ్యలో కొత్త పరిచయాలు, పలకరింపులు, అనుభూతులు, అనుభవాలు, అందులో కొన్ని జీవితాన్ని మలుపు తిప్పే ఘటనలు. కదిలే కాలచక్రంతో పాటు పయనించే మన జీవన పయనము కూడ అంతే.

"ఈ కలియుగములో మానవునికి ఆయుర్దాయం నూరేళ్ళు అందులో సగకాలం నిద్రలోను, బాల్యం పరాధీనతల వల్ల కొంతకాలం గడచిపోతుంది. ఇట్టి జీవితంలో ప్రాప్తించే లౌకిక సంపద అశాశ్వతం. నీటి బుడగ వంటి ఈ శరీరము నశ్వరము, ఆత్మ చిత్ స్వరూపము, శాశ్వతము దానికి సుఖ దుఃఖాలు ఉన్నాయని అనుకోవటం అజ్ఞానం మాత్రమే. ఉత్తమమైన మానవ జన్మ లభించిన తరువాత కూడ ఆత్మశ్రేయస్సు చేకూర్చుకోనివాడే నిజమైన ఆత్మ వంచకుడు, ఆత్మ ఘాతకుడు, బ్రహ్మ ఘాతకుడును కూడ. సద్గురువు కటాక్షం వల్ల మాత్రమే ఇటువంటి మాయని జయించి, మానవ జన్మ సార్ధకత చెందించుకోగలుతారు" అంటారు కలియుగములో రెండవ దత్తావతారమైన శ్రీ నృసింహ సరస్వతిస్వామి. సర్వవ్యాపకుడైన గురువు అనేక రూపాలలో అనేక విధాలుగా బోధచేస్తూ, సుఖ దుఃఖాలనే వలయం నుంచి బయట పడేసి, జన్మ రాహిత్య దిశగా నడిపిస్తాడు. "సృష్టిలోని 24 మంది గురువుల నుండి జ్ఞానము సముపార్జించాను" అని అవధూత యయాతి మహారాజుతో చెబుతారు." నేడు శ్రీ శిరిడీ సాయిబాబా సహస్ర ముఖాలుగా సహస్ర విధాలుగా బోధిస్తున్నారు. చూడటం, వినటం చేతకావాలి" అంటారు ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టారుగారు. మన జీవన పయనంలో ఎదురయ్యే వ్యక్తులు, సంఘటనలు, ప్రతిదీ ఏదో ఒకటి బోధిస్తూనే ఉంటుంది. అర్థం చేసుకొని అన్వయించుకొని, ముందుకు సాగటమే మన విధి. సత్‌గ్రంధ పఠనము, సత్ సాంగత్యము వలన, మీదుమిక్కిలి భగవత్‌కృపతో లభించిన గురువు, జ్ఞానబోధ చేసి, కాలప్రవాహంలో కొట్టుకుపోకుండా చేసి, జీవన సాఫల్యం చేకూరుస్తారు.

మన జీవన ప్రయాణంలో ఎదురయ్యే వ్యక్తులు, సంఘటనలు, పరిచయాలు, సంభాషణలు, కొన్ని వెనువెంటనే అనుభవానికి వస్తాయి. మరికొన్ని కాలాంతరములో జ్ఞప్తికి వచ్చి, స్ఫూర్తిదాయకమై ముందుకు నడిపిస్తాయి. అయితే సద్గురు పిలుపు, సాంగత్యము, బోధ మాత్రము మన ప్రయత్నం లేకనే మనలను వెన్నాడుతూ సరియైన సమయములో సరియైన దిశలో నడిపిస్తాయి. అందుకు కొన్ని ఉదాహరణలు:– ఆత్మజ్ఞానానికి గురువే అవసరము లేదన్న అన్నాసాహెబ్ ధబోల్కర్ స్నేహితుడైన కాకాసాహెబ్ దీక్షిత్ శ్రీ సాయినాధుడిని దర్శించమని చెప్పినా పెడచెవిని పెడతాడు, అయితే 1910 సంవత్సరములో ఒక రోజున రైలులో ప్రయాణం చేస్తుండగా ఒక ముస్లిం కనిపించి, అన్నాసాహెబ్ దిగవలసిన స్టేషనులో ఈ రైలు ఆగదని, ఫలానాచోట దిగి వెళ్ళమని చెప్పి వెళతాడు. ఆ స్టేషనులో దిగి సమీపంలోనే శిరిడీ ఉందని తెలిసి, శిరిడీ చేరిన అన్నాసాహెబ్, బాబా ఔన్నత్యాన్ని గమనించి, నేడు కోటానుకోట్ల మందికి పారాయణ గ్రంధమైన "శ్రీసాయి సచ్చరిత్ర"కు కారకుడయ్యాడు. శిరిడీ రమ్మని నానాసాహెబ్‌కు, కులకర్ణి ద్వారా సాయి ఎన్నిసార్లు కబురు పంపిన రాని నానాసాహెబ్, ఒక సమస్య మీద సాయి సన్నిధికి వచ్చి, ప్రధమ దర్శనములోనే తన తప్పిదము తెలుసుకొని బాబాకు పాదాక్రాంతుడయినాడు, అతనికి రక్షకుడిగా వచ్చిన హెడ్ కానిస్టేబుల్ శ్రీ గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్దే,

బాబా ఔన్నత్యాన్ని గ్రహించి, తనలోని రజోగుణాన్ని వదిలి, జగద్గురువైన సాయి గురించి ప్రచారము చేసేవారిలో అగ్రగణ్యుడై దాసగణు మహరాజ్‌గా వినుతికెక్కేడు. నానాసాహెబ్ చెప్పటముతో, తన శారీరక కుంటితనాన్ని పోగొట్టుకోవటానికై, శిరిడీ వచ్చిన కాకాసాహెబ్ దీక్షిత్, శ్రీ సాయి దివ్యతేజస్సు చూసి, పరవశించి శారీరక కుంటితనము కన్నా తనలోని మానసిక కుంటితనము తీసివేయమని అడిగి, అది పొందటానికి, తన కొరకే కాకుండా, అందరికీ వసతి నిమిత్తము ఒక సత్రాన్ని నిర్మించి, అన్నదానము కూడ ఏర్పాటు చేసాడు దీక్షిత్. అన్నాసాహెబ్ ధబోల్కర్, పిలుపుతో శ్రీ హరివినాయక సాఠే శిరిడీ వచ్చి, ఒక సత్రం నిర్మించటమే కాకుండా తదుపరి కాలములో శ్రీ శిరిడీ సంస్థానానికి అధ్యక్షుడిగా కూడ పనిచేశాడు. సాఠే, దీక్షిత్‌ల పిలుపుతో శిరిడీ చేరిన కపర్దే, బాబా సన్నిధిలో జరిగిన సంఘటలను తేదీల వారిగా నమోదు చేసి, బాబా దినచర్య ప్రచురించి ఆదర్శుడైనాడు. నానాసాహెబ్ పిలుపుతో శిరిడీ చేరిన సుందరీభాయి క్షీరసాగర్, ప్రథమ దర్శనముతోనే శ్రీసాయిలో జగద్గురువైన శ్రీకృష్ణుడిని గాంచి, సాయిసేవకి అంకితమై, తాను "రాధాకృష్ణమాయి" అయ్యి, ఈనాటి శ్రీ శిరిడీ సాయి సంస్థానానికి ఆనాడే పరోక్ష రూపశిల్పి అవ్వటమే కాకుండా, ఎందరికో ఆధ్యాత్మిక గురువుగా భాసిల్లింది.

దాదాసాహెబ్ కపర్దేతో కలసి శిరిడీ వచ్చిన కృష్ణశాస్త్రి జోగేశ్వర భీష్మ, సాయి కోరిన ఐదు లడ్డూలను పాటల రూపంలో బాబాకు సమర్పించి, బాబా సన్నిధిలో ప్రథమముగా హారతులు పాడటానికి కారణమయ్యాడు. తన క్షయ రోగాన్ని తగ్గించుకోవటానికి శిరిడీ వచ్చిన భీమాజిపాటిల్ తన వ్యాధి నయమవ్వటముతో, శిరిడీలో సాయి సత్యవ్రతాలు జరగటానికి కారణభూతమైనాడు. శ్రీ దాసగణు చెప్పిన హరికథలో బాబా గురించి తెలుసుకొని, బీదవాడైన రఘువీర పురందరే శిరిడీ వచ్చి, కాలాంతరములో బాబా సన్నిహితులలో ఒకరై, నేడు ప్రతి గురువారము శిరిడీలో అత్యంత వైభవోపేతముగా జరిగే చావడి ఉత్సవానికి నాంది పలికేడు. సంతానము కోసం బాబాను అర్థించటానికి శిరిడీ వచ్చిన బాబారే దంపతులు సాయిసేవలో ఉండి, సాయి శయన మందిరముగా భక్తులు భావించే శిథిలమైన చావడిని మరమ్మత్తు చేయించి, సాయిని తమ హృదయ మందిరములో వశించేలా చేసుకున్నారు. నాగపూర్ వాస్తవ్యులు, శ్రీ సాయిబాబాకి సమకాలనీకులైన హజరత్ శ్రీ తాజుద్దీన్ బాబా, తన దగ్గరకు వచ్చిన కోటీశ్వరుడైన బూటీతో, "నీవు ఇక్కడకు ఎందుకు వచ్చావు, నీ గురువు శిరిడీలో ఉన్నారు, త్వరగా వెళ్ళమని" చెప్పటముతో, శిరిడీ వచ్చిన బూటీ, సాయి దివ్య మహిమకు మంత్రముగ్ధుడై, స్వప్నంలో సాయి ఇచ్చిన ఆజ్ఞ మేరకు ఒక అద్భుతమైన కృష్ణమందిరము నిర్మించి, జగద్గురువైన సాయి భౌతిక శరీరాన్ని సమాధి చేయటానికి అది వినియోగించి, నేడు కోటానుకోట్ల మంది దర్శించుకొని పునీతులయ్యే స్వర్గధామానికి కారణభూతమైనాడు శ్రీమాన్ బూటీ. ఇట్లా చెప్పుకుంటూ పోతే, ఇంకా ఎన్నో ఎన్నెన్నో ఉదాహరణలు, "అనేక మిషలమీద కార్యకారణ సంబంధముగా తన వద్దకు తానే లాగుతాను" అన్న సాయి వాక్కులోని అక్షర సత్యమిది. "ఋణానుబంధాన్ని విశ్వసించి గుర్తుంచుకో"మన్నారు బాబా. ఎవ్వరిని, ఎప్పుడు, ఎందుకు, ఎక్కడ కలుపుతారో, దాని పర్యవసానము ఏమిటో, తరచి చూసినా సామాన్యులకు బోధపడని సద్గురు లీలావిలాసము అది.

నా పూర్వజన్మ సుకృతము వలన దైవమైన శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహ ఆశీస్సులతో, మహాత్ములచేత తమంతటి వారని ప్రశంసించబడి, జగద్గురువైన శ్రీ శిరిడీసాయిబాబా అనుంగు బిడ్డడుగా కీర్తించబడి "శ్రీసాయిమాస్టర్"గా వినుతికెక్కిన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి దర్శన, పరిచయభాగ్యం కలిగింది. 1982 నుండి వారు మహాసమాధి చెందిన 1989 లోపల ఆచార్యుల వారిని కలసింది కొద్దిసార్లు మాత్రమే, అయితేనేమి నాలోని అజ్ఞానం ఏ కొద్దిపాటి అయినా తొలగి, ఆధ్యాత్మిక పథంలో పయనం చేయటానికి ప్రయత్నం చేస్తున్నానంటే అది వారి దర్శన, ఆశీస్సుల కృపానుగ్రహ ప్రభావమే.

1989 ఏప్రిల్ 12వ తేదీ మాష్టారుగారు మహాసమాధి చెందిన రోజు వారి పాదాలు పట్టుకొని చేసిన ప్రమాణం నాచే నెరవేర్చుకునేలా చేయటానికేమో, నా ప్రమేయము పూర్తిగా లేకుండానే నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలోని, ఉద్యోగం వదలి స్టీలుప్లాంటులో ఉద్యోగరీత్యా విశాఖపట్నం రావటం జరిగింది. అంతకు ముందు మాష్టారిగారిలో సగభాగమై, సహధర్మచారిణియై వారి అవతార కార్యక్రమానికి భాగస్వామియైన దివ్యజనని అలివేలు మంగమ్మగారి దర్శనం నేను చేసుకోలేదు . కారణం శ్రీమాష్టారి గారిని దర్శించుకొన్నదే కొన్నిసార్లు, వాటిలో సగం, సూళ్ళూరుపేట భాస్కరరెడ్డి గారింట్లోనే. ప్రథమంలో ప్రస్తావించుకున్నట్లు సద్గురువు లీలావిలాసం సామాన్యులైన నావంటి వారికి బోధపడదు. అటు పిమ్మట అకస్మాత్తుగా షార్ వీడవలసి రావటంతో కొన్ని నెలలపాటు నాభార్య,పిల్లలు శ్రీహరికొటలోనే ఉండటము వలన, ఉద్యోగరీత్యా షార్ నుంచి రావలసిన ఆర్థిక లావాదేవీలు, తదితరాల నిమిత్తము విశాఖపట్నం, షార్‌కు మధ్య చాలాసార్లు తిరగవలసి వచ్చింది.ఆ సమయంలో రాను, పోనులో మధ్యలో ఒంగోలులో దిగి విశ్వచైతన్యులైన మాష్టారుగారిని దర్శించుకొని, పారాయణ పుస్తకాల నిమిత్తము మాష్టారుగారింటికి వెళ్ళటము "గురుపాదుక" పనులుచూసే లక్ష్మిగారితో కొద్దిసేపు సత్సంగము చేసుకోవటం వలన, మాష్టర్‌గారి ప్రతిరూపమైన అమ్మగారిని ప్రథమంగా దర్శించుకోవటం జరిగింది. అటుపిమ్మట కూడ ఒంగోలు వెళ్ళినప్పుడు డల్లా అమృతమూర్తి అయిన అమ్మగారి దర్శనం చేసుకోవటానికి వెళ్ళేవాడిని, దర్శనం చేసుకునే లోపల, లక్ష్మిగారిద్వారా మాష్టారి గారి ఔన్నత్యం గురించి ఎన్నో విషయాలు తెలుసుకోవటమే కాకుండా, అమ్మగారి దర్శన ఆశీస్సులతోపాటు, వైజాగ్‌లోని సత్సంగసభ్యుల కొరకు పారాయణ పుస్తకాలు తీసుకొని, (మాష్టారిగారి రచనలు అన్నిచోట్ల అప్పట్లో దొరికేవి కావు, అంతెందుకు, వైజాగ్ ఇంటర్వ్యూకి వెళ్ళేటప్పుడు మొట్టమొదటి దత్తావతారుడైన శ్రీపాదశ్రీవల్లభులు జన్మించిన పిఠాపురంకు వెళ్ళి పాదగయక్షేత్రములోని శ్రీదత్తాత్రేయుని దర్శనానికి వెళ్ళటం జరిగింది. ఆలయములో వంశ పార్యంపర పూజారి, వయో వృద్ధులైన శ్రీమాన్ నూకరాజు శర్మగారు శ్రీదత్తాత్రేయుల వారి గురించి, ఆ సంప్రదాయాన్ని ఆంధ్రావనికి అందించటములో అద్భుత కృషిచేసిన శ్రీ భరద్వాజగారి గురించి ఎంతోగొప్పగా చెప్పి, వారు రచించిన శ్రీగురుచరిత్ర నాకు ఎక్కడ దొరకలేదు అది పారాయణ చేయాలని ఉంది అంటే, తరువాతి ప్రయాణంలో

శ్రీగురుచరిత్ర తీసుకువెళ్ళి వారికి ఇస్తే ఎంతగా పొంగిపోయారో. అప్పటి నుంచి నేను పిఠాపురం ఎప్పుడు వెళ్ళినా, శ్రీదత్తుని గురించి, తన సాధన గురించి అనేక విషయాలు తెలియజేసేవారు శ్రీశర్మగారు. మాష్టారి రచనలకే అంత అద్భుతమైన మహిమ ఉంటే, మరి వారి ప్రత్యక్ష సాన్నిధ్యానికి ఇంకెంత మహిమ ఉంటుందో కదా.) అందుకనే ప్రత్యేకంగా ఒంగోలు వచ్చి పారాయణ పుస్తకాలుకొని, మాష్టారుగారి స్వరూపమైన అమ్మగారి సన్నిధిలో కొద్దిసేపు ధ్యానం చేసుకొని, వారిచ్చిన విభూతి, ప్రసాదం స్వీకరించి, అక్కడి శ్రీరామాంజనేయులుతో ముచ్చటించి, లక్ష్మిగారితో కొద్దిసేపు సత్సంగం చేసుకొని, హృదయభాండాన్ని ఆధ్యాత్మికానుభూతితో నింపుకొని వైజాగ్ తిరిగి వచ్చేవాడిని. ఎందుకో ఏమో తెలీయదు గాని, మాష్టారుగారిని దర్శించిన ప్రతిసారి వారి సన్నిధిలో అద్భుతమైన ప్రశాంతతతోపాటు ఒక అలౌకికమైన ఆనందం, ఆత్మానుభూతి లభించేది. అమ్మగారి సన్నిధిలో కూడ అదే అనుభవించేవాడిని. మాష్టారుగారిని అసలు చూడనివారు, నాతోపాటు మొట్టమొదటిసారిగా వైజాగ్ నుండి ఒంగోలు వచ్చినప్పుడు మాష్టారి సమాధి వద్ద, అమ్మగారి ప్రత్యక్ష సన్నిధిలోనూ, అదే అనుభూతి తాము పొందేమని చెప్పేరు. అందుకు కారణం వారిరువులు వేరయితేనే కదా!

శ్రీ భరద్వాజ మాష్టారుగారు 1989 ఏప్రిల్ 12వ తేదీ సమాధి అయినపుడు, వారి పాదాలు పట్టుకొని "మీరు దేనికోసం అయితే కృషి చేశారో దానిని నిలబెట్టటానికి నా శాయశక్తులా ప్రయత్నం చేస్తాను. అందుకు కావలసిన శక్తిని సాయికి చెప్పి ఇప్పించండి" అని విశ్వచైతన్యంలో నిలచిన మాష్టారుగారిని అడిగేను. (అప్పటికి మాష్టారుగారు సాయి స్వరూపులు అన్న పూర్తి భావం నాకు కలుగలేదు, ఆ తరువాత అనుభవాలు వారే సాయి స్వరూపులు అని ఋజువుచేసినయ్యి.) అటువంటప్పుడు మాష్టారిగారి అర్ధభాగమయిన అమ్మగారు సాయి స్వరూపులు గాకమరేమిటి, వారి అనుగ్రహంతో, జీవితంలో నేను పొందిన అద్భుతమైన అనుభవాలను, హృదయలోతుల్లో దాగిన నాటి స్మృతులను వీలయినంతమేర మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తాను.

"మీరు ఎక్కడ ఉంటే అక్కడ సత్సంగం చేయండి, అదే నాకు అక్షర లక్షలు ఇచ్చినట్లు" అన్న మాష్టారిగారి ఆదేశం అనుసరించటమే వారికి నిజమైన దక్షిణ సమర్పించటమని భావించి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో కొన్ని వందల గ్రామాలు పర్యటించి, మండల కేంద్రాలలో శ్రీసాయి భరద్వాజ, శ్రీసాయి మాస్టర్ పేరిట అనేక సత్సంగ కేంద్రాలు ఏర్పాటు చేయటము జరిగింది, వారికి కావలసిన పారాయణ పుస్తకాలకోసం ఒంగోలు వచ్చి తీసుకొని, అమ్మగారి ఆశీర్వాదం అందుకొని వెళ్ళటం జరిగేది. జీత నష్టాన్ని కూడ లెక్కచేయకుండా, కొన్ని సంవత్సరాలపాటు రోజుకు మూడు నాలుగు గ్రామాలు పర్యటిస్తూ ఆధ్యాత్మికతే తెలీయని ఎన్నో గ్రామాలలో శ్రీసాయి గురించి, శ్రీసాయి కృపను అత్యంత సులువుగా పొందే అద్భుతమైన మార్గమందించిన శ్రీ భరద్వాజగారి గురించి తెలియజేస్తూ, సత్సంగాలు నిర్వహించటముతో, అక్కడ అనేక మండలాలు, గ్రామాలలో శ్రీసాయిమాస్టర్ సత్సంగ మందిరాలు ఏర్పడటము జరిగింది. దాని వెనుక మాష్టారిగారి ప్రణాళిక, అమ్మగారి ఆశీర్వాదమే కారణం.

శ్రీసాయికి సమకాలనీకులైన వారిని శ్రీ భరద్వాజమాష్టారుగారు దర్శించి, వారిద్వారా శ్రీసాయిలీలా అమృతాన్ని తాను ఆస్వాదించి, శ్రీసాయి సన్నిధిని నిరంతరం అనుభవిస్తూ, ఆ అద్భుత అవకాశం మనకు కలుగచేశారు శ్రీసాయి స్వరూపులైన పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గారు. శ్రీసాయిలీలామృతము పారాయణ చేస్తున్నప్పుడు బాబాని ప్రత్యక్షంగా సేవించుకున్న వారు ఎంతటి అదృష్టవంతులో అని భావిస్తూ, శిరిడీ వెళ్ళినప్పుడు వారు నివశించిన గృహాలు దర్శించిన మనము, ఏ విధముగా అయితే శ్రీసాయిని చూసినంతగా ఉప్పొంగిపోతామో, అదే విధముగా సాయి స్వరూపులైన మాష్టారిగారితో సన్నిహితులైన వారందరిని ప్రత్యక్షముగా కలుసుకొని, వారిద్వారా శ్రీసాయి సంప్రదాయాన్ని, భరద్వాజ గారి సాన్నిధ్యాన్ని, వారు చూపిన శ్రీసాయి మార్గాన్ని మారుమూల గ్రామాలలో వారికి అందిస్తే వారి హృదయాల లోతులలోకి శ్రీసాయితత్వం ఇంకా బలీయంగా వెళుతుందని" అనే ఆలోచన నాలో మెదిలింది. అయితే దానిని సాకారం చేసుకోవటం ఎట్లా, శ్రీ భరద్వాజమాష్టారిగారికి అత్యంత సన్నిహితులైన వారిలో అతి కొద్ది మంది మాత్రమే నాకు తెలుసు, మిగిలిన వారందరిని కూడ కలుసుకొని, శ్రీ భరద్వాజగారందించిన శ్రీసాయి సంప్రదాయాన్ని సంపూర్ణముగా తెలుసుకోవాలని నా ఆకాంక్ష కూడ. అయితే ఇది సాధ్యపడేది ఎట్లా? ఇంత మారుమూల గ్రామాలనుండి అందరు, అన్ని చోట్లకి కాదు, కనీసం ఒంగోలుకు కూడ రాలేనివారున్నారు, అట్లా అని, ఎక్కడెక్కడో ఉన్న మాష్టారిగారి సన్నిహితులను ఇంత మారుమూల గ్రామాలకు తీసుకురావాలి అంటే, అందుకు అనేక కారణాలు అడ్డంకిగా నిలచినయ్యి, దానికి పరిష్కారంగా ఒక అద్భుతలైన మార్గం మదిలో మెదిలింది, వెంటనే ఒంగోలు వెళ్ళి మాష్టారిగారి సమాధిని దర్శించి, వారితో నాకోరిక విన్నవించి, కార్యరూపం దాల్చేలా అనుగ్రహించమని వేడుకొని, అమ్మగారి ఆశీర్వాదం అందుకొన్న తరువాత మదిలో మెదిలిన భావన సాకారమయి నిలచింది. అదే "అఖిలాంధ్ర శ్రీసాయిమాస్టర్ భక్త సమ్మేళనం"

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ఆధ్వర్యములో అనేక ప్రాంతాలలో అనేక సంవత్సరాలుగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నాము. కనుక ట్రస్టు వార్షికోత్సవానికి అన్ని జిల్లాలలోని ట్రస్టు అనుబంధ సంస్థలన్నిటి నుండి విశేషంగా జనులు విచ్చేస్తారు కనుక నూతన శతాబ్ది అయిన 2000 సంవత్సరములో విశాఖపట్నం – ఉక్కునగరంలో జరిగే ట్రస్టు వార్షికోత్సవమే ఇటు గ్రామీణ ప్రాంతాల వారిని, అటు మాస్టరుగారి సన్నిహితులను ఏకం చేయటానికి అన్ని విధాల అందరికి అనుకూలమైనదని భావించి, శ్రీశిరిడీసాయి సేవాట్రస్టు సప్తమ వార్షికోత్సవాన్ని మొట్టమొదటి "అఖిలాంధ్ర శ్రీసాయిమాస్టర్ భక్తసమ్మేళనము"గా నిర్వహించాలనే సంకల్పం నాలో తీవ్రంకాగా, అంతవరకు మాష్టారిగారిని దర్శించని ట్రస్టు సభ్యులు కూడ, ఈరకంగా మష్టారిగారిని దర్శించి సేవించుకొన్న వారిని మనము ప్రత్యక్షంగా ఒక్కచోటే దర్శించుకుంటూ, వారికి ఆతిథ్యమిచ్చే అవకాశం కలుగుతుందని, బృహత్తరమైన ఆకార్యక్రమము నిర్వహణకు సమాయుక్తమైనారు. వెంటనే కొంతమంది ట్రస్టు సభ్యులతో కూడి ఒంగోలు వెళ్ళి, మాష్టారిగారి సమాధివద్ద కూర్చొని మా ఆలోచన

కార్యరూపం దాల్చేలా అనుగ్రహించమని మాష్టారిగారికి విన్నవించుకోగా, అద్భుత రీతిన మాష్టారిగారి అనుగ్రహ ప్రసాదం లభించింది, అది అందుకొని మాష్టారిగారి ఇంటికి వెళ్లి, దివ్యజనని అలివేలు మంగమ్మగారికి మా సంకల్పము గురించి తెలియజేయగా, మాష్టారిగారి స్వరూపమైన అమ్మగారు మా అభిప్రాయము పూర్తిగా తెలుసుకొని, మందహాసముతో వెంటనే అనుమతి పూర్వక, తన ఆశీర్వాదము అందజేయటమే కాకుండ, శ్రీ ద్వారకానాథ్ చిన్నవాడు కనుక ఆ కార్యక్రమానికి తమ తరపున సంస్థ వ్యవహారాలు చూసే శ్రీరామారావును (శ్రీరామచంద్ర చైతన్య మహరాజ్‌ను) పంపిస్తామని చెప్పి శ్రీ రామారావును ఆ కార్యక్రమానికి వైజాగ్ పంపించేరు.

విశాఖపట్నంలోని మారుమూల ఉక్కునగరంలో 2000 ఫిబ్రవరి 1, 2 మరియు 3వ తేదీలలో ఒక అద్భుతమైన అనిర్వచనీయమైన రీతిలో జరిగిన మొదటి సమ్మేళనము అఖండమై 22వ సమ్మేళనముగా 2021 ఫిబ్రవరిలో "అఖిల భారత శ్రీసాయిమాస్టర్ భక్త సమ్మేళనము"గా రూపుదిద్దుకొని ఒంగోలు మాస్టారిగారి సన్నిధిలో అద్వితీయముగా జరిగింది. సమ్మేళన కారణంగా దేశంలో ఎక్కడెక్కడో ఉన్న మాష్టారిగారి సన్నిహితులు, సహోద్యోగులు, విద్యార్థులు, సత్సంగసభ్యులు, మాష్టారిగారి రచనల ద్వారా, శ్రీసాయి మార్గంలోకి వచ్చిన వేలాది మంది నేడు ఒక్కచోట చేరి, ఒకే కుటుంబముగా కలసి మెలసి ఆధ్యాత్మికానుభూతులు పొందగలుగుతున్నామంటే అది శ్రీసాయిమాష్టర్ ప్రణాళికలోని భాగమే, అందుకు ఆ దివ్య దంపతుల ఆశీర్వాదములే కారణం. మాష్టారు అంటే అసలు తెలీయని గ్రామీణులు ఒకప్రక్క, సాయిస్వరూలైన మాష్టారిగారితో అత్యంత సన్నిహితులైన ఉన్నతోద్యోగులు, సహోద్యోగులు, విద్యావంతులు మరొక ప్రక్క, రెండిటిని సమన్వయంచేస్తూ విశాఖపట్నంకు ఒక మూలనఉన్న ఉక్కునగరంలో మొదటి సమ్మేళనం నిర్వహించబడటం మా జీవితంలో ఒక మరుపురాని మధురమైన ఆధ్యాత్మిక ఘటన. ఆ కార్యక్రమానికి శ్రీ కె.వి. రంగారావు, శ్రీరాణిగోపాలకృష్ణ, తగురీతిన సలహాలు, సూచనలు అందజేయగా, శ్రీ సోమిన శివప్రసాద్, శ్రీ వాసుదేవరావుగారు మొదలైనవారు తగు రీతిన సహకారమందివ్వగా, ట్రస్టు సభ్యులతోపాటు, అనుబంధ సంస్థల సభ్యులు సైనికులై నిలిచారు, మాష్టారిగారి సన్నిహితులు, దివ్యజ్యోతులు కాగా ఆ కాంతులలో శ్రీసాయి అంటే అంతగా తెలీయని ఆ ప్రాంతములో, శ్రీసాయి మాస్టారుల దివ్య అనుగ్రహ వీచికలు ఎల్లడలా వ్యాపించగా, వేలాదిగా విచ్చేసిన గ్రామీణులు, పట్టణ ప్రజలు దానిలో ఓలలాడేరు. అందరి సహకారముతో మొట్టమొదటి అఖిలాంధ్రసాయిమాస్టర్‌భక్త సమ్మేళన ఉద్దేశ్య సంకల్పాలు సంపూర్ణముగా నెరవేరినయ్యి. ట్రస్టు ఛైర్మన్‌గా నేను పూనుకోవటం నిమిత్తమాత్రమే, దానికి అండ దండ అంతా శ్రీ భరద్వాజ మాస్టారుగారు వారి స్వరూపమైన అందరి చేత దివ్యజననిగా పూజించబడుతున్న మాస్టరుగారి అర్ధాంగి, శ్రీమతి అలివేలుమంగమ్మగారి అనుమతి పూర్వకఅనుగ్రహ ఆశీర్వాదములే కారణం. సద్గురువు తన ఆశీర్వాదంచేత మూగవానినే మాట్లాడించగలరు, కళ్ళు లేనివారికి చూపునిప్పించ గలరు, కాళ్ళు లేనివాడిని పర్వతాలెక్కించగలరు, మూర్ఖునిచే వేదాలు వల్లింపచేయగలరు" అసాధ్యాలు సుసాధ్యం చేసే వారి అనుగ్రహం అమోఘం. నిరాటంకముగా గత 21 సంవత్సరాలుగా శ్రీ భరద్వాజ పతాకం రెపరెపలాడుతూ రాష్ట్రం, రాష్ట్రేతర ప్రాంతాలలో, లక్షలాదిమంది నిర్దుష్టమైన శ్రీసాయిమార్గంలోకి రావటానికి కారణమవ్వటమే కాకుండా, సమ్మేళనానికి విచ్చేసిన ప్రతి ఒక్కరు అనిర్వచనీయమైన ఆత్మీయ, ఆధ్యాత్మిక అనుభూతులు అనుభవాలు పొందేరు, పొందుతున్నారు. అవి చెప్పటములో ఏమాత్రం అతిశయోక్తి లేదు. అలనాడు సమ్మేళన ప్రారంభానికి, అనుగ్రహ ఆశీస్సులు అడిగినప్పుడు చిరుమందహాసంతో, తన కృపామృతాన్ని మాపై వెదజల్లిన దివ్య జనని స్వరూపం నేటికీ నా కనులముందు కదలాడుతూనే ఉంది. అప్పటి ఆ అనుభూతిని వివరించి, మీతో పంచుకోవాలనేదే నా ఆకాంక్ష, అలనాటి దివ్యమైన మధురానుభూతులు దృశ్యకావ్యంలా మదిలో మెదులుతుంటే కలం ముందుకు సాగటం లేదు, అయితే అటువంటి దివ్య జననిని నేడు ప్రత్యక్షముగా మనమధ్య లేరు, అయినా నేడు విశ్వచైతన్యములో మాస్టారిచెంత నిలచిన దివ్య జనని జనకులు అర్ధనారీశ్వర తత్వంతో మనందరిని ఆశీర్వదిస్తూన్నారు. చివటం అమ్మ చరిత్రలో మాష్టారుగారు చెప్పిన ఒకమాట గుర్తుకు వస్తున్నది "చివటం అమ్మ భౌతికంగా ఉన్నప్పుడు తన చేతులతో ప్రసాదాన్ని పంచేది, దేహం వీడిన అమ్మ నేడు తన ఒడిలో పోసుకుని, కావలసిన వారిని కావలసినంత తీసుకోమని చెబుతున్నారు, ఇక అందుకోవటమే మనవంతు''. ఇంత వరకు ప్రత్యక్షంగా తన అనుగ్రహ ఆశీర్వాదములు అందించిన దివ్యజనని, నేడు మాష్టారుతో కూడి విశ్వచైతన్యములో నిలచారు. ఆర్తితో పిలవటమే తరువాయి ఇరువురు మనవెంట నుండి నడిపిస్తారు.

జూన్ 3వ తేదీ గురువారము తన భౌతికదేహం వీడి విశ్వచైతన్యంలో నిలచిన దివ్యజనని, అలివేలు మంగ భరద్వాజగారి పాదపద్మములకు ఈ చిరు (వ్యాస) పుష్పాన్ని సమర్పించుకుంటూ, మరుపురాని ఘటనలు మధురస్మృతులై నిలవటమే కాకుండా, మాష్టారిగారి అనుగ్రహానికి ప్రతీకలై నిలచి, వారి అనుగ్రహ ఆదేశాలను పదుగురితో పంచుకునేలా చేసినయ్యి, వాటిలోని కొన్ని మధుర సంఘటనలను, అందుకు కారణమైన అమ్మగారి అనుగ్రహ ఆశీర్వాదాల ఫలాలను వారి దివ్యానుగ్రహ ఆశీస్సులతో వచ్చే సంచికలో మరికొన్ని మీతో పంచుకోవటానికి ప్రయత్నిస్తాను.

ఎక్కడో చదివిన విశ్వకవి శ్రీ రవీంద్రనాథ ఠాకూర్ "గీతాంజలి"లోని చలం స్పృశించిన కవిత ఈ క్షణం స్ఫురణకు రాగా మనస్సు మౌనంగా ఆలపిస్తూ, హృదయాన్ని స్పృశించగా దానిని ఆలకిస్తూ, ఆస్వాదిస్తూ ఉండిపోతూ

"నీవు నన్ను అంతగా సృష్టించావు, అది నీ విలాసం.  
తాకితే చాలు, పగిలిపోయే యీ పాత్రికను నీవు  
మాటి మాటికీ ఖాళీ చేసి, మళ్ళీ కొత్త జీవితంతో నింపుతూ ఉంటావు.  
ఈ చిన్న వేణువును ఊదుతూ కొండలూ, కోనలూ తిరుగుతావు,  
నిత్య నూతనమైన మధుర గీతాలు ఆలపిస్తావు.  
నీ మృదుల కరాల అమృత స్పర్శ సోకితే చాలు,  
నా చిన్నారి గుండెలో ఆనందం పరుగులు తీస్తుంది,  
ఏవేవో మాటలు నాలో పెల్లుబుకుతాయి.  
నీవు ఇచ్చే మహా ప్రసాదాన్ని స్వీకరించాలంటే  
చూడు–నా చేతులెంత చిన్నవో,  
ఈ చిన్న చేతులతో ఆ మహాప్రసాదాన్ని స్వీకరించగలనా? ప్రభూ"

**మీ... వి.వి.పూర్ణచంద్రరావు**

# ఆధ్యాత్మిక - సామాజిక సేవలో శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు - విశాఖపట్నం

## (2021 ఏప్రిల్, మే, జూన్ నెలలో నిర్వహించిన కార్యక్రమాలు)

శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా 2021 ఏప్రిల్, మే, జూన్ నెలలలో అనేక ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు నిర్వహించటమైనది.

కరోనా మహమ్మారి 2వసారి విజృంభించటముతో, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏకాంతముగా నిర్వహించటమైనది. దానిలో భాగముగా ట్రస్టు ప్రాంగణములో లోకకళ్యాణార్ధము, శ్రీదత్త సాయి భరద్వాజులకు పూజాదికములు నిర్వహించటముతోపాటు తాత్కాలిక ధుని ఏర్పాటుచేసి, నిత్యము ధుని పూజ నిర్వహించబడుతున్నది. ఆ యా పండుగ పర్వదిన, మహాత్ముల, జయంతి ఆరాధనోత్సవముల సమయాలలో లోక క్షేమార్ధము సర్వులు సుఖమయ ఆనంద ఆరోగ్య జీవితాలను గడపాలనే సంకల్పముతో ప్రత్యేక పారాయణలు నిర్వహించటమైనది.

సామాజిక కార్యక్రమాలు కూడ, వీలయినంత వరకు ఆ యా సేవలను అర్హులైన వారి ముంగిటనే అందచేసే విధముగా ఏర్పాటు చేయటమైనది. ప్రతినెల "శ్రీసాయి భరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 60 అతి నిరుపేద, దివ్యాంగుల, వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, ఆ యా ప్రాంతాలలోని ట్రస్టు ప్రతినిధుల సహకారముతో అవన్నుల ముంగిటనే అందజేయటమైనది. లాక్‌డౌన్ సందర్భముగా ఇంటివద్దనే కరోనా చికిత్స పొందుతున్న వారికి ఆహార పదార్ధములు అందజేయటములో ట్రస్టు తన వంతు సహకారమందించింది.

గత 20 సంవత్సరాలు పైబడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోని మారుమూల గ్రామములలో మరియు విశాఖపట్నంలోని అనేక గిరిజన గ్రామాలలో పర్యటించి, అక్కడి వారి అవసరాన్ని అనుసరించి అనేక సామాజిక కార్యక్రమాలు మరియు నైతిక విలువలు పెంపొందించే విధముగా ఆధ్యాత్మిక కార్యమ్రాలు నిర్వహించబడుతున్నవి. పత్యేకించి విజయనగరం జిల్లాలో అనేక మండలాలలోని మారుమూల గ్రామాలలో 10వ తరగతి పాసై, ఆర్ధిక ఇబ్బందుల వలన చదువు మానేసిన విద్యార్థినీ విద్యార్థులను ఎంపికచేసి వారికి అవసరమైన, పాఠ్య పుస్తకములు, నోట్సు పుస్తకాలు, వస్త్రాలు మరియు అవసరమైన వారికి, కళాశాల రుసుములు కూడ చెల్లిస్తూ, కొన్ని సంవత్సరాలపాటు కొన్నివందల మందిని, డిగ్రీ వరకు చదివించటమే కాకుండా దాదాపు 50 మంది విద్యార్థినులకు వారికిష్టమైన నర్సింగ్ కోర్సు చేయటానికి ఆర్ధిక సహకారము అందజేయటమైనది. తద్వారా వారు నేడు వారి కుటుంబాలకు ఆసరాగా నిలవటమే కాక, ఇతోధికంగా ఇతరులకు చేయూతనిస్తున్న వారు నేడు వందలాది మంది కలరు. ట్రస్టు ప్రధాన కేంద్రం విశాఖపట్నం అయినా, తన సేవాకార్యక్రమాలకు మాత్రం గ్రామాలనే ఎంచుకోవటం జరిగింది. కారణం, పట్టణాలలోని వారికి వెంటనే స్పందించి సహాయమందించటానికి చాలా సంస్థలు కలవు. అందుకని శ్రీసాయినాధుని కృపతో మా సత్సంగ సంస్థల సభ్యుల సహకారముతో ఆ యా ప్రాంతాలలోని వారి నిజ పరిస్థితిని ప్రత్యక్షముగా పరిశీలించి, అవసరమైన వారిని గుర్తిస్తూ, ట్రస్టు ఇతోధికంగా సహాయ సహకారమందిచట మవుతున్నది. శ్రీకాకుళంజిల్లాలోని పుణ్యక్షేత్రాలైన అరసవిల్లి, శ్రీకూర్మంలో లాక్‌డౌన్ వల్ల ఆర్థిక లేమి స్థితిని ఎదుర్కొంటున్న వైదిక వృత్తి చేసుకునే కుటుంబాలను, స్థానిక ట్రస్టు ప్రతినిధి సహకారముతో వారి పరిస్థితి గుర్తించి, తగురీతిన వారికి సహాయసహకారము లందజేయటమైనది. అదే విధముగా రోగులకు వృద్ధులకు, అతి నిరపేదలకు నిత్యాన్న దానముచేసే సమితి వారి అభ్యర్ధనమేరకు, వారు కోరిన విధముగా ప్రతి వారము వందలాది మందికి సరిపడా కూరగాయలు అందజేయటమవుతున్నది. అడిగిన ప్రతివారికి అందించకుండా, అర్హులను ప్రత్యక్షముగా పరిశీలించి, తగురీతిన వెంటనే సహకారమందిస్తున్నది ట్రస్టు. అపన్నులు, వారిని గుర్తించి తగురీతిన స్పదించే ట్రస్టు ప్రతినిధులు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలలో ఎక్కువగా ఉన్నందున, ట్రస్టు సేవాకార్యములు ఆ జిల్లాలలో ఎక్కువగా జరగడానికి గల ఒక కారణం.

నేరుగా ట్రస్టునే సహాయమర్ధించిన, ఏప్రాంతము వారినయినా వారి పరిస్థితి గమనించి, తగురీతిన ట్రస్టు వారి అవసరాన్ని అనుసరించి తగిన సహకారము అందజేస్తున్నది. సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలతో ఏప్రిల్, మే జూన్ నెలలలో జరిగిన ఆధ్యాత్మిక సామాజిక సేవా కార్యక్రమాల సంక్షిప్త వివరాలు.

ఏప్రిల్ 1 మరియు 2వ తేదీలలో విజయనగరం జిల్లా గొర్ల మండలములోని శ్రీసాయి సుందర నందనం ఆశ్రమ ప్రాంగణములో గత 41 రోజులుగా జరుగుతున్న "ఓంనారాయణ ఆదినారాయణ" అఖండ నామసంకీర్తన ముగింపు కార్యక్రమము సందర్భముగా నిర్వాహకుల అభ్యర్ధన మేరకు అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి వస్త్రము,పాదుకలతోపాటు, శ్రీ దత్తావతారుల, అవధూత, మహాత్ములు పాదుకల సహిత దివ్య వస్తు, వస్త్ర సముదాయము భక్తజనులకు దర్శనార్ధము ఏర్పాటు చేయటమైనది. స్థానిక 50 గ్రామాలనుండే కాకుండా అనేక దూరప్రాంతాలనుండి వేలాదిగా భక్తులు విచ్చేసి పాదుకలను దర్శించుకున్నారు.

ఏప్రిల్ 4వ తేదీ యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారి పాదుకలు, శ్రీసద్గురు పాదుకాక్షేత్రమునకు విచ్చేయటముతో వాటి సమక్షములో లోకకళ్యాణార్ధము బాబుగారి చరిత్ర సామూహిక పారాయణ చేసి, అనంతరం భక్త సమారాధన ఏర్పాటు చేయటమైనది.

ఏప్రిల్ 12వ తేదీ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము సందర్భముగా, ట్రస్టు ప్రాంగణములో సామూహిక 'శ్రీసాయిమాస్టర్', చాలీసా పారాయణ నిర్వహించి

అన్నసమారాధన నిర్వహించి, "శ్రీసాయిభరద్వాజ ఆపన్నహస్తం" పేరిట 60 అతినిరుపేద, దివ్యాంగుల, వితంతు వృద్ధుల కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

ఏప్రిల్ 13వ తేదీ తెలుగు నూతన సంవత్సరము 'శ్రీ ప్లవ' నామసంవత్సరం ఉగాది సందర్భముగా ట్రస్టు ప్రాంగణములో ప్రత్యేక సత్సంగము, పంచాంగ శ్రవణము నిర్వహించి భక్తసమారాధన చేయటమైనది.

ఏప్రిల్ 19వ తేదీ తిథిప్రకారం పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ఆరాధనోత్సవము సందర్భముగా శ్రీకాకుళం జిల్లా అరసవిల్లిలోని అనాథ బాలల సదనానికి అవసరమైన వంటపాత్రలు అందజేయటమైనది.

శ్రీకాకుళంలోని అమ్మఫౌండేషన్ అనాథ బాలబాలికల వసతి గృహానికి నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

ఏప్రిల్ 21వ తేదీ శ్రీరామనవమి సందర్భముగా ట్రస్టుప్రాంగణములో లోకకళ్యాణార్ధము శ్రీసాయి – రాముడికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించటమైనది.

ఏప్రిల్ 30వ తేదీ మాతృశ్రీ ఆనందమాయి జయంతి సందర్భముగా శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో జరిగే అన్నదానము మరియు వృద్ధులు, నిరుపేదలకు నిత్యాన్న దానసమితి వారికి దాదాపు 400 మందికి సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

మే 14వ తేదీ అక్షయ తృతీయ సందర్భముగా శ్రీకాకుళంలోని నిత్యాన్నదాన సమితికి వారం రోజులకు సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

మే 22వ తేదీ శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ మరియు శ్రీ భరద్వాజ సద్గురువాణి సంపాదకులు శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు, శ్రీమతి వి.యస్. లక్ష్మి (పబ్లిషర్ శ్రీ భరద్వాజ సద్గురువాణి) దంపతుల 36వ వివాహమహోత్సవము సందర్భముగా రిమ్స్ ఆసుపత్రిలో జరిగే అన్నదానానికి 250 మందికి సరిపడా కూరగాయలు మరియు నిత్యాన్న దానసమితి వారికి 400 మందికి సరిపడా కూరగాయలు కరోనా కారణంగా హోమ్ క్వారంటైన్‌లో ఉన్న నిరుపేదలకు నిత్యావసర వస్తువులు కూరగాయలు ట్రస్టు ఛైర్మన్ సహకారముతో అందజేయటమైనది.

మే 23వతేదీ శ్రీ భరద్వాజ ఆపన్నహస్తం పేరిట 60 నిరుపేద, దివ్యాంగుల వితంతు కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు కరోనా కారణంగా వారి ఇంటి ముంగిటనే అందజేయటమైనది.

మే 24వ తేదీ ట్రస్టు ఛైర్మన్ తల్లిగారి పుణ్యతిథి సందర్భంగా అరసవిల్లిలోని అతి నిరుపేద 6 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు ట్రస్టు ఛైర్మన్ సహకారముతో అందజేయటమైనది.

మే 25వ తేదీ ట్రస్టు ఛైర్మన్ శ్రీ వి.వి.పూర్ణచంద్రరావు 63వ జన్మదిన సందర్భంగా శ్రీకాకుళంలోని రిమ్స్ ఆసుపత్రిలో జరిగే అన్నదానానికి 600 మందికి సరిపడా కూరగాయలు, మరియు నిత్యాన్న దానసమితికి 500 మందికి సరిపడా కూరగాయలు, కరోనా కారణంగా హోమ్ క్వారంటైన్‌లో ఉన్నవారికి ఆహారమందించే సేవాసంస్థకు నిత్యావసరవస్తువులు, కూరగాయలు ట్రస్టు ఛైర్మన్ బహుకరించటమైనది.

మే 29వ తేదీ రిమ్స్ ఆసుపత్రిలో జరిగే అన్నదానానికి 400 మందికి సరిపడా కూరగాయలు, హోమ్ క్వారంటైన్‌లో ఉన్న వారికి ఆహారము అందజేయటమైనది.

జూన్ 4వ తేదీ హనుమజ్జయంతి సందర్భముగా లోకకళ్యాణార్ధము, ట్రస్టు ప్రాంగణములో శ్రీసాయి, రామ, హనుమాన్‌కు తమలపాకులతో పూజాదికాలు నిర్వహించటమైనది.

జూన్ 17వ తేదీ అవధూత శ్రీ చివటం అమ్మ ఆరాధనోత్సవము సందర్భముగా లోకకళ్యాణార్ధము ట్రస్టు ఆవరణలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి, చరిత్ర పారాయణ చేయటమైనది.

శ్రీకాకుళంలోని 500 మందికి అన్నదాన నిమిత్తము కూరగాయలు, నిత్యాన్నదానసమితి వారికి 200 మందికి సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

జూన్ 20వ తేదీ శ్రీ సాయిభరద్వాజ ఆపన్నహస్తం పేరిట 60 మంది నిరుపేదలకు, దివ్యాంగులకు, వితంతులకు, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

జూన్ 22వ తేదీ ట్రస్టు ఛైర్మన్ తండ్రిగారి పుణ్యతిథి సందర్భముగా శ్రీకాకుళంలోని అరసవిల్లి చుట్టుపక్కల గల అతినిరుపేద బ్రాహ్మణ 10 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసరవస్తువులు, దక్షిణ, ట్రస్టు ఛైర్మన్ సహకారముతో అందజేయటమైనది.

జూన్ 24వ తేదీ యోగిరాజు శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి సందర్భముగా నిరుపేదలకు, దివ్యాంగులకు ట్రస్టు తరపున నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

శ్రీ కాకుళంలోని అమ్మఫౌండేషన్ అనాథ బాలుర వసతి గృహానికి కావలసిన కూరగాయలు, రిమ్స్ ఆసుపత్రిలోని నిరుపేదలు, రోగుల అన్నదాన నిమిత్తము అక్కడి సంస్థ వారికి 450 మందికి సరిపడా కూరగాయలు మరియు వృద్ధులు, నిరుపేదల నిత్యాన్నదానము చేసే సమితి వారికి 400 మందికి సరిపడా కూరగాయలు అందజేయటమైనది.

ఆ యా కార్యక్రమాలలో స్థానిక ట్రస్టు ప్రతినిధుల సహకారము, స్థానిక సమితుల మరియు ఆ యా సంస్థల సహకారముతో, అపన్నులకు సహాయము అందజేయటమైనది.

ధన, వస్తు, రూపేనా, శారీరక సేవ ద్వారా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతాభి వందనాలు అర్పించుకుంటూ...

గురుపూర్ణిమ శుభాకాంక్షలతో...

సమీక్ష : **శ్రీమతి వి. జ్యోతిర్మయి**, విశాఖపట్నం

# మేము సహితం

ఆధ్యాత్మిక సామాజిక సేవలో భాగముగా 2021 ఏప్రిల్, మే, జూన్ నెలలలో శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు మరియు శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్ సంయుక్తముగా అనేక ఆధ్యాత్మిక సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. కోవిడ్ మహమ్మారి రెండోవసారి మరింతగా విజృంభిస్తున్న తరుణంలో లోక క్షేమాన్ని ఆశిస్తూ, ఆధ్యాత్మికసేవలో భాగముగా శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు ఆవరణలో నిత్యము ధునిపూజ నిర్వహించటముతోపాటుగా ట్రస్టు సంబంధిత శ్రీసాయి దేవాలయములలో, ప్రతి గురువారము ప్రత్యేక ధునిపూజలు, ట్రస్టు వేద పండితులచే ఆ యా సందర్భాలను అనుసరించి అభిషేకాలు, మంత్ర పారాయణలు, ప్రత్యేక హోమాలు మరియు సద్గురు పాదుకాక్షేత్రంలో ఆ యా సందర్భాలననుసరించి ప్రత్యేక పారాయణలు, పూజాదికాలు నిర్వహించటమైనది.

సామాజిక సేవలో భాగంగా, ప్రతినెల “శ్రీ సాయి భరద్వాజ ఆపన్నహస్తం” పేరిట అతి నిరుపేదలకు, దివ్యాంగులకు, వితంతువులకు, వృద్ధులకు ప్రతి నెల అందించే నిత్యావసర వస్తువులను కరోనా మహమ్మారి కారణంగా, సమీప ప్రాంతము వారికి ట్రస్టు ఆవరణలోనూ, మిగిలిన దూరప్రాంతములలోని వారందరికీ వారి ఇంటి ముంగిటనే ప్రతి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

రోడ్డు యాక్సిడెంట్‌లో నడవలేని స్థితిలో ఉన్న ఒక వ్యక్తి కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటమైనది.

శ్రీకాకుళంలో రిమ్స్ ఆసుపత్రిలోని పేద రోగులకు, వృద్ధులకు నిత్యాన్నదానము చేసే సమితి వారికి ప్రతి వారము దాదాపు 500 మందికి సరిపడా కూరగాయలు, అవసరాన్ని బట్టి బియ్యం అందజేయటమైనది.

సమీప గ్రామాలలోని వృద్ధులకు, అతి నిరుపేదలకు నిత్యము ఆహారమందించే సేవాసమితి వారి అభ్యర్ధన మేరకు ప్రతి వారము, వారికి అవసరమైన కూరగాయలు, బియ్యం అందజేయటమైనది. కరోనావ్యాధితో హోమ్‌ఐసోలేషన్‌లో ఉన్న నిరుపేద కుటుంబాల వారికి భోజన సదుపాయము అందించటములో మనవంతు సహకారం అందించటమైనది. ప్రత్యేక సందర్భాలలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందజేయటముతోపాటు ట్రస్టు ప్రాంగణములో ఆ యా సందర్భాలననుసరించి సహాయమడిగిన వారికి వస్తు రూపేణా, సహాయ సహకారములందించటం జరిగింది. పూర్తి వివరాలకు 23వ పేజీ చూడగలరు.

మేము చేసే సామాజిక సేవాకార్యక్రమాలకు సహృదయముతో ఇతోధికముగా ధన, వస్తురూపములో సహాయసహకారము లందిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు. మనస్ఫూర్తిగా మీరందించే ప్రతి రూపాయి విలువ, పదింతలుగా అర్హులైన వారికి అందించే రీతిలో, మావంతు ప్రయత్నం నిరంతరం కొనసాగించగలమని మరొక్కసారి విన్నవించుకుంటూ సహాయ సహకారములందించిన ప్రతి ఒక్కరికీ, శ్రీదత్తసాయి భరద్వాజులు తమ కృపానుగ్రహముతో మరింతగా సేవా కార్యక్రమాలలో పాల్గొనే శక్తి ప్రసాదించాలని కోరుకుంటూ, సహాయసహకారములు అందించిన వారి వివరాలు ఈ క్రింద పొందుపరుస్తున్నాము.

## సహాయ సహకారములు అందించిన సహృదయులు

| | |
|---|---|
| శ్రీమతి ఏ. పద్మతులసి – జర్మనీ | 22,344/– |
| శ్రీమతి యమ్. సీతారత్నం జ్ఞాపకార్థం | |
| శ్రీమతి యన్. శ్యామలాదేవి, విశాఖపట్నం | 5000/– |
| శ్రీ ఓలేటి కుమార్, జంగారెడ్డిగూడెం | 4000/– |
| శ్రీ సిహెచ్. త్రినాథరావు, కూర్మన్నపాలెం, వైజాగ్ | 3000/– |
| శ్రీ కె. రమేష్‌బాబు, శ్రీనగర్, వైజాగ్ | 3000/– |
| శ్రీ వై. మురళీ, విజయనగరం | 2000/– |
| శ్రీ ఆర్. అప్పలరాజు, ఆర్.ఆర్.వి పురం, వైజాగ్ | 2000/– |
| శ్రీ జి. భిక్షపతి, హైదరాబాదు | 1252/– |
| ఒక సాయిభక్తుడు | 1116/– |
| శ్రీ డబ్ల్యు.యమ్. నాయుడు, ఇసుకతోట, విశాఖపట్నం | 1111/- |
| శ్రీమతి పి. గిరిజాకుమారి, ఇసుకతోట, వైజాగ్ | 1111/– |
| శ్రీ బి. సత్యన్నారాయణ శర్మ, ఇసుకతోట, వైజాగ్ | 1111/- |
| కుమారి కె. ప్రమీల, శ్రీకాకుళం | 1111/– |
| శ్రీ పి. వెంకటేశ్వర్లు, ఉక్కునగరం, విశాఖపట్నం | 1010/– |
| శ్రీమతి బి. సత్యవాణి సాయి, ఉక్కునగరం, వైజాగ్ | 1000/– |
| డాక్టర్ ఎ. శ్రీనాథ్, నిడమానూరు | 1000/– |
| శ్రీ సిహెచ్. నరసింహరావు, హైదరాబాదు | 1000/– |
| శ్రీ పార్థసారథి, అనకాపల్లి | 730/– |
| ఒక సాయిభక్తుడు | 500/– |
| ఒక సాయిభక్తుడు | 500/– |
| శ్రీ జె. సాయి, శ్రీకాకుళం | 217/– |
| శ్రీ యన్. సుబ్రహ్మణ్యం | 216/– |
| శ్రీ బి. కృష్ణారావు, విశాఖపట్నం | 203/– |
| శ్రీ పి.యల్. నరసింహరావు, విశాఖపట్నం | 116/– |

**మేము సహితంనకు విరాళములు పంపుటకు**
**చిరునామా మరియు బ్యాంక్ అకౌంటు**


**SRI SHIRIDI SAI SEVA TRUST®**
Online A/C No. 095510011006492
IFSC Code: UBIN0809551
Union Bank, Ukkunagaram
(Used for RTGS and NEFT Transactions)

E-mail : poorna.sai09@gmail.com
Website : www.saisadguruvani.org
Facebook : SriShiridiSaiSevaTrust

**(గతంలోని ఆంధ్రాబ్యాంక్ యూనియన్ బ్యాంక్‌లో లీనమవ్వటంతో IFSC Code లో జరిగిన మార్పును, బ్యాంక్ పేరులో గల మార్పును గమనించగలరు)**

# హజరత్ తాజుద్దీన్ బాబా

'కాంప్టీ' అనే ఊరిలో 1861వ సంవత్సరము జనవరి 27వ తేదీన 'తాజుద్దీన్' జన్మించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులు మరణించటముతో బామ్మగారి ఇంటివద్ద పెరిగేరు. తాజుద్దీన్ తన 6వ సంవత్సరములో స్కూలులో చేరేరు. ఆ సమయములో "హజరత్ అబ్దుల్లాషా" అనే ముస్లిం మహాత్ముడు తాను చప్పరించిన మిఠాయి, స్కూల్లో ఉన్న తాజుద్దీన్ నోట్లో వేసి, అక్కడి ఉపాధ్యాయుడితో "ఇతనికి మీరేమి బోధించగలరు, గత జన్మలలోనే అతను నేర్వవలసిన వన్నీ నేర్చుకున్నాడు" అని చెప్పి, తాజుద్దీన్‌తో "మితంగా తిను, మితంగా నిద్రపో, మితంగా మాట్లాడు, ఖురాన్ చదివేటప్పుడు మహాత్ములు నీతోనే, నీలోనే ఉండి చదివిస్తున్నట్లు భావించు అని చెప్పి వెళ్ళిపోయారు. ఆ సంఘటనతో తాజుద్దీన్ జీవితము అద్భుతముగా మారిపోయింది. మూడు రోజులపాటు ఏకధాటిగా కళ్ళవెంట కన్నీళ్ళు కారుతూనే ఉన్నాయి. ఆ తరువాత ఆటపాటల యందు ఆశక్తి తగ్గి, సూఫీ మహాత్ముల గ్రంధాలు చదువుతూ ఉండేవారు తాజుద్దీన్.



ఆ తరువాత తన 20వ ఏట నాగపూర్ రెజిమెంట్‌లో సైనికుడిగా చేరేడు తాజుద్దీన్. ఆ సమయములోనే తాజుద్దీన్ దేశ, విదేశాల నాలుగు మూలలా పర్యటించారు. సైన్యములో పనిచేసేటప్పుడు కూడా తాజుద్దీన్ ఏనాడు నమాజ్ చేయడం మానలేదు. ఆ సమయములోనే 'సవగర్' ఊరిలో హజరత్ దావూద్ చిష్టీ అనే ముస్లిం మహాత్ముడితో పరిచయమయ్యింది. ఉద్యోగ సమయము మినహా, మిగిలిన సమయమంతా, రాత్రిళ్ళు కూడా ఆ మహాత్ముని సన్నిధిలో ధ్యానంచేస్తూ గడిపేవారు తాజుద్దీన్. ఆ సమయములోనే తాజుద్దీన్‌లో గొప్ప ఆధ్యాత్మిక శక్తులు మేల్కొన్నాయి. దావూద్ చిష్టీగారు మరణించాక కూడ వారి సమాధి వద్ద కూర్చొని తాజుద్దీన్ తన ఆధ్యాత్మిక సాధనలు కొనసాగించారు. ఆ సమయములోనే తాజుద్దీన్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. అట్లా ప్రాపంచిక విషయాల పట్ల నిర్లిప్తత కలిగి, తీవ్ర ధ్యానస్థితిలో ఉన్న తాజుద్దీన్‌ను చూసి పిచ్చి పట్టిందేమోనని భావించిన అతని బామ్మగారు తాజుద్దీన్‌కి వైద్యుల చేత, మంత్రగాళ్ళు, ఇంద్రజాలికుల చేత వైద్యం చేయించారు. ఫలితం లేకపోగా, దాదాపు ఆ స్థితిలో 4 సంవత్సరాలు పాటు తాజుద్దీన్ ఎండ వానను లెక్కచేయకుండానే దిగంబరముగా కాంప్టీ వీధులలో తిరిగేవారు తాజుద్దీన్. ఏమీ తినేవారు కాదు, త్రాగేవారు కాదు. ఎవరైనా ఏదైనా పెడితే, దానిని రోడ్డుమీద పోయే కుక్కలకు పెట్టేసేవారు. ఆ సమయములో తాజుద్దీన్ నుండి అద్భుతమైన మహిమలు ప్రకటమవ్వసాగేయి. వాటి గురించి ప్రజలంతా కథలు కథలుగా చెప్పుకునేవారు. అప్పటి నుంచి తాజుద్దీన్‌ను "తాజుద్దీన్ బాబా"గా గౌరవించ సాగేరు.

తాజుద్దీన్ బాబా భూత భవిష్యత్తులను తెలియచేయుటమే కాక మృత్యుముఖములో ఉన్నవారిని కూడ క్షణకాలములో రక్షించటము, పిచ్చివారిని బాగు చేయటం, వైద్యుల వల్ల అలవికాని అనేక రోగాలను తగ్గించటము చేసేవారు. బాబా భక్తులలో హిందూ, ముస్లిం బేధమే లేదు. ఎవరు ఏరకముగా పూజించినా ఆయన సమ్మతించేవారు. బాబా భక్తులలో ఆంగ్లేయ అధికారులు కూడ ఉండేవారు. బాబా చాలా కాలము మహారాజ్ రాఘోజీరావు రాజభవనములో, ఆయన ప్రార్ధన మీదట ఉండేవారు. ఆ తరువాత నాగపూర్‌కు 16 మైళ్ళ దూరములో ఉన్న 'వాకీ' గ్రామములోకి వెళ్ళి అక్కడ ఉన్న మామిడి చెట్టు దగ్గర ఎక్కువగా బాబా కూర్చునేవారు. దానికి "ఆసుపత్రి" అని పేరు పెట్టేరు బాబా. ఎటువంటి రోగాలు గల వారైన ఆ చెట్టుకు ప్రదక్షిణం చేస్తే తగ్గేవి. ఈ నాటికి 'వాకీ'లో ఆ చెట్టును దర్శించి పునీతులవుతున్న వారు ఎంతమందో కలరు. అక్కడ ఒక ప్రదేశాన్ని చూపి బాబా 'మసీదు' అనేవారు. అక్కడ కూర్చొని ప్రార్ధన చేసి పాపపరిహారం చేసుకోమని చెప్పేవారు బాబా. ఈనాడు ఆ ప్రదేశములో అద్భుతమైన మసీదు నిర్మాణమయి ఉంది. అక్కడ కూర్చొని ప్రార్ధన చేసిన వారిలో శ్రీ ఉపాసనీ మహరాజ్, శ్రీ అవతార మెహర్‌బాబా కూడ ఉన్నారు.

తాజుద్దీన్ బాబా నుంచి అద్భుతమైన మహిమలు వెలువడటంతో 1920వ సంవత్సరానికల్లా లక్షలాది మంది బాబాను ఆశ్రయించ సాగేరు. మహారాజ్ రాఘోజీరావ్ భవనంలో తాజుద్దీన్ బాబా ఉండగా 1925వ సంవత్సరము ఆగష్టు నెల 17వ తేదీన ఎన్నో పక్షులు గుంపులుగా వచ్చి, మహారాజ్ భవనం మీద చేరి, నిశ్శబ్దముగా కదలక, మెదలక కూర్చున్నాయి. బాబా వాటిని చూసి తన చేతిని పైకెత్తి వాటిని ఆశీర్వదించి, తాను ప్రశాంతముగా పడుకొని తుది శ్వాస విడిచారు. వారిని దర్శించుకోవటానికి హిందూ, ముస్లింలు లక్షలాదిమంది నాగపూర్‌లో ఆ మహారాజ్ భవనానికి చేరేరు. ఆ సమయములో స్థానిక పాండురంగ మందిరములోని 'విఠల్, రుక్మిణీ' విగ్రహాలు 12 గంటలు పాటు ఏకధాటిగా కన్నీరు కార్చినయ్యి. ఆశ్చర్యకరమైన ఆ దృశ్యాన్ని వేలాదిమంది తిలకించటమే కాక ప్రముఖ దినపత్రికలో కూడ ప్రచురింపబడింది. అత్యంత వైభోపేతముగా ఊరేగించిన బాబా భౌతిక శరీరాన్ని, నాగపూర్ ఊరి చివర ఒకనాడు బాబా చూపించిన ప్రదేశములో 1925 ఆగష్టు 18వ తేదీ గురువారము నాడు సమాధి చేసి, అద్భుత మందిరము నిర్మించినారు. ప్రస్తుతము అది నాగపూర్‌లో "తాజ్‌బాగ్" ప్రదేశముగా పిలువబడుతున్నది. అద్భుతమైన మందిర బాహ్య సౌందర్యమే కాక, అంతర గృహములోని బాబా సమాధి సన్నిధిలో అనుభవించే ప్రశాంతత (మనో నిశ్చలత) వర్ణించనలవి కానిది. ఈనాటికి లక్షలాది మంది హిందూ, ముస్లిం బేధము లేకుండా బాబా సమాధి దర్శించి పునీతులవుతున్నారు. (ఆగష్టు 17వ తేదీ తాజుద్దీన్ బాబా ఆరాధనోత్సవము సందర్భముగా ప్రత్యేక వ్యాసము)

సేకరణ : **"పూర్ణానంద్"**

# శ్రీ గురుసిద్ధారూఢస్వామి

కన్నడదేశంలోని ప్రఖ్యాత మహాత్ములైన శ్రీ గురు సిద్ధారూఢస్వామి ఆధ్యాత్మిక చక్రవర్తియైన శ్రీ శిరిడీసాయినాధులకు సమకాలీనులు. ఒకసారి సాయి సన్నిధికి ఒక వ్యక్తి రాగానే బాబా "వీరు ఒక పెద్ద మహాత్ముని కొలువుకు చెందినవారు" అన్నారు. అతడు గురుసిద్ధారూఢస్వామి శిష్యుడవడమే విశేషం.

కన్నడ దేశంలోని బీదరికోట అనే గ్రామములో గొప్ప శివభక్తులైన గురు శాంతప్ప, దేవ మల్లమ్మ అనే పుణ్య దంపతులకు తానే పుత్రునిగా జన్మిస్తానని ఈశ్వరుడు వారికి వరం ప్రసాదించాడు. నిత్యం ధ్యానము, పూజ, పంచాక్షరీ మంత్ర జపములతో గడిపే గురు శాంతప్ప, దేవ మల్లమ్మకు శక సం॥1758 దుర్ముఖి నామ సంవత్సర శ్రీరామనవమి, గోధూళి సమయమున కర్కాటక లగ్నంలో జన్మించిన మగ శిశువునకు సిద్ధుడని నామకరణం చేశారు. బాల్యంలోనే అనేక లీలలు ప్రదర్శించి, తత్వ జ్ఞానమును ప్రజలకు బోధించిరి. కులగురువులైన వీరభద్రస్వామి వారి ఆదేశాన్ని అనుసరించి, శివుని స్మరించి, తల్లిదండ్రులను ఒప్పించి పరిపూర్ణత్వం పొందడానికి సమర్థుడైన సద్గురువును ఆశ్రయించడానికి సిద్ధుడు బయలుదేరెను. సురపురమనే ఊరిలో వారి గురువుగారైన "గజదండ మహారాజ్"ని కలుసుకున్నారు. ఉచ్ఛ నీచ భావం లేకుండా ఆనందంగా పన్నెండు సంవత్సరాలు రాత్రి పగలు గురుసేవలో నిమగ్నమైపోయారు. సిద్ధుని సేవానిరతికి మెచ్చి గురువుగారు ఆయనకు శాస్త్రాధ్యయనం చేయించిరి. అవధూతాశ్రమానిచ్చి "సిద్ధారూఢ భారతి" అనే నామాన్ని ప్రసాదించి, పుణ్యక్షేత్రాలలో సంచరిస్తూ ప్రజలలో భక్తిభావం కలిగిస్తూ, అధికారులైన వారికి తత్వబోధ గావిస్తూ లోకాన్ని ఉద్ధరించి, ప్రారబ్ధరూపమైన సుఖ దుఃఖాలను సమభావంతో స్వీకరిస్తూ పరమయోగివై జీవించమని ఆశీర్వదించారు.



గురువుగారి ఆజ్ఞను శిరసావహిస్తూ అక్కడినుండి దేశసంచారానికి బయలుదేరారు సిద్ధారూఢస్వామిగారు. ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శిస్తూ, ఋషిపుంగవుల దగ్గరికి వెళ్ళి వారిని దర్శించి, జిజ్ఞాసువులు కన్పిస్తే చర్చలు జరుపుతుండేవారు.

సుమారు 1876-77 ప్రాంతంలో సిద్ధులు తమ దేశపర్యటన ముగించి హుబ్లీలో స్థిరపడ్డారు. 52 ఏళ్ళపాటు సిద్ధుల పాదస్పర్శను పొంది హుబ్లీ పుణ్యక్షేత్రమయింది. గురుస్వరూపులైన మడివాళస్వామి వారు హుబ్లీలో రానున్న ఆపదలను సూచించి, వారించినా వినక సిద్ధులు హుబ్లీలోనే స్థిరనివాసం చేసారు. వారు ఎక్కువగా మౌనంగా ఉంటూ, గోపాలకులతో కలిసి ఆడుతూ, నగరంలో తిరుగుతూ, కనిపించిన ఇంటిముందు చేతులు జోడించి మాట్లాడకుండా నిలబడేవారు. ఎవరు ఏమి పెట్టినా దాన్ని అక్కడే తినేవారు. కొందరు వారిని పిచ్చివాడనీ, మూర్ఖుడనీ, మూగవాడనీ తిట్టినా పలికేవారు కాదు. జడిమఠ మఠస్వామివారైన శ్రీ సిద్ధవీరయ్య సిద్ధుల నిజస్థితిని తెలుసుకొని వారిని దర్శించి, పూజించారు. అప్పుడు ఒక పడగ విప్పిన నాగుపాము సిద్ధుల తల మీద ఆడుతూ వారికి కనిపించింది. ఇలా గోపాలురతో ఆడుతూ, జనులకు లీలలు చూపుతూ, అడవిలోని పండ్లతో ఆకలి తీర్చుకుంటూ, రోజులు గడపసాగేరు. ఎవరు ఏమి అన్నా, కొన్ని సందర్భాలలో వారిని కొట్టినా అది "జ్ఞానికి కర్మపాశము ఏదో ఒక నెపముతో తీరిపోవలసినది వున్నది, కృష్ణుడు తాను ఏ తప్పు చేయకనే అపవాదులకు గురి కావలసివచ్చింది. అట్లాగే నాకున్నూ" అని తమ భక్తులకు చెప్పేవారు.

శ్రీ సిద్ధులవారికి అక్కడ ఒక ఆశ్రమము నిర్మించారు. వారు ఆశ్రమములో ఉంటూ భక్తుల కష్టాలను తొలగిస్తూ వారికి శాంతిని ప్రసాదించేవారు. భక్తుల అర్హతను పరీక్షించి, వారిని తగిన సేవలో నియమించేవారు. ఆకలితో అలమటించే దరిద్ర ప్రజలకు స్వయంగా ఆయనే నిలబడి అన్నదానం చేయించారు. వారి కీర్తి చుట్టుప్రక్కల చాలాదూరం వరకు వ్యాపించింది. తమను చంప వచ్చిన వారిని కూడ క్షమించి రక్షించి కాపాడారు. మహాయోగీశ్వరుల చేతనే పరమశివుని అవతారంగా కొనియాడబడిన సిద్ధారూఢుల కీర్తి దశదిశలా వ్యాపించి ఎందరో ముముక్షువులు వారి చెంతకు వచ్చి చేరారు. స్వాతంత్రయోధులైన శ్రీ బాలగంగాధర్ తిలక్, శ్రీ గాంధీజీగారు హుబ్లీ వచ్చినపుడు వారి సభలకు సిద్ధులే అధ్యక్షత వహించారు. చనిపోయిన వారిని బ్రతికించారు. తమకూ, తమ చిత్రపటానికి భేదంలేదని నిరూపించారు. వారు శాస్త్ర ప్రవచనం చేస్తుంటే అనేక పశుపక్ష్యాదులు కూడ అక్కడికి చేరి శ్రద్ధగా వినేవి.


ఆస్తి పెరిగే సరికి మఠ సంబంధమైన వైషమ్యాలు తలెత్తి కలహాలు ప్రారంభమైనాయి. కొందరు సిద్ధులను హతమార్చాలని వారికి విష ప్రయోగం చేసారు. రోజూ విషం తాగిస్తున్నా సిద్ధులు ''శివార్పితం'' అని అంటూ తాగేవారు. వారి ఆరోగ్యం క్షీణించసాగింది. 21-8-1920 గురప్పను పిలిపించి తన కార్యం పరిసమాప్తం అయిందని, ఇక మీదట అంతా గురప్పే చేయాలని, ఒక క్షణం తీక్షణంగా యోగదృష్టితో చూశారు సిద్ధులు. గురప్ప దేహమనే ఇంటిలో జ్ఞానమనే నందదీపాన్ని వెలిగించారు.

సిద్ధుల నిర్యాణ వార్త క్షణంలో ఊరంతా వ్యాపించింది. వారి దేహాన్ని అలంకరించి, ఏంతో ఘనంగా ఊరేగించి 1906లో నిర్మించబడిన సమాధి మందిరంలో వారి దేహాన్ని సమాధి చేసారు. హుబ్లీలోని వారి సమాధినుంచి నేటికీ పిలిచిన వారికి పలుకుతూనే వున్నారు సిద్ధులు. (ఆగష్టు 21వ తేదీ శ్రీ గురు సిద్ధారూఢస్వామి ఆరాధనోత్సవ సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

రచన, సేకరణ : **శ్రీ వై. సాయి శిరీష,** బెంగళూరు

# భగవంతుడిని మనమేమి కోరాలి?

శ్రీ గులాబ్ బాబా, భక్తులనుద్దేశించి "భగవంతుడిని మనమేమి కోరాలి?" అనే ప్రశ్న వేశారు. భక్తుల మౌనమే జవాబయ్యింది. తిరిగి బాబానే చెప్పటం ప్రారంభించారు "నా దగ్గరకు వచ్చేవారంతా అనేక కోరికలతో వస్తుంటారు. బాబా! నా కుమార్తెకు వివాహము కాలేదని, నా కుమారునికి జబ్బు చేసిందని, నా భార్యకు కేన్సర్ వ్యాధి వచ్చిందని, నా కుమారుడు పిచ్చివాడయ్యాడు, నాకు సంతానం లేదు, నాకు ఇల్లు లేదు, నాకు కారు కావాలి, నాకు లాటరీలో ప్రథమ బహుమతి రావాలి ఈ విధంగా నన్ను కోరుతూనే ఉంటారు. నేను వారి కోరికలు సఫలం చేసినా ఒక్క అడుగు ముందుకువేసే వారుకాని, ధార్మికంగా జీవించేందుకు ప్రయత్నంచేసే వారుకాని నాకు ఒక్కరూ కనబడటం లేదు. మనం భగవంతుని ఆశీస్సులు మాత్రమే కోరాలి. అంతేకాదు ఈ జన్మలోను మరి రాబోవు జన్మలలో కూడ భగవానుని సేవా భాగ్యమే కోరాలి. అటువంటి స్థితి మనం పొందగలిగినపుడే, మన కోరికలు తప్పక భగవంతుడు నెరవేర్చుతుంటారు".



శ్రీ గులాబ్ బాబాజీ ఇలా చెబుతారు "గజేంద్రుడు భక్తి శ్రద్ధలతో పుష్పమొకదాన్ని సమర్పింపగా స్మృతిమాత్ర ప్రసన్నుడైన భగవానుడు సంతోషించి, ఆపదసమయంలో గజేంద్రుని రక్షించాడు. శబరి ప్రేమతో ఎంగిలి చేసిన పండ్లు తిన్న శ్రీరామునికి కడుపునిండింది. సుధాముడు ప్రేమతో పెట్టిన అటుకులు తిని సంతృప్తి చెందిన శ్రీ కృష్ణభగవానుడు అతనికి అష్టైశ్వర్యాలు ప్రసాదించాడు. అలానే విదురుడు ఇచ్చిన బియ్యపు గింజలు తిని కడుపునిండిందని తృప్తి చెందాడు శ్రీ కృష్ణుడు.

భగవంతుడు మననుండి భక్తి శ్రద్ధలు, ప్రేమ ఆశిస్తాడుగాని, మనమిచ్చే ద్రవ్యముపై ఆయనకు ఆపేక్షలేదు. ప్రతిఒక్కరు ప్రతిఫలమాశించక హృదయపూర్వకంగా భగవంతుని సేవకు అంకితమైనచో అట్టివారు తప్పక కృతార్థులవుతారు. మూగజీవులైన పశుపక్ష్యాదులు, జీవించియున్నప్పుడు, మరణించినపుడు కూడా మానవజాతి మనుగడకు ఎంతో సహకరిస్తున్నాయి. ఆవులు, గేదేలు పచ్చిగడ్డి మేసి అమృతములాంటి పాలను, తద్వారా పెరుగు, వెన్న, నెయ్యి వంటి పాల ఉత్పత్తులను అందించి మానవుల ఓజస్సుకు, మేధస్సుకు, బలానికి దోహదపడుతాయి. తాము విసర్జించిన పేడద్వారా పంటపొలాలను సస్యశ్యామలం చేస్తున్నాయి. దాంతోపాటు వ్యవసాయోత్పత్తులు అధికం కావడానికి ఇతోధికముగా తోడ్పడుతున్నాయి. చివరికు వాటి పేడను ఇండ్లను అలకడానికి, కళ్ళాపుచల్లుకొనేందుకు ఉపయోగిస్తున్నాము. అవి మరణించి కూడా తమ మాంసాన్ని ఆహారంగా మనకు అందిస్తున్నాయి. వాటి చర్మముతో చెప్పులు, తదితర వస్తువులు తయారు చేయబడుతున్నాయి. జడ పదార్థాలైన జీపులు, లారీలు కార్లు సంఘసేవకు తోడ్పడుతున్నాయి. అవి శిథిలమైనా వాటి విడిభాగాలు అమ్ముకోవడానికి వీలపడుతుంది. అడవుల్లోని వృక్షాలు వర్షాలు పడడానికి, భూమిని చల్లబరచడానికి, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు దోహదం చేస్తున్నాయి. వంటచెరకు, గృహోపకరణాలు, అనేక ఓషధులు మొదలగు వాటిని కూడా మనకు అందిస్తున్నాయి. పంచమహాభూతాలకు యజమానియైన ఆ పరమాత్మ ఆజ్ఞమేరకు అవి మనకు చేస్తున్న సేవ నిరుపమానమైంది. మనకొరకు భగవంతుడు సృష్టించిన వాటి ద్వారా పొందుచున్న లాభాలు అపరిమితం. భగవంతునిచే సృష్టించబడిన యావత్ ప్రకృతి మనకెంతో సహకారమందిస్తున్నా మనము దీన్ని గమనించే స్థితిలో లేము. మనము ఎవరికైనా సహకారం చేస్తున్నామా? ఇతరులనుండి సహాయం పొందటమేనా మన పని? సాటి మానవుల క్షేమం కోసం చేసిన సత్కర్మలను గూర్చి జీవించియున్నపుడు, మరణించిన తర్వాత కూడా అంతా చెప్పుకుంటారు. పశుపక్ష్యాదులైన సాటి జీవులు ఉపయోగపడినట్లు మనం ఉపయోగపడలేకపోతున్నాము. కనుక మనము జీవించి ఉండగానే ఇతరులకు ఉపయోగపడాలి.

లోకంలో సహజంగా ఎవరికైనా పదవుల్లో ఉన్నపుడిచ్చే గౌరవమర్యాదలు ఆ తర్వాత ఇవ్వరు కదా! అంతేకాదు, విలువలేదని తలుస్తున్న జంతువుల యొక్క మృత శరీరాలకు విలువ కట్టవచ్చు. కాని మానవుల మృతదేహాలకు గడ్డిపోచకున్నంత విలువ కూడా లేదు. అందుకే ప్రతి మానవుడు తన జీవితకాలంలో సాటి జీవుల శ్రేయస్సుకు కృషి చేస్తే లోక కళ్యాణం చేకూరుతుంది. వారి కీర్తి ప్రతిష్టలు చిరకాలం నిలుస్తాయి.


పిల్లలు రోజంతా ఆడుకుంటారు. తల్లిదండ్రులు సాయంత్రం వేళకాగానే బిడ్డలను పిలుచుకుంటారు. అట్లే భగవంతుడు మనలను ఆడుకునేందుకు ఈ జీవిత రంగంలోనికి పంపుతుంటారు. మన జీవితకాలం పూర్తికాగానే మనల్ని తన నిజవాసానికి పిలిపించు కుంటారు, ఇది మానవ జీవితం.

మనం అనేక జన్మలలో చేసిన పాపాల సంపుటి కొండలు కొండలుగా పెరిగి వున్నాయి. ఈ పాపాలే మన సుఖః దుఃఖాలకు కారణాలు. భగవన్నామాన్ని జపిస్తే మీ పాపాల కొండలు పిండికాకమానవు. అట్లే నామస్మరణతో పాపాలను దహింప చేయవచ్చు. అలా చేసిన నాడే మన హృదయాలు నిర్మలమవుతాయి. అట్టి నిర్మల మనస్సుతో నడిచేవారికి సకల శ్రేయస్సులు సమకూరుతాయి.

సౌజన్యం : **గులాబ్ బాబా లీలాతరంగణి**
రచన : **శ్రీ బి.పిచ్చయ్య మాస్టారు**, ఒంగోలు

# లోకమాన్యుడు - శ్రీ గజానన్ మహారాజ్

శ్రీ బాలగంగాధర్ తిలక్ మహారాష్ట్రలోని ఒక కోహినూరు వజ్రం లాంటివారు. దూరదృష్టి సాగరుడూ! రాజనీతి కుశలుడూ! పరాయిపాలన తొలగించటానికీ, దేశాన్ని స్వతంత్రం చేయటానికీ తన ప్రాణాలనే పణంగా పెట్టినవాడు. ఆయన తన జీవితాన్నంతా ఏ ఆశా లేకుండా దేశంకోసం గడిపాడు. అందుకే ప్రజలు ఆయనను 'లోకమాన్యు'డని పిలిచారు. ఆయన తన జీవితాన్నే దేశ సేవకంకితం చేసి, ఆ బిరుదును సార్ధకం చేశాడు. ఒకసారి శివాజీ జయంత్యుత్సవానికి ప్రజలు ఆహ్వానిస్తే ఉపన్యాసం యివ్వటానికి అకోలా గ్రామానికి తిలక్ వచ్చారు. ఉత్సవానికి ఏర్పాట్లు బ్రహ్మాండంగా జరుగుతున్నాయి. శివాజీ జయంతి ఉత్సవానికి అధ్యక్షులుగా తిలక్‌నే నిశ్చయించారు.



ఒక ప్రక్క శివాజీ జయంతి మహారాష్ట్రలోని ముఖ్య పండుగ. మరో ప్రక్క ఉత్సవ అధ్యక్షులు లోకనేత బాలగంగాధర తిలక్ అవటంవలన బంగారానికే వన్నె తెచ్చినట్లయింది. ఉత్సవాని కేర్పాట్లు అవుతున్నాయి. ఈ శివాజీ జయంత్యుత్సవ సందర్భంలో షేగాంలోని శ్రీ గజానన మహరాజ్ స్వామిని ఆహ్వానిస్తే బాగుంటుందన్నారు. శివాజీ దేశంకోసం చేసిన పనులన్నింటికినీ స్వామి సమర్ధ రామదాసుల ఆశీర్వాదం వుండేది. అందువల్ల అతనికి జయమే కలిగింది. తిలక్‌జీ చేసే రాజనీతి కూడా శివాజీవలె దేశోద్ధరణకే కదా! కాబట్టి యిట్టి కార్యానికి కూడా శ్రీస్వామీజీ యొక్క ఆశీస్సులు లభించాలి. దీనికి కొందరు సమ్మతిస్తే కొందరు అసమ్మతి తెలిపారు. అసమ్మతి వర్గీయులు యిలా అన్నారు. "ఆ శేగాం పిచ్చివాణ్ణెందుకు యీ శుభసమయంలో పిలుస్తారు? అతను ఇలాంటి సమయంలో ఏదో ఒక విచిత్రం చేసి సభని పాడుచేస్తాడు. ఆయన సభలో దిగంబరుడుగా తిరుగుతాడు. 'గిణ గిణ గణాత్ బోతే!' అని భజన చేస్తూ లోకమాన్యుణ్ణి కూడా కొట్టవచ్చు!" అన్నారు. ఐతే కొందరు దీనికి అసమ్మతిని ప్రకటించి "శ్రీగజాననుల శ్రీ చరణాలు ఇలాంటి స్థితిలో ఇక్కడి ధూళిని తాకాలి" అన్నారు. "ఆయన పిచ్చి వాడెవరికి? సామాన్యుల దృష్టిలో ! విద్వాంసులూ, సజ్జనులూ వారిని పిచ్చివాడనుకోరు. తిలక్‌జీ నిజంగా దేశోద్ధారకులైతే తప్పకుండా శ్రీస్వామీజీ ఉత్సవ సమయంలో ఇక్కడే ఉపస్థితులౌతారు. నిజానిజాలేవో ఆ సమయంలోనే తేలిపోతాయి కదా! కాబట్టి స్వామీజీని ఆహ్వానించటానికి వెనుకా ముందూ అక్కర్లేదు" అన్నారు. ఇలా చర్చ జరిగిన తరువాత కొందరు శ్రీస్వామీజీని ఆహ్వానించటానికి షేగాం వచ్చారు. వచ్చినవారిని ఎదురుగా చూడగానే శ్రీస్వామీజీ దాదాసాహెబ్ ఖాపర్డే'తో "శివాజీ జయంతి మహోత్సవానికి తప్పక ఉపస్థితుణ్ణౌతాను, అక్కడ పిచ్చి వేషాలు వేయక మౌనంగానే కూర్చుంటాను. బాగుకోసం పాటుపడే వారి మనస్సెప్పుడూ నావల్ల చెడిపోదు! దేశానుద్ధరించటానికి బాలగంగాధరుడు సుయోగ్యుడు, అధికారి, ఆయన దేశప్రేమి, దేశభక్తుడు. వీరిని కలియటానికి అకోలా తప్పక వస్తా"నన్నారు స్వామీజీ. ఇది వినిన ఖాపర్డే ఎంతో సంబరపడ్డారు. ఆయన కోల్హాటికర్‌తో "యీ పర్హాడ ప్రాంతపు జ్ఞానవజ్రాన్ని చూశావా?" అన్నారు. "ఈయన అకోలాలో జరిగిన విషయాన్నంతటినీ ఇక్కడుండే తెలుసుకున్నారు. యోగులయొక్క అగాధజ్ఞానాన్ని చూడండి. దేశభక్తుల ఎడగల స్నేహాన్ని చూడండి. మనం మాట్లాడటానికి ముందే స్వామి వస్తానని మాటిచ్చారు. వారికేమీ చెప్పనక్కరలేకపోయింది. ఈ శుభకార్యానికి శకునం మంచిదే! పదండి. శ్రీస్వామి చరణాలకు ప్రణమిల్లి తిరిగి పోదాం!" అన్నారు ఖాపర్డే. శకసంవత్సరం పద్దెనిమిది వందల ముప్ఫై వైశాఖమాసంలో అకోలాలో బ్రహ్మాండమైన మండపంలో శివాజీ జయంత్యుత్సవం జరిగింది. పర్హాడ ప్రాంతంలో అక్షయ తృతీయ పండుగను బ్రహ్మాండంగా జరుపుతారు. అక్షయ తృతీయ రోజే ఉత్సవానికి చివరిరోజు. అందుచేత 'లోకమాన్యుణ్ణి' చూడటానికోసం ఎంతోదూరం నుంచి అనేకమంది వచ్చారు. శ్రీస్వామీజీ కూడా ఆ సందర్భంగా వస్తున్నారని జనాలకు తెలిసింది. అందుచేత సభామండపం పూర్తిగా కిక్కిరిసిపోయింది. జీవన్ముక్త సాధువు శ్రీ గజాననులు సభామండపంలో ఉన్నతాసనం మీద ఉపవిష్టుడయ్యాడు. ఆయన దగ్గర అణ్ణాసాహెబ్ పట్వర్ధన్ వున్నారు. గణేష్‌జీ ఖాపర్డే కులభూషణమైన శ్రీ కృష్ణనందనుడు తిలక్‌జీకి రెండవవైపు కూర్చున్నారు. దామరే, కోల్హాట్‌కర్ భావే, వెంకటరావు దేశాయి, ఈ సభాముఖ్యులంతా ఉచ్చాసనం మీద కూర్చున్నారు. ఇంకా ఉపన్యాసాలు చెప్పే సజ్జనులూ కూర్చున్నారు. దాన్ని వర్ణించటం ఏ ఒక్కనోటితో కాదుమరి! కోల్హాట్‌కర్‌జీ ఆ సభ యొక్క ఉద్దేశ్యాన్ని వివరించారు. తరువాత 'భాషణసింహులు' లోకమాన్యతిలక్ నిలబడ్డారు "నేటిరోజు చాలా ధన్యమైనది. ఇక్కడి వీరుడొకరు దేశ స్వాతంత్ర్యానికి తన ప్రాణాల్ని పణంగా పెట్టారు. అధనుర్ధరుడైన వీర శివాజీ యొక్క జన్మోత్సవాన్ని నేడు జరుపుకొనటానికి మనమంతా యిక్కడికి వచ్చాం. ఆ శూరవీరునికి, శివాజీకి సమర్ధ రామదాసుల కృప, ఆశీర్వాదం లభించాయి. అందుచేత ఇతని పేరు కేవలం మహారాష్ట్రలోనేకాక యావద్భారతావనిలో మారుమ్రోగింది. అలానే ఆశీర్వాదం ప్రసాదించటానికి సాధువు శ్రీగజాననులు నేడిక్కడ

ఉపస్థితులయ్యారు! ఇవి మనకెంతో అవసరం. స్వాతంత్ర్యపు సూర్యుని అస్తమయం, పరతంత్రపు ఘోర అంధకారం దేశం నలుమూలలా అలుముకుంది. స్వాతంత్ర్యహీనమైన దేశం ప్రేతంతో సమానంగా భావించబడుతుంది. కాబట్టి దేశప్రేమను వృద్ధి చేయటానికి మనమంతా ప్రజలకు శిక్షణనివ్వాలి. నేటినుంచి పిల్లలకు కూడా దేశప్రేమను బోధించటం అత్యావశ్యకం!" అన్నారు తిలక్. ఉపన్యాసం చెప్పే ఉద్వేగంలో తిలక్‌జీ ప్రస్తుతం వున్న ప్రభుత్వాన్ని చాలా చెడుగా నిందించారు. వారి ఉపన్యాస ధోరణి ఎలాంటిదో స్వామీజీ గమనించి, నవ్వుతూ– "ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుటవల్ల చేతులకు బేడీలు పడతాయి!" అని స్వామి తన ప్రియమైన భజన "గిణ గిణ గణాత్ భోతే!" అని పాడటం ప్రారంభించారు, సభ నిర్విఘ్నంగా సంపన్నమైంది.

తరువాత ప్రజలంతా తిలక్‌జీని ఎంతో ప్రశంసించారు. కాని స్వామియొక్క భవిష్యవాణి ఆ ఏడాదిలోనే రుజువయింది. ప్రభుత్వం తిలక్‌జీ పైన దావావేసి, 124 సెక్షను క్రింద బంధించారు. చేతులకు బేడీలు కూడా వేశారు. పెద్ద పెద్ద వకీళ్ళు తిలక్‌జీ పక్షాన దావా వేయటానికి ప్రయత్నాలు చేయసాగారు. దాదాసాహెబ్ ఖాపర్దే తిలక్ మిత్రుడు, సహయోగి. ఆయన అమరావతినుంచి తిలక్‌జీ తరపున న్యాయస్థానంలో వాదించటానికై బొంబాయి వెడుతున్నారు. అకోలా స్టేషన్‌లో కోల్హాట్‌కర్‌జీతో ఇలా అన్నారు. "మీరు వెంటనే శేగాం వెళ్ళి స్వామీజీని తిలక్‌జీని రక్షించమని ప్రార్థించండి" అన్నారు. "దేశం ఆపదలో వుంది. నేనే స్వయంగా షేగాం వెడదామనుకున్నాను. కానీ వెంటనే బొంబాయి వెళ్ళాల్సివుంది. అందుచేత మీరు షేగాం వెళ్ళి స్వామిని ప్రార్థించండి" అన్నారు. వెంటనే ఆ తిలక్‌జీ భక్తుడు కోల్హాట్‌కర్‌జీ బండిలో కూర్చుని షేగాం వెళ్ళి స్వామిని చేరారు. ఆ సమయంలో స్వామీజీ నిద్రిస్తున్నారు. మూడు రోజులైనా లేవలేదు. అంతవరకూ కోల్హాట్‌కర్‌జీ అక్కడే మఠంలో వుండిపోయారు. తిరిగి వెళ్ళకూడదనుకున్నారు. తిలక్‌జీ మీదున్న అచంచల భక్తి విశ్వాసాలవల్ల ఆయన స్వామి నిద్రలేచేంతవరకూ కదల్లేదక్కడినుంచి. మరాఠీభాషలో "నిప్పులేకుండా పొగ, మాయా మమతా లేకుండా కన్నీళ్ళూరావు" అని నాలుగవనాడు శ్రీస్వామి మేలుకొని, "ఈ విషయంలో మీరెంత ప్రయత్నించినా ఫలితం దక్కదు. ఛత్రపతి శివాజీకి శ్రీ సమర్థరామదాసస్వామి అండదండలున్నా బాద్‌షా అతణ్ణిఖైదు చేయలేదా? సజ్జనులు, వీరులకు కష్టాలు లేకుండా రాజ్యంలో క్రాంతి ఎలా వస్తుంది? నేనొక జొన్న రొట్టె యిస్తాను. దాన్ని నిస్సంకోచంగా తిలక్‌జీ చేత తినిపించండి. అది తిన్న తరువాత భవిష్యత్తులో ఒక గొప్ప కార్యం ఆయనచేత కావాల్సివుంది" అన్నారు స్వామీజీ. యీ పలుకులు విన్న కోల్హాట్కర్‌జీ మనస్సులో శంకించారు. రొట్టె తీసుకొని స్వామికి వందనం చేశారు. తరువాత ఆయన బొంబాయి వెళ్ళి తిలక్‌జీకి రొట్టెయిచ్చి షేగాంలో జరిగిన కథనాన్ని వినిపించారు. అదివిన్న తిలక్‌జీ అక్కడున్నవారితో నవ్వుతూ "స్వామీజీ మాటలలో ఏదో ఆంతర్యం వుంది. వారు అంతర్‌జ్ఞానులు! మన ప్రయత్నం బహుశా ఫలించకపోవచ్చు, ప్రభుత్వం తన్ను సమర్థించుకొనటానికి మంచీ చెడూ అన్నీ చేస్తుంది. స్వార్థం లేకున్నప్పుడే న్యాయం బయటకు వస్తుంది కదా! ఇదే లోకరీతి. నా చేత ఏదో ఘనకార్యం జరగబోతుంది అనే స్వామి అమృతవాక్కులలో ఏదో సంకేతం వుంది. యోగులు భూత భవిష్యద్వర్తమానాలు తెలిసినవారు కదా! చూద్దాం! భవిష్యత్తులో ఏం జరుగనున్నదో!" అన్నారు. కోల్హాట్‌కర్‌జీ యిచ్చిన ఆ రొట్టెను చక్కగా నమిలి తిన్నారు తిలక్‌జీ. వారికి పళ్ళు లేకపోయినా స్వామి ప్రసాదాన్ని అతి భక్తితో గ్రహించారు. తిలక్‌జీకి ఆరుమాసాలు జైలుశిక్ష విధించి 'మాండలే' కారాగారానికి (బర్మాదేశం) పంపారు. అక్కడే భగవద్గీతపై సమీక్షాత్మక గ్రంథం 'గీతారహస్యం' ఆయనచే వ్రాయబడింది. ఇదే మహాకార్యంగా రుజువైంది. దీనివలన తిలక్‌జీకి జగద్గురు శంకరాచార్యుల వారితో సమానమైన గౌరవం లభించింది! ఈ గీతాశాస్త్రంమీద అనేక భాష్యాలు వచ్చాయి. తిలక్‌జీ 'కర్మయోగ' మార్గమే శ్రేష్ఠమైనదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇదే వారిచేత కావించబడిన మహత్కార్యం! అది 'గీతారహస్యం' లోకంలో వున్నంతకాలము తిలక్‌జీ అమరులై వుంటారు! వారి ప్రయత్నం వలన స్వాతంత్ర్యం లభించటం సుగమమైంది. ఇది నిజమే! 'గీతారహస్యం' రచించటం వలన ఆయన అజేయుడు, అమరుడూ అయ్యారు. అంతేకాక అందులో చెప్పబడిన నిరంతర సత్యం (నిత్యసత్యం) సమాజం సరియైన మార్గంలో నడవటానికి సాయపడుతుంది! యావచ్చంద్ర దివాకరుడైన లోకమాన్య బాలగంగాధరుడు తన కీర్తిచేత నిరంతర చిరంజీవియే అయినాడు.

(ఆగష్టు 15 స్వాతంత్రదినోత్సవము మరియు సెప్టెంబరు 11 శ్రీ గజానన్ మహరాజ్ ఆరాధనోత్సవము సందర్భముగా ప్రత్యేక వ్యాసం)

సేకరణ : **"సత్యాన్వేషి"**

## జ్ఞాన వెలుగు

అంతా మన ఇంద్రియ అనుభవమే, ఇష్టా, అయిష్టాలే, అందువల్లనే ఒక్కొక్కడికి ఒక్కొక్క దానిపై విలువ ఉంటుంది. దీనిని బట్టి ప్రాపంచికమైన విషయాలకు వస్తువులకుండే విలువ సహజమైన గుణం కాదని కేవలం వాడి ఇంద్రియానుభవమేనని తెలుస్తుంది.

లౌకిక సుఖలకోసం మనిషి ఆరాటపడేది కూడా ఆధ్యాత్మికతలో పొందే ఆనందంకోసమే. కాని ఆనందం పొందే మార్గం తెలియక వేరే విధంగా పొంద యత్నిస్తాడు. అంటే సర్వజీవులు ఆనందంకోసం ప్రయత్నించేవేనన్న మాట.

లౌకిక సుఖాల్లో ఏమి సుఖం లేదని తెలియడం వల్ల భ్రాంతి పోతుంది.

**– మాస్టర్ ఇ.వి.**

# దారం తెగిపోకుండా చూసుకో!

దారం తెగిపోకుండా చూసుకుంటే మంచిది కదయ్యా, అనేవారు అవధూత శ్రీ వెంకయ్యస్వామి, వారిని ఆశ్రయించిన వారికి దారాలు ఇచ్చేవారని, అవి కట్టుకుంటే వారి జబ్బులు తగ్గిపోతాయి అని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అసలు ఈ దారం కథ ఏంటో చూద్దాం. ఒకసారి ఒక భక్తుడు వచ్చి పశువులకు బాగాలేదు అని స్వామి వారిని అడిగాడు. అప్పుడు స్వామి వారు తాను కట్టుకునే వస్త్రం నుండి ఒక పేలిక చించి ఇచ్చి, "ఇది పశువులు ఉండే దొడ్డికి కట్టి సాంబ్రాణి వేసుకో తగ్గుతుంది" అని చెప్పారు. అతను అలాగే చేసాడు తగ్గిపోయింది. ఇంకొకరు వచ్చి ఇంటి దగ్గర ఆడ మనిషికి బాగా లేదు దెయ్యం పట్టింది అని, స్వామి వారికి తన బాధ చెప్పుకున్నాడు అప్పుడు కూడా తన వస్త్రం చించి పేలిక ఇచ్చారు ఆమెకు తగ్గింది. అది ఆనోటా ఈనోటా పడి మనుషులకు బాగా లేకపోయినా చివరకు మూగ జీవాలకు బాగా లేకపోయినా స్వామి వారు ఒక సన్నగా దారం లాగా ఇచ్చి పంపేవారు. అది స్వామి వారి చేత్తో ఇచ్చిన ప్రసాదంగా భావించి మెడలో ధరించేవారు వారి సమస్యలు తీరిపోయేవి. రాను రాను ఈ సంఖ్య పెరిగింది. అప్పుడు కొంతమంది సేవకులు స్వామీ దారం అయితే అనుకూలంగా అంటుంది అని దారపు ఉండలు తెచ్చి ఇచ్చారు. ఆ విధంగా దారం ఇవ్వడం అప్పటినుండి ఆనవాయితీగా మారింది. ఇక్కడ దారం ఇచ్చారా వస్త్రం ఇచ్చారా అన్నది కాదు ముఖ్యం. అందులో ఉన్న మర్మం తెలుసుకోవాలి.



స్వామి వారి స్వహస్తాలతో తాకినది ఏదయినా పరమ పవిత్రమైనది అంతేకాకుండా అది వారి తపశక్తి కలిగి ఉంటుంది. వారి దగ్గరకు వచ్చి సమస్యను చెప్పుకోగానే అది తొలగిపోవాలని వారు సంకల్పించి ఇస్తారు. దాంతో ఎలాంటి వ్యాధులు ఉన్నా తగ్గిపోయేవి. అంటే ఇక్కడ తగ్గిస్తున్నది స్వామి సంకల్పమే కాని పదార్ధంకాదు. తరువాత ఇంకో ముఖ్య విషయం మనం గమనించాలి, స్వామి వారి గుర్తుగా మనము ధరించిన దారం వారిని నిరంతరం స్మరిస్తూ ఉండటానికి ఆధారం. దారంతో ప్రారంభం అయిన ఆ అనుబంధం జీవితాంతం పెనవేసుకుని విడదీయరాని బంధంతో ముడివేసి శాశ్వతంగా వారి చెంత, చింతనతో ఉండేలా చేస్తుంది, అందుకే స్వామి "దారం తెగి పోకుండా చూసుకుంటే వారితో మనం ఉన్నట్లే కదయ్యా" అన్నారు. కనుక ఎప్పుడూ దారం మనం ధారణ చేసి ఉండాలి. జీర్ణమయిన వెంటనే మరొకటి ధరించాలి.

స్వామివారు బ్రాహ్మణ పల్లి గ్రామాల్లో సంచరిస్తున్న సమయంలో తరచుగా చల్లా అనంతారెడ్డి వాళ్ళ ఇంటికి వెళ్లి గుండం వేసుకుని ఉండేవారు. ఈ కుటుంబం స్వామివారి యెడల భక్తి విశ్వాసంతో ఉండేవారు. స్వామి వారు అనేకమంది భక్తులకు వీరి ఇంట్లో ఉన్నప్పుడు దారం, చీటీలు అభయ ముద్రవేసి ఇవ్వడం జరిగింది. అటు పిమ్మట స్వామివారు ఎక్కడ సంచరించకుండా గొలగమూడిలోని ఉండి, దేహం త్యాగం చేసే వరకూ తన దగ్గరకు వచ్చిన వారికి దారం, అభయ ముద్ర చీటీలు ఇచ్చి పంపేవారు. అటుపిమ్మట కూడ భక్తులు గొలగమూడి వచ్చి స్వామి సన్నిధిలో నిద్రచేసి, దారం తీసుకొని వెళ్ళడం ఆనవాయితి అయింది. ఒకరోజు మనోజమ్మ అనే ఆమె స్వామివారి దగ్గర నిదురచేసి వెళ్ళింది. తనకు సంతానం కావాలని సంకల్పించుకొని వెళ్ళింది. 3 రోజుల తరువాత మనోజమ్మకు కలలో తన తమ్ముడు కనిపించి "స్వామి వారి దారం మంగళ సూత్రాలకి కట్టుకోమని ఇచ్చి, ఒక అరటిపండు స్వామివారి ప్రసాదం అది తినమని" చెప్పి ఇచ్చాడు. వెంటనే మెలుకువ వచ్చింది. తన మంచం ప్రక్కన ఉన్న బల్ల మీద దారం అరటిపండు ఉన్నాయి. అప్పుడు సమయం చూస్తే తెల్లవారు జామున 4 గంటలు అయింది. ఎంతో ఆనందంతో స్నానం చేసి తమ్ముడు రూపంలో స్వామివారు వచ్చి స్వప్నంలో చెప్పిన విధంగా చేసింది. ఒక సంవత్సరం లోపు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది.

శ్రీగురుచరిత్రలోను, శ్రీ సాయిబాబా జీవిత చరిత్రలోనూ ఇటువంటి సంఘటనలు అనేకం చూడవచ్చు. ఒక్కపూట భోజనం చేస్తేనే ప్రాణ భయంతో విలవిలలాడిపోయే వ్యక్తిచేత శ్రీగురుడు షడ్రశోపేతమయిన భోజనం చేయించి, అతని రోగం తగ్గింపచేయటము శ్రీగురుచరిత్రలోని 13వ అధ్యాయములో చూడవచ్చు. అట్లానే విరేచనములతో బాధపడే వ్యక్తిచేత వేరుశెనగపప్పు తినిపించి రోగం తగ్గించడం, కళ్ళుమంటతో బాధపడే వ్యక్తి కళ్ళలో నల్లజీడిపిక్కల రసంపోసి తగ్గించడం, పాము కాటుతో ప్రాణాపాయస్థితిలో ఉన్న శ్యామాచేత పాయసం తాగించి రక్షించటం వంటి అనేక ఉదాహరణలు శ్రీసాయిచరిత్రలో చూడవచ్చు. ఇక్కడ పనిచేసేది వారు ఉపయోగించే పదార్థము కాదు, సద్గురువు నోటిమాటే నమ్మిన భక్తుల పాలిట పరమౌషధమై రక్షించేది. అదే, అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారు చేసినది అదే. సద్గురు పట్ల కల అపారమైన విశ్వాసమనే దారం తెగిపోకుండా చూసుకున్నంతకాలం మనకు వారి రక్షణ మనవెంట ఉండి కాపాడుతుంది. (ఓం నారాయణ ఆదినారాయణ.)

(ఆగష్టు 24వ తేదీ మంగళవారము అవధూత శ్రీ వెంకయ్యస్వామి వారి ఆరాధనోత్సవము సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీ కృష్ణారెడ్డి,** నెల్లూరు

# శ్రీస్వామి కేశవయ్యా జీ

సద్గురువు లేక జ్ఞానం లభించదని శాస్త్రవచనము. అట్టి సద్గురువు శ్రీ సాయిబాబాను సేవించి తరించి తాను స్వామియై, ఎంతోమందికి భక్తి, జ్ఞాన భిక్ష పెట్టినవారు శ్రీ కేశవయ్యాజీ.

అనంతపురం జిల్లా పెన్నా నదీ తీరమున పామిడి అను గ్రామములో శ్రీ బాలయ్య, శ్రీమతి సంజీవమ్మకు రెండవ కుమారుడిగా శ్రీ కేశవయ్య 1-7-1899 లో వికారి నామ సంవత్సర జ్యేష్ఠ బహుళ నవమి, శనివారం రోజున జన్మించిరి. బాల్యములో పాఠశాలలో చేరక తల్లిదండ్రుల వద్ద రామాయణ, భాగవత కథలు వింటూ, పామిడి గ్రామములో గల 16 దేవాలయాలను దర్శించుచుండెను. అవి వీరికి భక్తి, ఆధ్యాత్మిక కేంద్రములైనవి. 14 సంవత్సరాల వయస్సులో కేశవయ్య లండన్ మిషన్ పాఠశాలలోచేరి, శ్రీ లాక్లర్ గారి దగ్గర ఆంగ్ల బోధ, మత, ధార్మిక విషయముల గురించి తెలుసుకొని, వారిదగ్గర బైబిల్ పఠించుచు యేసుక్రీస్తు సాక్షాత్కారము పొందిరి. ఒక ముస్లిమ్ మౌల్వీ దగ్గర మహ్మదీయ ప్రవక్తను గురించి, మరియు ఖురానును గురించి తెలుసుకొని మహమ్మద్ సాక్షాత్కారము పొందిరి. అలాగే హిందూమత ధర్మములను కూడా పఠించిరి. చిన్న వయస్సులోనే ధ్యాన మార్గములో ఉండే కేశవయ్య, తాను ఉద్యోగములో చేరిన తరువాత ధర్మమార్గములో నడుచుచూ, నీతి-నిజాయితీలతో 1930-1948 వరకు పాకాలా, పెనుగొండలో సబ్ రిజిస్ట్రారుగా పనిచేసిరి. నిష్కామ కర్మలాచరించుచూ వీరు భక్తి మార్గమున ప్రవేశించిరి.



దక్షిణ దేశ యాత్రలు చేయునప్పుడు, పళని శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి, రామేశ్వరము శ్రీ రామలింగేశ్వర స్వామి విగ్రహములలో దైవశక్తిని చూచి కేశవయ్యగారు పరవశించిరి. వాటినుండి వీరికి అద్భుత శక్తులు ప్రాప్తించినవి. ఎదుటి వారికి రానున్న ప్రమాదములు, విపత్తులు తెలియుటచే, కేశవయ్య వాటికి నివారణోపాయమును చెప్పుచు, వారు కష్టములపాలు కాకుండ కాపాడుచుండెడివారు. 1-7-1939వ తేదిన రాత్రి వీరికి శ్రీ సాయిబాబా ప్రత్యక్షమై అనుగ్రహించినారు. నాటినుండి వీరు సాధన చేయుచు, ఆధ్యాత్మిక సాధనలో మంచి స్థితికి వచ్చి, అనతి కాలములోనే, బాబా మార్గములో వేలాదిమంది భక్తులకు మార్గదర్శకుడై, సాయి తత్త్వప్రచార సారధియైనారు. శ్రీ సాయినాధుని యందు అచంచల విశ్వాసము ఉంచి, బాబా ఊదీని ఇచ్చి తమ వద్దకు వచ్చే రోగుల వ్యాధులను తగ్గించేవారు. చాలామంది వీరి వద్దకు వచ్చి శ్రీ సాయి బాబా పూజలు చేయించుకొనేవారు. స్వామీజీ చేయు జప మంత్రము "ఓం సాయిరాం"అను మంత్రము.

తేది 6-10-1940న వీరు శిరిడీ దర్శించిరి. ద్వారకామాయి మరియు సమాధి మందిరములోను వీరు మహానందమును పొందిరి. వీరు పూజకు ప్రాధాన్యత యిచ్చేవారు. భక్తులకు తీర్థ ప్రసాదములు స్వయముగా ఇచ్చేవారు. ఆ సమయములో స్వామీజీ మన స్మృహలో ఉండేవారు కాదు. భక్తులు, శ్రీ సాయిబాబా వీరి ద్వారా సమాధానములు యిచ్చుచున్నట్లు తలచెడివారు. కేశవయ్యాగారు తెల్లని జుబ్బా, తెల్లని ధోవతి ధరించి, పైన ఉత్తరీయము వేసుకొని చాలా నిరాడంబరముగా ఉండేవారు. తనవద్దకు వచ్చిన వారితో ఆప్యాయముగా మృదుమధురంగా మాట్లాడేవారు.

1939లో శ్రీ సాయిబాబా అనుగ్రహమునకు పాత్రులైన వీరు 1942 నుండి 1981 వరకు బాబా తత్త్వ ప్రచారమును చేసి బాబాకు అంకిత భక్తులైరి. ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు ప్రాంతములలో ఎన్నో ప్రదేశాలు తిరిగి బాబా పూజలు, భజనలు, మందిర నిర్మాణములలో పాల్గొనిరి. తాను చేసే పూజవల్లకాని, ఇచ్చే ఊదీవల్లకాని ఏ మాత్రం మేలు కలిగినా, అది అంతా శ్రీ సాయిబాబా అనుగ్రహమేనని కేశవయ్యగారు చెప్పేవారు.

1981 ఆగష్టు 9, దుర్మతి నామ సంవత్సరం, శ్రావణ శుద్ధ దశమి, సోమవారం సాయంకాలం గం॥ 6.30 ని॥లకు బాబా విభూతిని బొట్టు పెట్టుకొని, ప్రసాదంగా నోట్లో వేసుకొని "అల్లా మాలిక్ హై" అని పలుకుతూ తుది శ్వాసను విడిచి శ్రీ సాయిబాబాలో లీనమైనారు. వారి భౌతిక కాయము మద్రాసులోని షెహనాయ్‌నగర్‌లోని శ్రీ సాయిబాబా ధ్యాన మందిరములోనే సమాధి చేయబడినది.

82 సంవత్సరములు జీవించిన వీరు, 42 సంవత్సరముల కాలము శ్రీ సాయిబాబా సేవలో తరించి, సాయి తత్త్వమును ప్రచారము చేసి, సాయి ఊదీ ద్వారా ఎందరికో మేలు చేసి, నిస్వార్థ సాయి సేవకునిగా ధన్యులైనారు శ్రీ కేశవయ్యగారు.

(జూలై 1వ తేదీ స్వామి కేశవయ్య జయంతి సందర్భముగా సమర్పణ.)

సేకరణ : **శ్రీమతి సుశీల**, నెల్లూరు

# అనంత పద్మనాభస్వామి అష్టోత్తర శతనామావళి



ఓం కృష్ణాయ నమః
ఓం కమలనాథాయ నమః
ఓం వాసుదేవాయ నమః
ఓ సనాతనాయ నమః
ఓం వసుదేవాత్మజాయ నమః
ఓం పుణ్యాయ నమః
ఓం లీలామానుష విగ్రహాయ నమః
ఓం వత్స కౌస్తుభధరాయ నమః
ఓం యశోదవత్సలాయ నమః
ఓం హరియే నమః
ఓం చతుర్భుజాత్త చక్రాసిగదా నమః
ఓం శంఖాంబుజాయుధాయ నమః
ఓం దేవకీ నందనాయ నమః
ఓం శ్రీశాయ నమః
ఓం నందగోపప్రియాత్మజాయ నమః
ఓం యమునావేగ సంహారిణే నమః
ఓం బలభద్ర ప్రియానుజాయ నమః
ఓం పూతనా జీవిత హరాణాయ నమః
ఓం శకటాసుర భంజనాయ నమః
ఓం నందవ్రజజనానందినే నమః
ఓం సచ్చిదానంద విగ్రహాయ నమః
ఓం నవనీత విలిప్తాంగాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం నవనీత హరాయ నమః
ఓం ముచుకుంద ప్రసాదకాయ నమః
ఓం షోడశస్త్రీ సహస్రీశాయ నమః
ఓం త్రిభంగినే నమః
ఓం మధురాకృతయే నమః
ఓం శుకవాగమృతాబ్దీందనే నమః
ఓం గోవిందాయ నమః
ఓం యోగినాంపతయే నమః
ఓం వత్సవాటచరాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం ధేనుకాసుర భంజనాయ నమః
ఓం తృణీకృత తృణావర్తాయ నమః
ఓం యమళార్జున భంజనాయ నమః
ఓం ఉత్తలోత్తాలభేత్రే నమః
ఓం తమాలశ్యామలా కృతాయే నమః
ఓం గోపగోపీశ్వరాయ నమః
ఓం యోగినే నమః
ఓం కోటిసూర్య సమప్రభాయ నమః
ఓం ఇళాపతయే నమః
ఓం పరంజ్యోతిషే నమః
ఓం యదూద్వహాయ నమః
ఓం వనమాలినే నమః
ఓం పీతవసనే నమః
ఓం పారిజాతాపహరకాయ నమః
ఓం గోవర్ధనాచ లోద్ధర్త్రే నమః
ఓం గోపాలాయ నమః
ఓం సర్వపాలకాయ నమః
ఓం అజాయ నమః
ఓం నిరంజనాయ నమః
ఓం కామజనకాయ నమః
ఓం కంజలోచనాయ నమః
ఓం మధుఘ్నే నమః
ఓం మధురానాథాయ నమః
ఓం ద్వారకానాయకాయ నమః
ఓం బలినే నమః
ఓం బృందావనాంత సంచారిణే నమః
ఓం తులసీదామభూషనాయ నమః
ఓం శమంతకమణిహర్త్రే నమః
ఓం నరనారయణాత్మకాయ నమః
ఓం కుజ్జ కృష్ణాంబరధరాయ నమః
ఓం మాయినే నమః
ఓం పరమ పురుషాయ నమః
ఓం ముష్టికాసుర చాణూర నమః
ఓం మల్ల యుద్ధవిశారదాయ నమః
ఓం సంసారవైరిణే నమః
ఓం కంసాహరయే నమః
ఓం మురారినే నమః
ఓం నరకాంతకాయ నమః
ఓం కృష్ణావ్యసన కర్శకాయ నమః
ఓం శిశుపాల శిరచ్ఛేత్రే నమః
ఓం దుర్యోధన కులాంతకృతే నమః
ఓం విదురాక్రూరవరదాయ నమః
ఓం విశ్వరూప్రదర్శకాయ నమః
ఓం సత్యవాచే నమః
ఓం సత్య సంకల్పాయ నమః
ఓం సత్యభామారతాయ నమః
ఓం జయినే నమః
ఓం సుభద్రా పూర్వజాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం భీష్మముక్తి ప్రదాయకాయ నమః
ఓం జగద్గురువే నమః
ఓం జగన్నాథాయ నమః
ఓం వేణునాద విశారదాయ నమః
ఓం వృషభాసుర విద్వంసినే నమః
ఓం బాణాసుర కరాంతకృతే నమః
ఓం యుధిష్టిర ప్రతిష్టాత్రే నమః
ఓం బర్హిబర్హా వతంసకాయ నమః
ఓం పార్ధసారధియే నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం గీతామృత మహో ధదియే నమః
ఓం కాళీయ ఫణిమాణిక్యరం జితాయ నమః
ఓం శ్రీపదాంబుజాయ నమః
ఓం దామోదరాయ నమః
ఓం యజ్ఞ భోక్త్రే నమః
ఓం దానవేంద్ర వినాశకాయ నమః
ఓం నారాయణాయ నమః
ఓం పరబ్రహ్మణే నమః
ఓం పన్నగాశన వాహనాయ నమః
ఓం జలక్రీడా సమాసక్త గోపీ
వస్త్రాపహరకాయ నమః
ఓం పుణ్య శ్లోకాయ నమః
ఓం తీర్థకృతే నమః
ఓం వేద వేద్యాయ నమః
ఓం దయానిధయే నమః
ఓం సర్వ తీర్థాత్మకాయ నమః
ఓం సర్వగ్రహరూపిణే నమః
ఓం ఓం పరాత్పరాయ నమః
శ్రీ అనంత పద్మనాభ అష్టోత్తర
శతనామావళి సంపూర్ణం.

బాద్రపద శుద్ధ చతుర్ధశి అనగా తేది 19-09-2021 ఆదివారం అనంతపద్మనాభ చతుర్ధశి సందర్భముగా, దీనిని పఠించి సర్వులు శ్రీ అనంతుడి కృపా పాత్రులవ్వాలనే భావనతో సమర్పిస్తున్నాము.

# మన సంప్రదాయాలు - పోలాల అమావాస్య

1. పూజచేసే చోట శుభ్రంగా అలికి వరిపిండితో ముగ్గువేసి, ఒక కందమొక్కను (కొందరు 2 కందమొక్కలను తల్లి పిల్లలుగా పూజిస్తారు) వుంచి, దానికి పసుపుకొమ్ము కట్టిన రెండు తోరాలను అక్కడ వుంచి, ముందుగా వినాయకుడికి పూజను చేయాలి. గమనిక : కందమొక్క దొరకని పక్షంలో కందపిలక పెట్టి పూజ చేసుకొనవచ్చును.



2. తర్వాత మంగళగౌరీ దేవిని కానీ, సంతానలక్ష్మిని కానీ ఆ కందమొక్కలోకి ఆవాహనచేసి షోడశోపచార పూజను చేయవలెను.

3. తొమ్మిది పూర్ణంబూర్లు మరియు తొమ్మిది గారెలు, తొమ్మిది రకముల కూరగాయలతో చేసిన ముక్కల పులుసు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించాలి.

4. తదుపరి కథను చదువుకొని కథా అక్షతలు శిరస్సున ధరించాలి.

5. అనంతరం బాగా మంచి సంతానవతి అయిన పెద్ద ముత్తయిదువును పూజించి నైవేద్యం పెట్టని తొమ్మిది మూర్ణంబూర్లు, ఒక తోరాన్ని ఆమెకు వాయనంగా సమర్పించాలి.

6. తాంబూలంలో కొత్తచీర, రవికల గుడ్డపెట్టి ఆమెకు సమర్పించి దీవెనలు అందుకోవాలి.

7. ఆ తర్వాత కందమొక్కకు ఒక తోరాన్ని కట్టి మరొకటి తను మెడలో కట్టుకోవాలి.

1. ఆడపిల్ల కావాలనుకునేవాళ్ళు (ఉన్నవాళ్ళు) గారెలు సమర్పించాలి

2. మగపిల్లవాడు కావాలనుకునేవాళ్ళు బూరెలు (ఉన్నవాళ్ళు) అమ్మవారికి సమర్పించాలి.

3. పూర్ణంబూరె పూర్ణగర్భానికి చిహ్నం. అందులోని పూర్ణం, గర్భస్థ శిశువునకు చిహ్నం. స్త్రీకి మాతృత్వం కూడా అంత మధురమైనది కనుక పూర్ణంబూరెలు వాయనంగా ఇవ్వాలనే నియమాన్ని విధించారు.

4. గోదావరి జిల్లాలో కొందరు పనసఆకులతో బుట్టలు కుట్టి, ఇడ్లీపిండి అందులో నింపి ఆవిరిమీద ఉడికించి అమ్మవారికి నైవేద్యం పెడతారు. వీటినే పొట్టిక్కబుట్టలు అంటారు.

**పోలాల అమావాస్య వ్రత కథ :**

పూర్వం పిల్లలమట్టి అనే గ్రామంలో సంతానరామావధానులు అనే స్మార్తపండితుడు ఉండేవాడు. ఆయనకు ఏడుగురు మగపిల్లలు. అందరికీ పెళ్లిళ్ళయి, కోడళ్ళు కాపురానికి వచ్చారు. పెద్దకోడళ్ళు ఆరుగురికి పిల్లలు పుట్టారు గానీ, చిన్నకోడలు సుగుణకు పిల్లలు పుట్టడం వెంటనే చనిపోతూ ఉండటం జరిగేది. అలా ఆరుసార్లు జరిగింది. ఆ కారణంగా ఏ కోడలికీ ఆ ఆరు సంవత్సరాలూ "పోలాల అమావాస్య వ్రతం" చేసుకోవటం కుదరలేదు. అందుచేత సుగుణంటే వారికి చాలా కోపం. సూటిపోటి మాటలతో బాధించేవారు. ఏడవ సంవత్సరం సుగుణ మరోసారి గర్భవతి అయింది. ఈ సారి సుగుణను పిలవకుండా వ్రతం చేసుకోవాలని పెద్దకోడళ్ళు నిర్ణయించుకున్నారు. సరిగ్గా శ్రావణ అమావాస్యనాడు సుగుణకు ప్రసవమై, మృతశిశువును కంది. ఈ సంగతి తోటికోడళ్ళకు తెలిస్తే తనను వ్రతానికి పిలవరని తలచి, చనిపోయిన బిడ్డను తన గదిలో దాచి, ఎవరికీ అనుమానం రాకుండా తన కడుపు దగ్గర చిన్న గుడ్డలమూట వుంచి తన తోటికోడళ్ళతో కలిసి 'పోలాల అమావాస్య వ్రతాన్ని' ఆచరించింది. ఆ తర్వాత తన ఇంటికి వచ్చి మరణించిన తన పుత్రుని ఎత్తుకుని కన్నీటితో స్మశానానికి వచ్చి, గతంలో తన పుత్రుల సమాధుల దగ్గర కూర్చుని, కన్నీరు మున్నీరుగా విలపించసాగింది. అప్పటికి బాగా చీకటి పడింది.


ఆ సమయంలో గ్రామ సంచారానికి బయలుదేరిన పోలాలమ్మదేవి, సుగుణ దగ్గరకు వచ్చి 'ఎందుకు రోదిస్తున్నావు' అని అడిగింది. సుగుణ తన కన్నీటి కథను వివరించి చెప్పింది. పోలాలమ్మదేవి జాలిపడి, 'సుగుణా.... బాధపడకు. నీ పుత్రుల సమాధుల దగ్గరకు వెళ్లి, ఏ పేర్లయితే నీ పిల్లలకు పెట్టాలనుకున్నావో ఆ పేర్లతో పిలు' అని చెప్పి మాయమైపోయింది. సుగుణ వెంటనే ఆ సమాధుల దగ్గరకు వెళ్ళి తన పుత్రులను పేరుపేరునా పిలిచింది. వెంటనే ఆ సమాధుల నుంచి ఆమె పిల్లలు సజీవంగా లేచివచ్చి తమ తల్లిని కౌగిలించుకున్నారు. సుగుణ ఆనందంగా వారిని దగ్గరకు తీసుకుని, వారిని వెంటబెట్టుకొని ఇంటికి వచ్చి జరిగినదంతా తన తోటికోడళ్ళకు చెప్పింది. అందరూ సంతోషించారు. ఆనాటి నుండి ప్రతి శ్రావణ అమావాస్య నాడు ఈ వ్రతాన్ని ఆచరిస్తూ, పిల్లా పాపలతో ఆనందమయ జీవితాన్ని అనుభవించి తరించింది.

సెప్టెంబరు 6వ తేదీ సోమవారము పోలాల అమావాస్య సందర్భముగా సమర్పణ

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష**, గోవా

# స్ఫూర్తిప్రదాత - గిడుగు వెంకట రామమూర్తి

తెలుగులో వాడుక భాషా ఉద్యమ పితామహుడు, గిడుగు వెంకట రామమూర్తి. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజలు వాడుకభాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూలపురుషుడు. బహు భాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారికభాషను గ్రంథరచనకు స్వీకరింపజేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారికభాషలో సాగి, అందరికీ అందుబాటులోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్యసృష్టి, సృజనాత్మకశక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. గిడుగు రామ్మూర్తి జయంతి ఆగష్టు 29ని "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకుంటున్నాము.



గిడుగు వెంకట రామమూర్తి 1863 ఆగష్టు 29వ తేదీ శ్రీకాకుళానికి ఉత్తరాన ఇరవైమైళ్ళ దూరంలో ముఖలింగ క్షేత్రం దగ్గర ఉన్న పర్వతాలపేట అనే గ్రామంలో జన్మించారు. అతని తండ్రి వీర్రాజు, తల్లి వెంకమ్మ. వీర్రాజు పర్వతాలపేట ఠాణాలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తుండేవారు. 1875 దాకా ప్రాథమిక విద్య ఆ ఊళ్ళోనే సాగింది. తండ్రి విష జ్వరంతో 1875లో చనిపోయారు.

విజయనగరంలో మేనమామగారి ఇంట్లో ఉంటూ శ్రీరామమూర్తి మహారాజావారి ఇంగ్లీషు పాఠశాలలో ప్రవేశించి 1875 మొదలు 1880 వరకు విజయనగరంలో గడిపాడు. 1879లో మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడయ్యారు. ఆ రోజుల్లో గురజాడ అప్పారావు రామమూర్తికి సహాధ్యాయి. ఆ ఏడే రామమూర్తికి పెండ్లి అయింది. 1880లో ముప్ఫైరూపాయల జీతం మీద పర్లాకిమిడి రాజావారి స్కూల్లో ఫస్టుఫారం విద్యార్థులకు చరిత్ర బోధించే అధ్యాపకుడైనారు. సంసారబాధ్యత (తల్లి, ఇద్దరు చెల్లెళ్ళు) రామమూర్తి పై బడింది. ప్రైవేటుగా చదివి 1886లో ఎఫ్.ఏ, 1896లో బి.ఏ పట్టాపుచ్చుకున్నారు. ఇంగ్లీషు. సంస్కృతాలు గాక, ప్రధాన పాఠ్యాంశంగా చరిత్ర తీసుకుని ఉత్తీర్ణుడయ్యారు. రాజావారి ఉన్నత పాఠశాల కళాశాల అయింది. అప్పుడు మూర్తిగారికి కళాశాల తరగతులకు పాఠాలు చెప్పే యోగ్యత వచ్చింది.

ఆరోజుల్లోనే శ్రీరామమూర్తి దగ్గరలో ఉన్న అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని, వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగింది. తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని సవర భాష నేర్చుకున్నారు. ఈ పరిశ్రమ చాలా ఏళ్ళు జరిగింది. సవర భాషలో పుస్తకాలు వ్రాసి, సొంతడబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం వారు ఈ కృషికి మెచ్చి 1913లో "రావు బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మా విధానం నేర్చుకున్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర - ఇంగ్లీషు కోశాన్ని తయారుచేసారు.

మద్రాసు ప్రభుత్వం వారు గిడుగు ఆంగ్లంలో తయారుచేసిన సవరభాషా వ్యాకరణాన్ని 1931లోను, సవర-ఇంగ్లీషు కోశాన్ని 1938 లోను అచ్చువేశారు. 1934లో ప్రభుత్వం రామమూర్తిగారికి ''కైజర్-ఇ-హింద్' అనే స్వర్ణపతకాన్ని ఇచ్చి గౌరవించింది. హైస్కూల్లో చరిత్రపాఠం చెప్పేరోజుల్లోనే దగ్గర ఉన్న ముఖలింగ దేవాలయాల్లో ఉన్న శాసనాల లిపిని స్వతంత్రంగా నేర్చుకుని చదివారు. విషయపరిశోధన చేసి వాటి ఆధారంగా ఎన్నో చారిత్రకాంశాలు, ముఖ్యంగా గాంగవంశీయుల గురించి శ్రీరామమూర్తి ఇంగ్లీషులో ప్రామాణిక వ్యాసాలు వ్రాసి Indian Antiquary లోనూ Madras Literature and Science Society Journal లోనూ ప్రచురించాడు. 1911లో గిడుగు 30 ఏళ్ళ సర్వీసు పూర్తికాగానే అధ్యాపక పదవి నుంచి స్వచ్ఛందముగా రిటైరయ్యారు. అంతకు కొద్ది సంవత్సరాల ముందే ఆధునికాంధ్రభాషాసంస్కరణ వైపు వారి దృష్టి మళ్ళింది.

శ్రీ రామ్మూర్తిగారికి చిన్నప్పటినుంచి విద్యాసక్తి, కార్యదీక్ష, సత్యాన్వేషణం ప్రధాన లక్షణాలు. 1936లో రాజమహేంద్రవరం వచ్చి అక్కడే తన శేష జీవితాన్ని గడిపేరు. గిడుగుకు తెలుగు భాషకు మేలు జరగాలన్నదే తప్ప వ్యక్తిగతంగా తనకు పేరు రావాలన్న ఆలోచన, పట్టింపు ఉండేవి కాదు.

1907లో J.A. Yates అనే ఇంగ్లీషుదొర ఉత్తరకోస్తా జిల్లాలకు స్కూళ్ళ ఇన్స్పెక్టర్‌గా వచ్చాడు. చిన్న తరగతుల్లో తెలుగు పండితులు పాఠాలు చెప్పే పద్ధతి ఆ దొరకు అర్థం కాలేదు. ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఎందుకు తేడాలు ఉన్నాయి అన్నది అతని ముఖ్య సమస్య. విశాఖపట్నంలో A.V.N. College ప్రిన్సిపాలుగా ఉన్న పి.టి. శ్రీనివాస అయ్యంగారిని అడిగితే ఆయన గురజాడ, గిడుగులు దీనికి సమాధానం చెబుతారని అన్నాడు. ఆ విధంగా గిడుగు తన జీవిత ఉత్తరార్థంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి, తెలుగు విద్యావిధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగార, యేట్స్ - ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైనది. అప్పటికే ఇంగ్లీషులో భాషాశాస్త్ర గ్రంథాలు చదివిన గిడుగు ప్రతి యేడూ జరిగే అధ్యాపక సదస్సుల్లో జీవద్భాష ప్రాధాన్యత గురించి ఉపన్యాసాలిచ్చారు.

1906 నుండి 1940 వరకు శ్రీగిడుగు రామమ్మూర్తి కృషి అంతా తెలుగు భాషా సేవకే. యేట్స్ ప్రోత్సాహంతో శిష్టజన వ్యావహారిక తెలుగు భాషను గ్రంథరచనకు గ్రాహ్యమైందిగా చేయడానికి అత్యంత కృషి చేసి కృతకృత్యుడయ్యారు. వీరేశలింగం పంతులు ఊతం కూడా శ్రీరామ్మూర్తిగారికి లభించింది. 1919–20 ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు "తెలుగు" అనే మాసపత్రిక నడిపారు.

చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి, వజ్ఝల చినసీతారామస్వామి శాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1936లో నవ్య సాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్టవ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకుడుగా "జనవాణి" నే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు వ్రాయటం మొదలుపెట్టింది.

"గ్రాంథికభాష గ్రంథాలలో కనబడేదే కాని వినబడేది కాదు. ప్రతిమ వంటిది. ప్రసంగాలలో గ్రాంథికభాష ప్రయోగిస్తూ తిట్టుకొన్నా, సరసాలాడుకున్న ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో చూడండి. గ్రాంథికభాష యెడల నాకు ఆదరము లేకపోలేదు. ప్రాచీనకావ్యాలు చదువవద్దనీ విద్యార్థులకు నేర్పవద్దనీ నేననను. కాని ఆ భాషలో నేడు రచన సాగించడానికి పూనుకోవడం వృథా అంటున్నాను. నిర్దుష్టంగా ఎవరున్ను వ్రాయలేదు. వ్రాసినా వ్రాసే వారికి కష్టమే వినేవారికి కష్టమే. వ్రాసేవాండ్లేమి చేస్తున్నారు? భావం తమ సొంత (వాడుక) భాషలో రచించుకొని గ్రాంథికీకరణం చేస్తున్నారు. అది చదివేవాండ్లు, వినేవాండ్లు తమ సొంత వాడుకమాటలలోకి మార్చుకొని అర్థం చేసుకొంటున్నారు. ఎందుకీ వృథాప్రయాస? మన ప్రజలకు, సామాన్య జనులకు ఏభాష ద్వారా జ్ఞానం కలుగచేయవలసి ఉంటుందో, ఏభాషలో గ్రంథరచన సాగించవలసి ఉంటుందో ఆలోచించండి. మీ చేతులలో పత్రికలున్నవి. పత్రికల ద్వారా మీరు ఎంతైనా చేయగలరు"

శ్రీగిడుగు రామమ్మూర్తి 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికాసంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుదివిన్నపంలోని మాటలు అవి.

గిడుగు రామమూర్తి జనవరి 22, 1940న కన్ను మూశారు. శ్రీ గిడుగు రామమూర్తి పంతులుగారి పుట్టినరోజు అయిన ఆగష్టు 29వ తేదీని "తెలుగు భాషా దినోత్సవము"గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తండ్రికి తగ్గ తనయుడిగా వారి కుమారుడు గిడుగు సీతాపతి కీర్తి గడించాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ "కళాప్రపూర్ణ" బిరుదు పొందిన తండ్రీ కొడుకులు వీళ్ళిద్దరే!

(ఆగష్టు 29వ తేదీ శ్రీ గిడుగు వెంకట రామమూర్తి జయంతి మరియు తెలుగు (వ్యవహారిక) భాషా దినోత్సవము సందర్భముగా సమర్పణ.)

సౌజన్యం : **అంతర్జాలం** సంకలనం : **వి.వి.పూర్ణచంద్రరావు**

## ఓం శ్రీ గణేశాయనమః

గణపతి శిరస్సును, ఉపనిషత్తులలో (ముఖ్యముగా – గణేశోపనిషత్ రీత్యా) చెప్పబడిన 'తత్త్వమసి' అనే వేదాంత వాక్యంతో పోల్చి చెప్పాల్సి వుంటుంది. 'త్వం ఏవ ప్రత్యక్ష తత్త్వమసి' అంటున్నది గణేశోపనిషత్.

లంబోదరుడని పిలువబడే గణేశుడు పెద్ద బొజ్జను కలిగి ఉండడంవల్ల ఆయన కుక్షి నుంచే అన్ని బ్రహ్మాండాలు, సమస్త జీవరాశి ఉత్పన్నమయినాయని అర్థం. అంతేకాక జీవితంలోని మంచి చెడు రెండింటినీ ప్రశాంతంగా జీర్ణించుకోమని తెలియజేస్తుంది పెద్ద బొజ్జ.

ఏక దంతం, చెడుపై విజయం సాధించి మంచిని నిలుపుకోమని సూచిస్తుంది. గణపతి చేతిలోని పాశం ఈ ప్రపంచంలో ప్రతీదీ నాకు కావాలి అనే మోహన్ని, భ్రమను తొలగించడానికి ఇది సూక్ష్మార్థం. గణేశుడు అంకుశదారి. అది మార్గనిర్దేశం కోసం అని చెప్పబడింది.

గణేశుడు 'వర' ముద్ర గణేశుని దయాళువుగా నిరూపిస్తున్నది. ఆయన భక్తులకు కోరిన వరాలను ఇస్తాడు. ఇష్ట కామ్యసిద్ధిని కలిగిస్తాడు. ఆయన వరసిద్ధి వినాయకుడు.

శూర్పకర్ణుడని మనం వర్ణించే గణేశుని చెవులు ఎంతో పెద్దవి. చేటల్లా వుంటాయి. ప్రోగుచేయబడిన ధాన్యంలోంచి పనికొచ్చే భాగాన్ని వేరు పరచటానికి చేటలు ఎలా ఉపయోగిస్తున్నామో, అలాగే బ్రహ్మప్రాప్తికి వినియోగపడే పలుకులను, యోగ్యమయిన మంచి మాటల్ని మాత్రమే మన కర్ణాలు గ్రహించాలని సూచిస్తాయి గణనాధుని చెవులు.

వక్రతుండములోని అంతరార్థం, సంభ్రమాశ్చర్యాల్ని కలిగించే శక్తినీ, నేర్పరితనాన్ని, బుద్ధికుశలతనూ, వివేకాన్నీ అలవరచుకోమని సూచించడమే.

పెద్ద తల : గొప్పగా ఆలోచించమని

చిన్న కళ్ళు : నిశిత దృష్టి కలిగి ఉండమని

చిన్న నోరు : తక్కువగా మాట్లాడమని (పది మాటలకొకమాట సమాధానమివ్వాలి–సాయి సూక్తి) తెలియజేస్తున్నాయి.

మూషికం : కోరిక అన్నది అదుపులో లేకపోతే వినాశనం తప్పదు. అందుకే కోరిక మీద సవారిచేస్తూ దాన్ని నీ అదుపాజ్ఞల్లో వుంచుకో. దాన్ని నీ మీద సవారి చేయనీయకు సుమా! అని హెచ్చరిస్తుంది.

(సెప్టెంబరు 10వ తేదీ శుక్రవారము వినాయకచవితి సందర్భముగా సమర్పణ)

సేకరణ : **'విరించి'**

# ఆదర్శమూర్తి డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ

డా॥ రాధాకృష్ణన్ తమిళనాడులోని ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1888వ సంవత్సరము సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టి గొప్ప విద్యాశిఖరాగ్రరాలను అధిరోహించారు. మన దేశంలో పుట్టిన ఆయన లాంటి కొద్ది మంది విద్వాన్‌లు, పండితులు, మేధావుల వల్లనే మనదేశ గౌరవం, మన సంస్కృతి విలువ, మన హిందూ మత సంప్రదాయపు ఉన్నతి ప్రపంచంలోనూ, ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలోనూ ఎవరెస్టు శిఖరం అంతా ఎత్తున నిలచింది.




డా॥ రాధాకృష్ణన్‌గారు విద్యార్థిగా ఉన్నప్పుడు విద్యార్థి ప్రతిభా స్కాలర్‌షిప్ పొందేవారు. రాధాకృష్ణన్ మద్రాసులో తన పోస్ట్ గ్రాడ్యుయేషన్ తత్వ శాస్త్రం, తర్క శాస్త్రము, తాత్విక వేదాంతంలో చేశారు. తన కాలేజీలో అందరి కన్నా ఎక్కువ ప్రతిభ చూపించారు.

డా॥ రాధాకృష్ణన్ తన 16వ ఏట శివకాము అనే ఆమెను పెళ్ళిచేసుకున్నారు. వీరికి 5గురు కూతుళ్ళు ఒక కొడుకు పేరు సర్వేపల్లి గోపాల్.

డా॥ రాధాకృష్ణన్ 1936 ఆక్స్‌ఫర్డ్ రిలీజియన్స్ అండ్ ఎథిక్సులో స్థానం పొందేరు.

1952 నుండి 1962 వరకు ఉపరాష్ట్రపతిగాను, 1962 నుండి 1967 వరకు భారతదేశ రెండవ రాష్ట్రపతిగాను పనిచేశారు. ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత ప్రథమ పౌరుడి స్థాయికి (రాష్ట్రపతి) ఎదిగిన అరుదైన ఘనత పొందిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. అయితే, రాష్ట్రపతిగా కంటే తత్వవేత్తగా ఆయన ప్రపంచానికి ఎక్కువగా పరిచయం. భారతీయ తాత్విక దృక్పథాన్ని ప్రపంచ దేశాలకు అందించిన గొప్ప వ్యక్తుల్లో ఒకరిగా ఆయన నిలిచారు. ఉపాధ్యాయుడిగా, తత్వవేత్తగా, రచయితగా, రాజనీతిజ్ఞుడిగా డా.. సర్వేపల్లి ప్రయాణం బహుముఖాలుగా సాగింది. శ్రీ రాధాకృష్ణన్ 21 ఏళ్లకే మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రొఫసర్ అయ్యారు. మైసూరు విశ్వవిద్యాలయంలో వేదాంత, తర్క శాస్త్రాలు బోధించే ప్రొఫెసర్‌గా కూడ పనిచేశారు. కాశీలోని బెనారస్ విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సులర్‌గా పనిచేశారు. ఉపాధ్యాయుడిగా శ్రీ సర్వేపల్లి విద్యార్థులపై చెరగని ముద్ర వేశారు. ప్రఖ్యాత ఆక్‌ఫర్డ్ యూనివర్సిటీలోనూ ఆయన పాఠాలు చెప్పారు. విద్యార్థులకు ఆయన అంటే ఎంత అభిమానమో తెలిపే ఒక సంఘటన :

శ్రీరాధాకృష్ణన్ మైసూర్‌లోని మహారాజా కళాశాల నుంచి బదిలీ అయినప్పుడు ఆయనకు విద్యార్థులు మరచిపోలేని రీతిలో వీడ్కోలు పలికారు. అందంగా ముస్తాబు చేసిన గుర్రంపై ఆయనను ఊరేగించాలని విద్యార్థులు భావించారు. శ్రీ సర్వేపల్లిని కూడా ఒప్పించారు. తీరా సమయానికి గుర్రం కనిపించకుండా పోయింది. అప్పుడు విద్యార్థులు తమ భుజాలపై రాధాకృష్ణన్‌ను ఊరేగింపుగా రైల్వేస్టేషన్ వరకు తీసుకెళ్లి వీడ్కోలు పలికారు.

డా॥ సర్వేపల్లి గొప్ప పండితుడు. ఆయన 16 సార్లు నోబెల్ సాహిత్య బహుమతి, 11సార్లు నోబెల్ శాంతి బహుమతులకు నామినేట్ అయ్యారు. మనదేశం డా॥ సర్వేపల్లిని అత్యంత గౌరవ ప్రధమైన భారతరత్న బిరుదులతో సత్కరించింది.



తెలుగువారి ముద్దు బిడ్డడైన శ్రీ రాధాకృష్ణన్ 1947వ సంవత్సరములో ప్రముఖ తెలుగు కవి అయిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కుమారుడైన బుజ్జాయి గీసిన తన చిత్తరువుపై జనవరి 3వ తేదీన సంతకం చేస్తూ, తన పేరును తెలుగులో వ్రాస్తూ సర్వేపల్లి రాధాకృష్ణయ్య అని వ్రాశారు.

**శ్రీ సర్వేపల్లి వారి బోధనలు కొన్ని :**

"బయట కనిపించే మురికి గుంటల కన్నా మనస్సులో మాలిన్యం గల వ్యక్తులు ఎంతో ప్రమాదకరం.

"తరగతి గది ఒక ప్రసూతి గది, జ్ఞానానికి జన్మనిచ్చేందుకు

"తరగతి గది ఒక స్మశాన వాటిక, అజ్ఞానాన్ని ఖననం చేసేందుకు"

"తరగతి గది ఒక కర్మాగారం, జాతి భవితను నిర్మించేందుకు"

"తరగతి గది ఒక న్యాయస్థానం, సరైన నిర్ణయాలు తీసుకునేందుకు"

"విద్య లక్ష్యం సంపాదనే కాదు, విద్య వివేకాన్ని, విమర్శనాశక్తిని "అందించాలి"

"చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో, భూమిని చూసి ఓర్పును నేర్చుకో, చెట్టును చూసి ఎదుగుదలను నేర్చుకో, ఉపాధ్యాయులను చూసి సుగుణాలు నేర్చుకో!"

"జీవితంలో కోట్లు సంపాదించినా లభించని ఆనందం ఒక మంచి మిత్రుడిని పొందినప్పుడు కలుగుతుంది."

"ఒక వ్యక్తిని త్వరగా అర్థంచేసుకోకపోయినా ఫరవాలేదు కాని అతి త్వరగా అపార్థం మాత్రం చేసుకోవద్దు."

"మంచిపని చేసేటప్పుడు సంతృప్తి పడడం ఉత్తమమే కాని మనకున్న జ్ఞానం చాలనుకోవటం అజ్ఞానం."

(సెప్టెంబరు 5వ తేదీ ఆదివారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భముగా సమర్పణ)

సేకరణ : **శ్రీమతి కె. సాయిప్రత్యూష**, గోవా

# నిష్కామ కర్మయోగం

రాముడు ధర్మనిగ్రహుడేగాక పరాక్రమశాలి. గొప్ప ధనుర్ధారి. అయితే వారి బలాన్ని ధర్మార్థమే వినియోగించారు. ఇలా ధర్మరక్షణలో బలాన్ని వినియోగించ సమర్థుడు కానివాడు సరియైన సాధకుడేకాడు. వైరాగ్యం పేరిట శరీరాన్ని శుష్కింపజేయడం తామసతపస్సని గీతగూడా నొక్కి చెబుతుంది. ధర్మానికి హాని జరుగుతూ వుంటే అశక్తుడై చూస్తూ వుండేవాడు అధర్మంతో చేయికలిపిన వాడేనని ధర్మశాస్త్రం. ధర్మాన్ని రక్షించడంలో క్షాత్రధర్మాన్నవలంభించినవారు విఫలులైతే బ్రహ్మజ్ఞానానికై జీవితాల నంకితం చేయదలచినవారు (బ్రాహ్మణులు) కూడా క్షాత్రం వహించాలని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి. వివేకానందుడు గూడా మన జాతికి కావలసినది ఆత్మబలం మాత్రమే కాదని, ఉక్కువంటి కండబలము కూడా అవసరమనీ ఉద్ఘాటించారు. అహింసను ప్రధాన సూత్రంగా గ్రహించిన బౌద్ధ గురువులు 'కరాటే' తావో ఋషులు 'కుంగ్‌ఫూ' వంటి యుద్ధవిద్యలను ధర్మరక్షణార్థం ఏర్పచడం గమనార్హం. అట్టి



బలాన్ని చేకూర్చుకున్నవాడు రాగద్వేషాది ప్రయోజనాలనాశించి బలాన్ని అక్రమంగా వినియోగించుకోకుండా వుండగలగడమే అహింసగాని, ధర్మరక్షణలో తన కర్తవ్యాన్ని బలహీనత వలన తప్పుకొని 'పరమాత్మే తగినశాస్తిచేస్తాడులే' అన్న మెట్ట వేదాంతం చెప్పే వారంతా అధర్మంతో చేతులుకలిపి ధర్మపన్నాగాల ముసుగులో దాక్కొనేవారేనని గుర్తించాలి. అలా సేకరించిన బలాన్ని తనకు బాధ కలిగిందన్న ద్వేషం వలన యుద్ధంలో ప్రయోగించడం గాని, అట్టి యుద్ధంలో యెదుట నిలిచినవారు తనవారన్న మమకారంతో వినియోగించకపోవడం గాని చేయక, అట్టి రాగద్వేషాలకతీతుడై ధర్మం కోసం తన విధిగా తలచి వినియోగించాలని, అలా చేయడంలో జయాపజయాలు, లాభాలాభాలు అన్న పరిగణన తగదని గుర్తించి కర్తవ్యాన్ని నిర్వహించడం నిష్కామకర్మయోగమని కృష్ణుడు భగవద్గీతలో బోధించాడు.

(ఆగష్టు 30వ తేదీ సోమవారం
శ్రీ కృష్ణాష్టమి సందర్భముగా సమర్పణ)

ఓం శ్రీ సాయినాథాయనమః | ఆహ్వానము | శ్రీ భరద్వాజ గురవేనమః



## గురుపూర్ణిమ మహోత్సవములు





**వేదిక**

**శ్రీ సద్గురు పాదుకా క్షేత్రం**
**ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖ - 21**

**తేదీలు**

**2021 జూలై 23, మరియు 24**
**(శుక్ర, స్థిరవారములు)**

**గురుపూర్ణిమ మహోత్సవ కార్యక్రమాల సంక్షిప్త వివరములు**

**2021 జూలై 23 మరియు 24 (శుక్ర, స్థిరవారము) తేదీలలో జరిగే నిత్య కార్యక్రమములు**

ప్రతి రోజూ అభిషేకం, భక్తుల గోత్రనామాదులతో పూజ, సాయంత్రం ఆధ్యాత్మిక ప్రవచనములతో పాటు, సామూహిక శ్రీ గురుచరిత్ర, సాయిలీలామృతము, సాయిమాస్టర్‌ల పారాయణ, విష్ణుసహస్రనామ పారాయణ, గురుపూజలు మొదలైన అనేక విశేష కార్యక్రమములు నిర్వహించబడును.

నిర్వహణ :
**శ్రీ శిరిడీ సాయి సేవా ట్రస్టు** (రిజిష్టర్డు)
ప్లాట్‌నెం. 13, పవర్‌సిటీ, విశాఖపట్నం-531 021.
సెల్ : 9849645224

సూచన : కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా పాటిస్తూ కార్యక్రమములో పాల్గొనగలరు.

# బాల వికాసం - భగవత్ భక్తి


ఒక ఊరిలో కోటయ్య అనే వ్యక్తి ఉండేవాడు. అతను ప్రతిరోజు దేవుడికి పూజచేస్తూ తన కోర్కెలు అన్ని నెరవేర్చమని విన్నవించు కునేవాడు. ప్రతి రోజు అదే సమయములో ఒక బిక్షగాడు కోటయ్య ఇంటికి వచ్చి బిక్షతోపాటు తన శరీర అచ్ఛాదనకై ఏదైనా ఒక పాతవస్త్రము ఇవ్వమని అడిగేవాడు. ఇప్పుడు కాదు తరువాత ఇస్తాను అంటూ అతనిని రోజూ తిప్పేవాడు కోటయ్య. చివరకు ఒక రోజు తనకు పనికిరాని ఏదో ఒక పాతచొక్కా ఇచ్చి వదిలించుకోవాలని భావించి, పూజలో ఉన్న కోటయ్య స్వయంగా తానే లేచి, తన పాత వస్త్రాలన్నీ తిరగేసి చివరకు తనకు ఏవిధముగా పనికిరాదని, భావించి చినిగిపోయి, బాగాపాతదయిన ఒక చొక్కాను తీసుకువచ్చి, ఆ బిక్షగాడికి ఇచ్చి పంపివేశాడు కోటయ్య. ఆమాత్రం వస్త్రానికే సంతసించిన అతను, మహాభాగ్యం అనుకుంటూ దానిని తీసుకొని వెళ్ళిపోయాడు. తిరిగి వచ్చి దేవుని ముందు కూర్చొని తన కోరికల చిట్టాను విన్నవిస్తూ వాటిని నెరవేర్చమని వేడుకోవటం ప్రారంభించాడు కోటయ్య. ఎన్నోరోజుల నుంచి నిన్ను వేడుతున్నా నీ మనస్సు కరగదా స్వామి, సకల భువనాధి పతివైన నీకు నా కోర్కెలు తీర్చటం గడ్డిపోచవంటిది. అటువంటి నేను ఎంత వేడినా ఎందుకు దయకలగటం లేదు అని పలువిధాలుగా వేడసాగేడు కోటయ్య.



అకస్మాత్తుగా, ఎదురుగా ఒక మెరుపు మెరిసిన్నట్లయి తన ఎదుట చిత్రపటంలోని దేవుడు ఎదుట నిలచినట్లయింది. సంభ్రమాశ్చర్యాలకు లోనయిన కోటయ్య మోకరిల్లి తన కోర్కెల చిట్టా విప్పేడు. మందస్మిత వదనుడైన దేవుడు, "కోటయ్య! ఎన్నో రోజులుగా నీ వేడుకోలు విని వచ్చాను. ప్రతి రోజు నీ కోర్కెలు విన్నవించుకుంటున్నావు, నెరవేర్చటం లేదని నన్ను ఆడిపోసుకుంటున్నావు, మరి నేను రోజు నిన్ను వేడుతున్నా! నీవు నా మాట పెడచెవిన పెట్టలేదా? ఈరోజు దయకలిగి నీకు పనికిరాని ఏదోఒక పాతవస్త్రం నా మొహాన పడేశావు. అంత దానికే నేను సంతుష్టుడినై వచ్చాను, మరి నీవు చేసినట్లుగా నేను కూడా నీకోరికలు అసంపూర్తిగా నెరవేరిస్తే నీవు సంతృప్తుడవు అవుతావా" అన్నాడు దేవుడు. ఒక క్షణం నోరెళ్ళబెట్టిన కోటయ్య తేరుకొని "అదెట్లా స్వామి, అట్లా చేస్తే నా కోరిక తీర్చినట్లు ఎట్లా అవుతుంది" అన్నాడు. మనం చేసిన దానిననుసరించే కదా ఫలితం వచ్చేది, వేప గింజలు నాటి జీడిపప్పు రావాలని కోరటం, తాటిటెంక పాతిపెట్టి మామిడి ఫలాలు రావాలనుకోవటం ఎంత అసమంజసమో, నీవు కోరే కోరికలు అంతే అసమంజసం, ఒక గింజనాటి ఫలాలు కోరు తప్పులేదు, అసలు విత్తు నాటకుండా, ఒకవేళ నాటినా, వేరొకటి కోరటం తగదు. ప్రతిరోజు ప్రార్థనలో అన్ని జీవులలో నేనే ఉన్నాను అని నోటితో అంటావు, కాని చేతితో విదిలించివేస్తావు, మరి ఫలితం ఎట్లా వస్తుంది. "ఇకనుంచి నీవు ఏదానధర్మాలు చేసినా మనస్ఫూర్తిగా, చేతనయినంత మేరకు, శక్తి మేరకే చేయి. అది పదింతలై నీఇంట నిలుస్తుంది" అని అంతర్ధానమయ్యాడు దేవుడు.

"అన్ని జీవులలో నేనే ఉన్నాను అన్నారు అవధూత శ్రీ వెంకయ్యస్వామి", "ఏ జీవిని హింసించినా ఆదరించినా అది తనకే చెందుతుందని, సకలజీవ స్వరూపుడయిన శ్రీసాయి ప్రత్యక్ష నిరూపణ చేశారు, రోడ్డుకు అడ్డంగా పడుకొని ఉన్న కుక్కను కాలితో అదిలించి, తనకు ఆహారం ఇవ్వదలచిన మహల్సాపతితో "కడుపులో కొట్టి, కడుపునిండా పెడతానంటావేమిటి? నాకువద్దు అన్నారు". ఒక గేదెకు పులగం పెడితే, ఒక కుక్కకు రొట్టెలు వేస్తే, ఒక పిల్లికి పాలు అందిస్తే, ఒక సాధువుకు దక్షిణ ఇస్తే ఒక భిక్షగాడికి భోజనం పెడితే అవి అన్నియు తనకే చెందినట్లు ప్రత్యక్ష నిరూపణ చేసిన సంఘటనలు శ్రీ శిరిడీసాయి బాబా జీవిత చరిత్రలో అనేకం కలవు. "ఎవరైనా నీదగ్గరకు వచ్చి అడిగితే, ఇవ్వశక్యమైతే ఇవ్వు లేదా ఇప్పించు లేదా ఇవ్వలేనని చెప్పు అంతేకాని అదిలించటం, అవహేళనచేయటం" తగదు అన్నారు శ్రీసాయిబాబా. దేవుడికే కదా అంటూ హుండీలో, నొక్కుపోయి, చిలుముపట్టిన నాణేలు, మాసిపోయిన, చినిగిపోయిన, కాలిపోయిన కరెన్సీ నోట్లను హుండీలో వేయవద్దు, అవే మనకు పదింతలుగా అయ్యి మన వద్దకు చేరుతాయి. బిడ్డను ఇవ్వమని కదా మనము అడిగేము అని అంగవైకల్యంతో బిడ్డనిస్తే వప్పుకుంటామా! "ఎవరు చేసిన పనికి అదేవిధముగా ఫలితం ఉంటుంది" అన్నారు బాబా. "నీవు నాకు ఒకటి ఇస్తే అది పదింతలు చేసి ఇస్తాను" అన్న సాయి, "నీవు నావైపు ఒక్క అడుగువేస్తే పది అడుగులు వెంటనుండి నడిపిస్తానన్నారు" కనుక మనందరము ఇకనుంచి దానం చేసిన, ధర్మంచేసినా అది సర్వజీవ స్వరూపుడయిన శ్రీసాయిబాబాకే చేస్తున్నామన్న భావనతో వీలయినంతగా, భక్తి భావంతో శక్తి వంచన లేకుండా, మనస్ఫూర్తిగా సాటివారికి సాయం చేద్దాము.

రచన, సేకరణ : **శ్రీమతి వి.ఎస్. లక్ష్మి**



# పుస్తక పరిచయం





## SRI SAINATH STAVANA MANJARI
(English)

మరాఠీ భాషలో, శ్రీ దాసగణు మహరాజ్ రచించి, శ్రీసాయినాధుని కృపకు పాత్రుడైన శ్రీ సాయినాథ స్థవనమంజరి, నేటి విద్యార్థుల కొరకు, గతంలో స్థవనమంజరిని తెలుగులో అందించిన శ్రీ ఇమ్మిడిశెట్టి ప్రభాకరరావుగారు ఇంగ్లీషులో తర్జుమచేసి అందించటము జరిగింది. హృద్యమైన ఆంగ్లములో అందించిన శ్రీ పారాయణ గ్రంథం. ఇంగ్లీషులో చదువుకోవాలనుకునే వారికి చక్కటి వరం.

**Pages : 18** **Price : Rs. 5/-**

*For Copies :*
**Sri I. PRABHAKARA RAO**
Flat No. : 104, Sri Sai Sadan Appartments
Near Brindavan Colony Arch, JNTU (Kukatpally)
HYDERABAD - 500 085 Telangana State
Mobile : 92472 58886





## వినుమా వినతి ఓసాయినాధ!

"సాయి అన్న నామం ఉచ్చరించినంత మాత్రాన సప్త సముద్రాల అవతల ఉన్నా రక్షిస్తాను'' అన్నారు శ్రీసాయిబాబా. ప్రస్తుత ఈ విపత్కర పరిస్థితులలో శారీరక శక్తితోపాటు మానసిక శక్తి కోసం, సాయి మనవెంట, మనతో, మనలో ఉన్నారు అని ధైర్యంతో మానసిక స్థైర్యాన్ని నింపుకోవటానికి ఆలంబనగా కొద్ది నిముషాలపాటు శ్రీ దత్త, సాయిబాబాలను స్మరణ చేసుకునే విధముగా రూపొందించిన శ్రీ దత్తసాయి స్తోత్రమాలిక "వినుమా వినతి ఓసాయినాధ!."

ప్రతులకు : **శ్రీ భరద్వాజ పబ్లికేషన్స్**
C/o. శ్రీ శిరిడీసాయి సేవాట్రస్టు, ప్లాట్ నెం. : 13, పవర్‌సిటీ,
పరవాడ మండలం, గౌతులచ్చన్న నగర్ దగ్గర,
విశాఖపట్నం – 531 021.

**సూచన :** ప్రతులు కావలసినవారు 9849645224 నెంబరుకు, మీ చిరునామా పంపినచో, పోస్టు ద్వారా పుస్తకం ఉచితముగా పంపబడును.


## SHRI SAI SAT CHARITRA
(Sankat Mochan Adhyayas 11&15) English




సర్వ సంకటాలు తీరటం కొరకు, శ్రీ అన్నాసాహెబ్ ధబోల్కర్, (హేమాద్రిపంత్) మరాఠీ భాషలో వ్రాసిన శ్రీసాయి సచ్చరిత్రలోని 11 మరియు 15 అధ్యాయాలను, సంకట విమోచన అధ్యాయాలుగా మహారాష్ట్ర వారు నిత్య పారాయణ చేస్తారు. మరాఠి భాషలోని శ్రీసాయిసచ్చరిత్రను శ్రీ నగేష్ వాసుదేవ్ గుణాజీ, ఇంగ్లీషులోకి అనువదించటం జరిగింది. అందులోని 11, 15 అధ్యాయాలను, శ్రీ ఐ. ప్రభాకరరావు సంకలనం చేసి అందించటము జరిగింది. దీని పారాయణ వలన సర్వులకు సంకటాలు తొలగి, సుఖశాంతులతో జీవించాలని రచయిత అభిప్రాయం.

**Pages : 16** **Price : Rs. 5/-**

*For Copies :*
**Sri I. PRABHAKARA RAO**
Flat No. : 104, Sri Sai Sadan Appartments
Near Brindavan Colony Arch, JNTU (Kukatpally)
HYDERABAD - 500 085 Telangana State
Mobile : 92472 58886





## నందదీపం

'భగవత్‌జ్యోతిని మానవ మనస్సు స్వీకరిస్తుంది. మనిషి శక్తి ఆ మహాశక్తితో ప్రజ్వరిల్లుతుంది. అప్పుడతనితో ఆ అద్భుతం అనేక అద్భుతాలు చేయిస్తుంది." అన్న వాక్యాన్ని అనుసరించి – హృదయాలలో వెలిగే ఆత్మజ్యోతిని, అఖండమయ్యేలా అంతటా, అన్నిటా ఉన్న శ్రీసాయిని గుర్తెరిగి జీవించే విధముగా, జగద్గురువైన శ్రీ శిరిడీసాయినాధుని బోధనా విధానాన్ని, తత్వాన్నీ అవతార లక్ష్యాన్ని తెలియచేస్తూ హృదయాంతర్గతమైన శ్రీశిరిడీసాయిజ్యోతిని అఖండం చేసుకునే విధముగా రచయిత శ్రీతుమ్మపూడి కోటీశ్వరరావు డాక్టరు ఓరుగంటి ప్రసాద్ రచనా సహకారంతో అందించిన పుస్తకరాజం నందదీపం (అఖండజ్యోతి)

**పేజీలు : 156** **వెల : రూ. 100/-**

ప్రతులకు : **షిర్డిసాయిబాబా మందిరము**
రోడ్ నెం . 4, లక్ష్మీనగర్, సైదాబాద్ హైదరాబాదు–500 054,
తెలంగాణ రాష్ట్రం. సెల్ : 8019262315




## దీపం - ప్రమిద - నవగ్రహాలు :

ప్రమిదలో దీపం వెలిగించడం ద్వారా నవగ్రహప్రభావ దోషాలను తొలగిస్తుంది. ఏ దేవునికైనా ప్రమిదలో దీపం వెలిగించడం ద్వారా శుభ ఫలితాలను పొందవచ్చు. ప్రమిద, అందులోని నూనె, వత్తులు, కాంతికి, నవగ్రహాలకు సంబంధం వుంది. ప్రమిదల్లో నేతిని నింపి, దీప ప్రజ్వలనం చేయడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహాన్ని పొందవచ్చు. ప్రమిదల్లోని జ్వాలలో మహాలక్ష్మి నివసిస్తుందని శాస్త్ర వచనం.

1. ప్రమిద దీపం - **సూర్యుడు**
2. నెయ్యి, నూనె - ద్రవపదార్థం - **చంద్రుడు**
3. వత్తులు - **బుధుడు**
4. ప్రమిదను వెలిగించడం ద్వారా ఏర్పడే జ్వాల - **అంగారకుడు**
5. ఈ జ్వాలనీడ భూమిపై పడుతుంది. ఇది భూమికి సంకేతమైన **రాహువు**ను సూచిస్తుంది.
6. జ్వాలలో కాంతినిచ్చే పసుపురంగు - **గురువు**
7. దీప ప్రజ్వలనం ద్వారా ఏర్పడే మసిలాంటి నల్లటి రంగు - **శని**కి సంకేతం
8. దీప ప్రజ్వలనం ద్వారా ఏర్పడే కాంతి - జ్ఞానం ఇది **కేతువు**కు సంకేతం
9. ప్రమిదలోని వత్తులు వెలుగుతూ, తరుగుతూ రావడానికి **శుక్రుడు** సంకేతం. శుక్రుడు ఆశకు కారకుడని జ్యోతిష్య శాస్త్రం చెబుతుంది.

## తమసోమా జ్యోతిర్గమయా!

ఆశలతో మానవజన్మ సార్థకం కాదని, తద్వారా మోక్షం లభించడం కష్టమని, తిరిగి తిరిగి మానవుడు ఆశల ద్వారా కర్మలు చేసుకుంటూ పోతూ, విషయవాసనల చక్రంలో బందీ అవుతాడు. **కనుక కర్మలన్నియు భగవదర్పితంగా చేయవలెనని "గీత" బోధిస్తుంది.**

## దశావతారాల నుండి మనము తెలుసుకోవల్సింది :

**1. మత్స్యావతారం :** చేప నీటిలో ప్రతికూల పరిస్తితుల్లోనూ ఏ విధంగా ఈదుతుందో, అదేవిధంగా జీవితంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ సంసారాన్ని ఈదాలి.

**2. కూర్మావతారం :** తాబేలు అవసరం లేనప్పుడు ఏవిధంగా ఇంద్రియాలను వెనక్కి తీసుకుంటుందో, అదేవిధంగా మనం పనులు లేనప్పుడు ఇంద్రియాలను కట్టివేసి 'ధ్యానం' చేయాలి.

**3. వరాహావతారం :** వరాహం ప్రపంచ భారాన్ని ఏ విధంగా మోస్తుందో, అలాగే "ఇంటి బాధ్యతలను" మొయ్యాలి.

**4. నరసింహావతారం :** మనలోని అజ్ఞానాన్ని చీల్చి చెండాడాలి.

**5. వామనావతారం :** మొదటి అడుగు భౌతికంగానూ, రెండవ అడుగు ఆధ్యాత్మికంగాను జీవిస్తూ; మరి మూడవ అడుగును మనలోని 'అహంకారాన్ని' గుర్తించి 'బలి' ఇవ్వాలి.

**6. పరశురామావతారం :** 'లక్ష్యం' కోసం పట్టుదలతో ముందుకెళ్లాలి.

**7. రామావతారం :** 'ధర్మ'యుతంగా జీవించాలి.

**8. కృష్ణావతారం :** ఎన్ని కష్టాలు ఎదురైనా 'ఆనందం'గా ఉండాలి.

**9. బుద్ధావతారం :** 'జ్ఞానాన్ని' పంచాలి.

**10. కల్కి అవతారం :** సకల మానవాళి 'అజ్ఞానాన్ని తీసివేయాలి'.

## యోగం :

భగవంతునితో ఉండటము - కర్మయోగం.
భగవంతునిలో ఉండటము - రాజయోగం.
అంతా భగవంతుడేనని ఉండటము - భక్తియోగం.
భగవంతునిగా ఉండటము - జ్ఞానయోగం.

## ధ్యానము :

ధ్యానము అంటే మనస్సులోని అడ్డంకులను తొలగించి స్వస్వరూపాన్ని వీక్షింప చేసేదే ధ్యానం.

## చిట్కాలు

1. పసుపు నీటితో వంటగదిని శుభ్రంచేయడం వల్ల ఈగలు రావు.
2. బిస్కెట్ పేకెట్ బియ్యండబ్బాలో ఉంచడం వల్ల తొందరగా మెత్తబడవు.
3. నూనె పొరపాటున ఒలికితే ఆ ప్రాంతంలో కొంచెం మైదాపిండి జల్లితే నూనెను త్వరగా పీల్చేస్తుంది.
4. క్యాబేజి ఉడికించేటపుడు వాసనరాకుండా ఉండాలంటే చిన్న అల్లం ముక్క వేయ్యాలి.
5. బట్టలపై నిమ్మరసంగానీ, టూత్‌పేస్ట్‌గానీ వేసిరుద్దడం వల్ల ఇంకు మరకలు పోతాయి.
6. వెల్లుల్లిపాయను మెత్తగా దంచి కొంచెం నీటితో కలిపి బొద్దింకలు వచ్చేచోట ఉంచితే అవి ఆ ప్రాంతానికి రావు.

## తెలుసా!

1. వేగంగా తిరిగే ఫ్యాన్ గాలిక్రింద లేదా ఏ.సి.లో పడుకుంటే శరీరం పెరిగి లావై పోతారు.
2. 70% నొప్పులకు ఒక గ్లాసు వేడి నీళ్ళు చేసే మేలు ఏ పెయిన్ కిల్లర్ కూడా చేయలేదు.

# గురుదక్షిణ - ఋషిఋణం

దేశంలో ఎక్కడ చూసిన షిరిడి సాయి మందిరాలు, సాయి సత్సంగాలు, సాయిబాబాను గురించిన పత్రికలు సినిమాలు వస్తున్నాయి. సద్గురు సాయినాథ మహరాజ్ తాను సంకల్పించిన విశ్వకళ్యాణ యజ్ఞపు చేరువలోకి, ప్రపంచము అడుగిడుతుందనే భావన కలుగుతున్నది. అయితే శ్రీ సాయియాగానికి, అంకురార్పణ 1854వ సంవత్సరములో శ్రీసాయి శిరిడీలోని వేపచెట్టు క్రింద కూర్చొని ప్రకటమవటంతో ప్రారంభమైంది. "నా భక్తులను నేనే ఎన్నుకుంటాను" పిచ్చుకకాలికి దారంకట్టి లాగినట్లు నా వారిని నాచెంతకు చేర్చుకుంటాను" అన్నారు శ్రీసాయిబాబా. ఇంతకు కాలుకి కట్టిన ఆ దారమేమి? అదే సాయి ఉద్యమం. పై ఉద్యమం అనే పూలతోటకు, పాదుచేసి, నీరుపోసి పెంచి, ఫల, పుష్ప భరితం చేసిన ప్రాతఃస్మరణీయులకు కృతజ్ఞత తెల్పుకోవటము మనందరి విధి.



ఈ ఉద్యమానికి సూత్రధారుడు శ్రీసాయిబాబాయే నాంది ప్రస్తావన చేసినారు శ్రీ దాసగణు మహరాజ్. బాబా ఆ దేశంపై పోలీసుశాఖలో ఉద్యోగము మానుకొని, తన హరికథలద్వారా, శ్రీ సాయి దివ్యత్వాన్ని మహారాష్ట్రమంతటా వెదజల్లినారు. శ్రీ నానాసాహెబ్ చందోర్కర్ తన సద్గోష్టులద్వారా పరిచయస్తులందరిని ఉత్తేజపరిచి, సాయి సన్నిధికి పంపారు. అలాపంపబడిన వారితో అన్నాసాహెబ్ దబోల్కర్ సాయి అనుమతి ఆశీస్సులతో సచ్చరిత్ర, అనే చింతామణిని భావితరాలకు అందించారు. ఎంతటి మహనీయుని దివ్యత్వమైనా వారు కరుమరుగయ్యాకనే తెలుస్తుంది. కారణం అప్పటి ప్రత్యక్ష భక్తుల అనుభవాలు వారందరికి తెలిసే ఉంటాయి. కనుక గ్రంథస్తం చేసే అవకాశం కలగదు. కనుకనే సాయి జీవితకాలంలో గ్రంథస్తలైనవి బహుస్వల్పం. వారు మహాసమాధి చెందాకనే వారి సూక్తులు, లీలలు ఎంత అవసరమో భావితరాలకు అవి ఎంత గొప్ప పెన్నిధిలో, వారిని స్మరించుకొనేందుకు అవి ఎంత గొప్పసాధనాలో భక్తులకు స్ఫురించింది. కాకాదీక్షిత్, హేమాద్రిపంత్ మొదలయినవారు "సాయిలీల" అనే మరాఠీ పత్రికలో సాటి భక్తుల స్మృతులు, అనుభవాలు సేకరించి ప్రచురించారు. సాయి ఉద్యమానికి దృఢమైన పునాదులు వేశారు. కాలగర్భంలో సాయి ఉద్దమాన్ని మరీ రమ్యంగా తీర్చిదిద్దేవని పూజ్య శ్రీబి.వి. నరసింహస్వామివారు స్వీకరించారు. సద్గురు అన్వేషణలో షిరిడిచేరి, అదే తన గమ్యమని తలచి, అప్పటి ప్రత్యక్షసాయి భక్తులందరిని కలిసి వారి స్మృతులను, అనుభవాలను, సాయిలీల పత్రికలో మరుగుపడిన మధుర స్మృతులను, ఆంగ్లభాష ద్వారా దేశానికి తీసుకువచ్చి యావద్దేశానికి అందించారు. శ్రీసాయి విచిత్రరీతిన అందించిన ఆర్థిక సహాయము ద్వారా దేశమంతా పర్యటించి సాయి సమాజాలు యేర్పాటు చేయటమే కాకుండా అఖిలభారత సాయిసమాజం, సాయివారి చేత ఏర్పాటు చేయించుకున్నారు మరొకవంక శ్రీపత్తి నారాయణరావుగారి చేత శ్రీ సాయి తమ సచ్చరిత్రను ఆంధ్రులకు అందించారు. శ్రీ గుణాజీచేత ఆంగ్లంలో సచ్చరిత్రను తర్జుమా చేయించుకున్నారు. ఈ సాయి ఉద్యమమనే పూదోటలో రకరకాల పుష్పాలు పూచేవిధంగా శ్రీసాయి, శ్రీ కేశవయ్యజీ, శ్రీ వేమూరి వెంకటేశ్వర్లు, శ్రీ బాపట్ల హనుమంతరావు గార్లచేత పుష్పించుకున్నారు.

సాయి తమ భక్తులను తామే ఎన్నుకుంటామన్నారు. అలాగే మన ప్రియతమ మాష్టరుగారిని కాలికి దారం కట్టినట్లు ఆచార్యులవారిని తనవద్దకు లాగుకొని మరుగుపడిన తన స్మృతులను, అనుభవాలను అందించి మనమందరము వాటిని పొందేలాగున శ్రీ సాయిలీలామృతము ద్వారా అందింపచేసారు. ఫల పుష్ప భరితమైన ఆపూతోట మనందరికి నీడను, సాయి కరుణ అనే ఫలాలను ప్రసాదించే, ఉద్యానవనంగా ఆచార్యులవారు తీర్చిదిద్ది మనకందించారు. ఆ ఉద్యమాన్ని నిత్యనూతనంగా ఉంచుకొనేలాగునఆచార్యులవారు ఆ వనానికి రక్షాకవచంగా, శ్రీ గురుచరిత్ర, ఇతర మహాత్ముల చరిత్రులు, ప్రతివారిని తట్టి పిలచే సాయివాణిగా శ్రీ సాయిబాబా పత్రిక సుప్రతిష్టితం చేసారు.

సాయి తన వారిని తాను ఎన్నుకుంటాన్న మాట నిజం. అందుకనే ఆయన ఈ పుణ్యపురుషులందరి చేత తమ ఉద్యమం నిర్వహింపచేసి, ఆదరంతో మనందరిని తమ చెంతకు లాక్కొన్నారు.

మానవుడు తీర్చుకోవలసిన ఋణాలలో ఋషి ఋణం ఒకటి. పై సాయితత్వాన్ని మన కందించిన మహనీయులందరిని స్మరించి కృతజ్ఞత తెల్పుకోవటము మనందరి విధి. అదే మానవత్వం సధర్మం.

అయితే ఆ ఋణం ఎలా తీర్చుకోవాలి? పై మార్గాన్ని ఋషులే మనకందించారు. వారి వలన మనకు అందినవాటిని ఆర్ద్రచింతనతో పారాయణ చెయ్యాలి. సాటివారికి పంచిపెట్టాలి, అందుకనే శ్రీ ఆచార్యులవారు "సాయిబాబా జీవితచరిత్రను వీలయినంత వివరంగా నిత్యపారాయణ చెయ్యాలి అని, సత్సంగాలలో చరిత్ర శ్రవణం చేయించి, శ్రీసాయి ఆచరణద్వారా తెల్పిన బోధనలను సాటివారి హృదయాలలో హత్తుకునేలా చేయాలి అని చెప్పేవారు. అలా చేసినప్పుడు సదా మనం కాపాడుగలుగుతాము" అని అనేవారు ఆచార్య శ్రీ భరద్వాజగారు. ఆచార్యులవారు ఆదేశించిన విధంగా నిత్య పారాయణ అనే నీరుపోస్తూ, ఆ ఉద్యమాన్ని కాపాడుకోవటమే మనం చెల్లించుకోవలసిన ఋషిఋణం. శ్రీసాయి కూడ "ఎవరైతే నాచరిత్ర పారాయణ చేస్తారో, నా లీలలు గానం చేస్తారో వారి కర్మ నశిస్తుంది, వారే నేనుగా మారిపోతారు" అన్నారు. శ్రీ ఆచార్యుల వారి పై సంప్రదాయాన్ని మనకందించారు. మనమందరము పై మార్గంలో పయనిస్తూ వారందించిన అమృతఫలాన్ని సదా కాపాడుకొంటూ, అందరికీ అందేలా ప్రవర్తించటమే వారికి మనము ఇచ్చే ఋషిఋణముతో కూడిన గురుదక్షిణ కావాలి.

రచన : **శ్రీ కె.వి. రంగారావు**, ఒంగోలు

# ఈ యుగావతారము శ్రీసాయి

శ్రీ సాయిబాబా యీ యుగావతారము. ఒక్క మాటలో చెప్పాలంటే సమకాలీన సాంఘీక భావ ప్రతినిధి. "పాల్‌రిచర్డ్" చెప్పిన యుగ దివ్యావతారము శ్రీ సాయి.



బాబా "షిరిడీ" గ్రామం గురించి చెప్పిన వివరాలు ఇలావున్నాయి. పూర్వము షిరిడీ గ్రామం సిరి సంపదలతో విలసిల్లుతుండేదని, ఎందరో మంచివారు, దయగలవారు ఆ గ్రామంలో నివసిస్తూ ఉండేవారని, ఆ గ్రామంలో ఎట్టి కొరత ఉండేదిగాదని, నిత్యకళ్యాణం పచ్చతోరణంగా ఆ గ్రామం విలసిల్లితుండేదని చెప్పేవారు. కాని శ్రీ సాయినాథులవారు 1854 సంవత్సరంలో తాము కాలుపెట్టినప్పుడు షిరిడీ గ్రామ స్థితి ఆచార్యులవారు ''లీలామృతము''లో విశదీకరించారు. విరగగొట్టబడిన విగ్రహమూర్తులతో, దీపారాధనకు కూడా నోచుకోని చిన్న ఆలయాలు, పాడుబడ్డమసీదు, ఇరుకైన వీధులు, చెత్తచెదారముతో నిండిన గ్రామ వీధులు, మంచినీటి వసతి కూడా కరువుగా ఉంది షిరిడీ గ్రామస్థితి. అంతేగాక గంగగిర్ మహారాజ్ షిరిడీ గ్రామాన్ని "పేడకుప్ప" అని వర్ణించటము అక్కడి ప్రజలకు దైవముమీద శ్రద్ధ తక్కువనేశ్లేషను సూచిస్తున్నది.

కాని శ్రీ సాయి తమ అవతార కార్యమునకు షిరిడీనే రంగస్థలముగా నిశ్చయించారు. ఆ చిన్న ఆలయాలు తిరిగి నూతనముగా మరమ్మత్తు గావించబడ్డాయి. దీపారాధనలు, నివేదనలు జరుపబడ్డాయి. పాడుబడ్డ మసీదు పునరుద్ధరింపబడ్డది. చెత్తాచెదారం తొలగించబడి, పూలవనాలు పెంచబడ్డాయి. ఎందరో భక్తులను జాతి, మత, కుల, విచక్షణా రహితంగా ఆకర్షించి, భక్తి, ప్రేమ పొంగిపోరలేలా జనులందరికి అందించారు శ్రీ సాయినాథులవారు. ఆధ్యాత్మికతకు ఒక చక్కని నిర్వచనాన్ని అందించి ఎందరికో తరింపుకు దారిచూపే కాంతి పుంజమయినది షిరిడీ గ్రామము.

శ్రీ సాయినాథులవారు తన్నాశ్రయించిన భక్తులను మతము మార్చుకోమని బోధించలేదు. కఠినమైన నియమనిబంధనలు విధించలేదు. ఎటువంటి చిల్లర తమాషాలను ప్రదర్శించలేదు. తన కీర్తిని, ఆడంబరాన్ని ఏనాడు చాటుకోలేదు. 'అల్లాయే యజమాని నేను బానిసను' అని చెప్పుచూ, సద్గురు ఎలావుంటారో ఆచరించి చూపించారు. పైగా తన భక్తులను, సద్గురువును తెలుసుకోమని, ఆయన వేషభాషలు పట్టించుకోరాదని, ఆయన వాక్కులకు విధేయులమై ఉండాలని, సాటివారిలో కూడా తన గురువునే దర్శిస్తూ, సోదర భావంతో వారితో కలిసిపోయి జీవించమని, ఆధ్యాత్మికతకు మూలస్తంభములైన శ్రద్ధా ఓరిమిలతో, తన గురువును సేవించి, ఆయన ప్రేమను పొందుటకు అర్హతను సంపాదించుకోమని, అట్టి, అర్హతను, పొందటానికి సదా నీలోని వికారాలను తొలగించు కొనే ప్రయత్నము పట్టువీడకుండా ఆచరించమని, జీవిదేనికై తపిస్తుందో అట్టి తృప్తిని శాంతిని పొందమని, పై విధానములో తన్నాశ్రయించిన భక్తుని సర్వబాధ్యతలు తనవేనని, ఆజీవిని పరమాత్మ వద్దకు చేర్చేదాకా ఆ జీవిని వెన్నంటే వుంటానని, అభయ ప్రదానం చేశారు శ్రీ సాయి.

ప్రతిభావంతుడైన ఉపాధ్యాయుణ్ణి గౌరవిస్తూ కూడా, ఆయన చెప్పే పాఠాలు నేర్చుకోని విద్యార్థికి ఎంత లాభము చేకూరుతుందో! జగతికి అధినాథుడైన సాయిని ఆశ్రయించి, వారు చెప్పినవి పాటించటానికి కూడా ప్రయత్నించనట్లయితే ఒక గొప్ప వైద్యుని విశ్వసించి, ఆయనను పూజించి, ఆయన యిచ్చిన ఔషధము పథ్యము పాటించనట్లే అవుతుంది. అందువల్ల వ్యాధి నిర్మూలనకాదు. సరికదా! బాబా చెప్పిన మాదిరిగానే పండు అయ్యే అవకాశాన్ని కోల్పోతాము. పూతగారాలిపోయే పరిస్థితే సంక్రమిస్తుంది.

సర్వలోక కళ్యాణమునకు అవతరించిన సద్గురుశ్రీ సాయినాథుని బోధలే నేటి సమాజానికి రక్షాకవచాలు. అందుచేతనే శ్రీ సాయి ఈనాటి యుగావతారము. సమకాలీన సాంఘీక భావ ప్రతినిధి.

రచన : **శ్రీ కె.వి. రంగారావు, ఒంగోలు**

## ఓ ప్రభూ


ఈ జీవితంలో నిన్ను కలుసుకునే భాగ్యం నాకు లేకపోతే, నీ దర్శనాన్ని పొందలేకపోయినాననే తీరని వాంఛ నా నించి తప్పించకు. నన్నో నిమిషం మరిచిపోనీకు. నా జాగ్రత్ స్వప్నాలలో ఈ విషాద బాధాఛాయల్ని విడవక నన్ను భరించనీ.

ఈ ప్రపంచపు జనసమర్ధతా విపణి వీధుల్లో నా దోసిళ్ళు దైనిక లాభాలతో నిండిన కొద్దీ, నేనేమీ విలువైనది పొందలేకపోతినని నన్నొక నిమిషం మరచిపోనీకు. నా జాగ్రత్ స్వప్నాలతో ఈ విషాద బాధాఛాయల్ని ఎల్లపుడూ నన్ను మోసుకు తిరగనీ, అలసి వగరుస్తూ వీధిపక్కన కూచుని ధూళిలో నా పక్క పరుచుకున్నప్పుడు, నా ముందు దీర్ఘ ప్రయాణం వుండిపోయిందని నన్నొక్క నిమిషం మరచిపోనీకు. నా జాగ్రత్ స్వప్నాలతో ఈ విషాద బాధా ఛాయల్ని నాలోనే మోసుకోనీ.

అలంకరించిన నాగదుల్లో మధురవాద్యాలు ధ్వనిస్తూ, నవ్వులు మారు మ్రోగినప్పుడు కూడా నిన్ను నా ఇంటికి పిలవనైతినే అనే ధ్యాస నన్ను బాధించనీ, ఒక్క నిమిషం నన్ను మరిచిపోనీకు. నాజాగ్రత్ స్వప్నాలలో ఈ విషాద ఛాయల్ని నా వెంట మోసుకు తిరగనీ.

**– విశ్వకవి శ్రీ రవీంద్రనాథఠాగూర్**

(ఆగష్టు 7వ తేదీ విశ్వకవి శ్రీ రవీంద్రనాథఠాగూర్ వర్ధంతి)




### ప్రయాణం

కావలసింది అంతరిక్ష ప్రయాణం కాదు
అంతర్వీక్షణం, నీ లోలోపలికి ప్రయాణం చేయి
గమ్యం బయట లేదు, నీ లోపలే ఉంది
– జ్ఞానేశ్వర మహరాజ్

### అజ్ఞానం

ఈ జన్మను సద్వినియోగం చేసుకోకుండా
లేని జన్మ గురించి ఆలోచించటం అజ్ఞానం
– శ్రీశ్రీ

### దేవాలయం

భగవంతుడు విగ్రహాల్లో ఉండడు
నీభావాలే భగవత్ స్వరూపం నీ మనస్సే దేవాలయం
– చాణుక్యుడు

### త్రిపథ

స్వయంకృషి, పట్టుదల, దృఢ సంకల్పం
ఈ మూడు ఎంచుకున్న రంగంలో మనల్ని ఉన్నత
వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి
– శ్రీరమణమహర్షి

### భగవద్గీత

నా విజ్ఞాన శాస్త్ర పరిశోధనలకు, నూతన సిద్ధాంతాలను
రూపొందించటానికి నేను భగవద్గీతను ప్రధానమైన
ఉత్సాహకేంద్రంగా, మార్గదర్శకంగా స్వీకరించాను
– ఐన్‌స్టీన్

### కాలమానం

సమయానికి కాలమానం సంవత్సరాలు
గడిచిపోవడం కాదు,
ఆ కాలంలో మనం ఏం చేశాం, ఎలా ఉన్నాం,
ఏమి సాధించామన్నది ముఖ్యం
– జవహర్‌లాల్ నెహ్రూ

### ప్రయత్నించు

విజయం సాధించిన వ్యక్తిగా కాదు
విలువలు కలిగిన వ్యక్తిగా ఎదగటానికి ప్రయత్నించు
– అలర్ట్ విన్‌స్టీన్

### అవివేకం

తెలియని విషయాన్ని మాట్లాడటం అంటే
నీ అవివేకాన్ని బయట పెట్టుకోవటమే
– ఎమర్సాన్

### ఆభరణం

చిరునవ్వును మించిన అందం,
వినయాన్ని మించిన ఆభరణం మరొకటి లేదు
– ప్లేటో

### ప్రమాదం

అందరినీ నమ్మటం లేదా, ఎవ్వరిని నమ్మకపోవటం
రెండూ ప్రమాదకరమే
– అబ్రహాంలింకన్

### మార్గం

ఒక దారి మూసుకుపోయినప్పుడు తప్పకుండా
మరొక దారి తెరచి ఉంటుంది, దాన్ని గుర్తించ
గలగడమే విజయానికి మార్గం.
– అలెగ్జాండర్ గ్రాహంబెల్

### గొప్పవాడు

ఓటమి ఎరుగని వ్యక్తికన్నా
విలువలతో జీవించే వ్యక్తి గొప్పవాడు
– ఐన్‌స్టీన్

### ఉపయోగం ?

కేవలం పుస్తకాలు చదివి వదలివేస్తే ప్రయోజనం ఏముంది?
చెదపురుగులు కూడా పుస్తకాలను నమిలేస్తాయి.
అంతమాత్రాన జ్ఞానం వచ్చేసినట్లా
– డా॥ బి. ఆర్. అంబేడ్కర్

## పెళ్ళిరోజు మరియు జన్మదిన శుభాకాంక్షలు



ఆగస్టు 19వతేదీ హైదరాబాదులో
పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ వి. జయప్రకాష్, శ్రీమతి సాయిగౌతమి**

దంపతుల వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో
గడవాలని కోరుకుంటూ మరియు ఆగష్టు 27వ తేదీన
పుట్టిన రోజు జరుపుకుంటున్న వారి కుమారుడు

**చి॥ వి. నీలకంఠ సాయి హర్ష** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



సెప్టెంబరు 17వ తేదీన పవర్‌సిటీ, విశాఖపట్నంలో
తృతీయ జన్మదినము జరుపుకుంటున్న

**శ్రీ కె. శరత్‌చంద్రబాబు, శ్రీమతి కె. ఛాయకస్తూరి**
ల మనుమడు

**శ్రీ కె. యస్.యస్. త్రినాధ్, శ్రీమతి కె. రమ్యల**
కుమారుడైన

**చి॥ సాయి యువాన్ష్** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన మరియు పెళ్ళిరోజు శుభాకాంక్షలు



ఆగష్టు 12వ తేదీన వెంకటాపురంలో
పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**చి॥ ఎన్. సత్యంనాయుడు, చి॥ సౌ॥ మౌనిక**

లకు, వారి కుమారుడు ఆగష్టు 3వ తేదీన మొదటి
పుట్టిన రోజు జరుపుకుంటున్న



**చి॥ మణికంఠ** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ
కృపానుగ్రహము అందించాలని కోరుతూ
**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## పెళ్ళిరోజు శుభాకాంక్షలు



సెప్టెంబర్ 27వ తేదీన
మొదటి పెళ్ళిరోజు జరుపుకుంటున్న

**శ్రీ ఎల్. దుర్గారావు, శ్రీమతి మౌనిక** ల

వైవాహిక జీవితం సుఖమయ ఆనందాలతో గడవాలని
అందుకు శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము
అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన
శుభాకాంక్షలందజేస్తున్నది.



## జన్మదిన శుభాకాంక్షలు





శ్రీకాకుళంలో ఆగష్టు 4వ తేదిన జన్మదినము జరుపుకుంటున్న

**శ్రీమతి ఉషారాణి పట్నాయక్** గారికి

మరియు

ఆగష్టు 24వ తేదిన జన్మదినము జరుపుకుంటున్న

**శ్రీ హరికృష్ణ పట్నాయక్** గారికి

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహములు అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

## జన్మదిన శుభాకాంక్షలు



జూలై 12వ తేదీన మరియు సెప్టెంబర్ 10వ తేదీన పుట్టినరోజు జరుపుకుంటున్న

**శ్రీ వి. వెంకటరమణ, శ్రీమతి వి. నాగమణి** ల

కుమారులు **చి॥ గగన్, చి॥ జతిన్** లకు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ **సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.










## జన్మదిన శుభాకాంక్షలు

సెప్టెంబర్ 4వ తేదీన

మొదటి పుట్టిన రోజు జరుపుకుంటున్న

**శ్రీ ఆర్. సూర్య శ్రీనివాస్,**

**శ్రీమతి స్రవంతి**ల కుమారుడు

**చి॥ వెంకట సాయి భరద్వాజ్** కు

శ్రీ దత్తసాయి మాస్టర్ తమ కృపానుగ్రహము అందించాలని కోరుతూ

**సద్గురువాణి** తన శుభాకాంక్షలందజేస్తున్నది.

Printed, Published & Owned by Smt. V.S. LAKSHMI BRAMARAMBA, Address : M/s. Sri BHARADWAJA PUBLICATIONS, Plot No. 13, Power City, Near Gowthu Lachanna Nagar, Parawada Mandal, Visakhapatnam-21 and Printed at **M/s. UNITED POWER ENTERPRISES,** # 8-8-33(9), Opp. Hotel Sudha, Gajuwaka, Visakhapatnam-26 and Published at Power City, Visakhapatnam, Editor : **V.V. POORNA CHANDRA RAO**